www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 8-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 250
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 9.45 తదుపరి అష్టమి; నక్షత్రం: శతభిషం సా. 4.03 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.10.09-11.40; దుర్ముహూర్తం: సా.4.08-4.52; అమృతఘడియలు: ఉ.9.05-10.37; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

న్యాయాన్ని అవహేళన చేసిన రామజన్మభూమి తీర్పు

7

అయినా అందులోని 5 పేజీలు మాత్రం కీలకం

ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదించడం ఓ మంచి అంశం

అన్ని కోర్టుల్లో చదివి వినిపించాలి.. మాజీ న్యాయమూర్తి జస్టిస్ నారిమన్




బిలియనీర్ల భారత్

అత్యధిక బిలియనీర్లున్న దేశాల్లో మూడో స్థానం

- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 185 మంది కుబేరులు
- గత ఏడాదితో పోలిస్తే 21% పెరిగిన సంఖ్య
- 2015తో పోలిస్తే 123% అధికం
- యూబీఎస్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. స్విస్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ ఈ ఏడాదికి గాను విడుదల చేసిన బిలియనీర్స్ యాంబిషన్స్ నివేదిక ప్రకారం.. భారత్‌లో 185 మంది బిలియనీర్లు ఉన్నారు. 835 మంది బిలియనీర్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా.. 427 మందితో చైనా రెండో స్థానంలో ఉంది. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.8,465 కోట్లు) వ్యక్తిగత సంపద కలిగిన వారిని బిలియనీర్‌గా పిలుస్తారు.



భారత బిలియనీర్ల మొత్తం సంపద రూ.76.66 లక్షల కోట్లు

ఈ ఏడాది భారత్‌లో మరో 32 మంది బిలియనీర్లుగా అవతరించారు. గత ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 21 శాతం పెరగగా.. 2015తో పోలిస్తే 123 శాతం వృద్ధి నమోదైంది. దేశంలోని ప్రస్తుత బిలియనీర్ల మొత్తం సంపద గడిచిన ఏడాది కాలంలో 42.1 శాతం ఎగబాకి 90,560 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.76.66 లక్షల కోట్లు) చేరుకుందని యూబీఎస్ వెల్లడించింది. వచ్చే దశాబ్దకాలంలో భారత్‌లో బిలియనీర్ అంత్రప్రెన్యూర్ల సంఖ్య గణనీయంగా పెరగనుందని నివేదిక పేర్కొంది. భారత ఆర్థిక పరివర్తనంలో కుటుంబ వ్యాపారాలు కీలక పాత్ర పోషించాయని వెల్లడించింది. దేశంలో 108 కుటుంబ వ్యాపారాలు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాయని, లిస్టెడ్ కుటుంబ వ్యాపారాలు అత్యధిక సంఖ్యలో ఉన్న దేశాల్లో భారత్ ఒకటని యూబీఎస్ తెలిపింది.

మరిన్ని ముఖ్యాంశాలు

- ప్రపంచవ్యాప్త బిలియనీర్లు 2015లో 1,757 మంది ఉండగా.. 2024లో సంఖ్య 2,682కు చేరుకుంది. బిలియనీర్ల మొత్తం సంపద విలువ గడిచిన పదేళ్లలో 6.3 లక్షల కోట్ల డాలర్ల నుంచి 14 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది. అంటే ఏటేటా వీరి సంఖ్య 10 శాతం చొప్పున పెరిగింది.
- గడిచిన ఏడాది కాలంలో అమెరికాలో కొత్తగా 84 మంది బిలియనీర్లుగా అవతరించగా.. చైనాలో వీరి సంఖ్య 93 తగ్గింది. అమెరికన్ కుబేరుల మొత్తం సంపద 4.6 లక్షల కోట్ల డాలర్ల నుంచి 5.8 లక్షల కోట్ల డాలర్లకు పెరగగా.. చైనా బిలియనీర్ల వెల్త్ 1.8 లక్షల కోట్ల డాలర్ల నుంచి 1.4 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయింది.
- ప్రపంచ ప్రస్తుత కుబేరుల్లో 1,877 మంది స్వయం కృషితో ఎదిగినవారు కాగా..805 మందికి ఆస్తి వారసత్వంగా సంక్రమించింది.
- గడిచిన దశాబ్దకాలంలో టెక్ బిలియనీర్ల సంపద శరవేగంగా పెరుగుతూ వచ్చింది. 2015లో వీరి మొత్తం సంపద 78,890 కోట్ల డాలర్లుగా ఉండగా.. 2024 నాటికి మూడింతలై 2.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది.
- పారిశ్రామిక బిలియనీర్ల మొత్తం సంపద 48,040 కోట్ల డాలర్ల నుంచి 1.3 లక్షల కోట్ల డాలర్లకు పెరగగా.. మెటీరియల్స్ రంగ బిలియనీర్ల వెల్త్ 71,810 కోట్ల డాలర్ల నుంచి 1.8 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది.
- రియల్టీ రంగ బిలియనీర్ల సంపద వృద్ధి మాత్రం 53,400 కోట్ల డాలర్ల నుంచి 69,230 కోట్ల డాలర్లకు పరిమితమైంది. చైనాలో రియల్టీ సంక్షోభం, కమర్షియల్ రియల్టీపై కొవిడ్ సంక్షోభ ప్రభావం, అమెరికా, యూరప్‌లో గృహ రుణ వడ్డీ రేట్ల పెరుగుదల వంటి అంశాలు స్థిరాస్తి కుబేరుల సంపద వృద్ధిపై ప్రభావం చూపాయి.

న్యూ ఫండ్స్

సామ్కో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

సామ్కో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ (ఎంఏఏఎఫ్) ప్రారంభించింది. కంపెనీ సొంతంగా రూపొందించిన 'రొటేట్ వ్యూహం'తో దీన్ని తీసుకువచ్చింది. ఈక్విటీలు, బంగారం, డెట్/ఆర్బిట్రేజ్ వంటి వాటిల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000.

యాక్సిస్ క్రిసిల్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ బాండ్ ఎన్‌బీఎఫ్‌సీ-హెచ్‌ఎఫ్‌సీ-జూన్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 10. కనీస పెట్టుబడి రూ.5,000.

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ కాంగ్లోమిరేట్ ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ లిమిటెడ్.. కాంగ్లోమిరేట్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఓపెన్ ఎండెడ్ డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్ ఇది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్‌లో 33 శాతం వాటా కలిగిన 22 రంగాల్లోని 169 కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 19.

బజాజ్ ఫిన్‌సర్వ్ హెల్త్‌కేర్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. హెల్త్‌కేర్ ఫండ్‌ను ప్రారంభించింది. హెల్త్, వెల్‌నెస్ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. బీఎస్ఈ హెల్త్‌కేర్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 20.

కృత్రిమ మేధ స్టార్టప్‌ల హవా!

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 110 స్టార్టప్‌లకు యూనికార్న్ హోదా

అందులో 40 శాతం ఏఐ కంపెనీలే..

చెన్నై: కృత్రిమ మేధ (ఏఐ).. టెక్నాలజీ ప్రపంచంలో ప్రస్తుతం అందరి నోటా ఇదే మాట. స్టార్టప్‌ల రంగానికీ 2024 'ఏఐ నామ సంవత్సరమే'నని చెప్పాలి. ఎందుకంటే, ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 110 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను సాధించగా.. అందులో 40 శాతం ఏఐ కంపెనీలే. స్టార్టప్‌ల రంగం నిధుల కొరతతో సతమతం అవుతున్న నేపథ్యంలోనూ కొత్త పెట్టుబడుల ఆకర్షణ విషయంలో ఏఐ అంకురాలు హవా కనబరిచాయి. కనీసం బిలియన్ డాలర్ల (100 కోట్ల డాలర్లు=రూ.8,475 కోట్లు) విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. పిచ్‌బుక్ యూనికార్న్ ట్రాకర్ డేటా ప్రకారం.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 103 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను సాధించగా.. 2024లో సంఖ్య 110కు చేరుకుంది. అందులో అమెరికాకు చెందిన ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లైమెట్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, క్రిప్టో స్టార్టప్‌లే అధికం. మొత్తం 63 యూఎస్ స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా మారాయి. చైనాలో 16, ఇజ్రాయెల్ నుంచి 3, ఒక సింగపూర్ సంస్థ, 4 యూకే కంపెనీలూ ఈ హోదా దక్కించుకున్నాయి.

భారత్ నుంచి 5: ఓలా వ్యవస్థాపకుడు భవిశ్ అగర్వాల్‌కు చెందిన ఏఐ స్టార్టప్ కృత్రిమ్ సహా 5 భారత కంపెనీలు ఈ ఏడాది యూనికార్న్‌లుగా అవతరించాయి. బైక్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో, ఎస్ఏఏఎస్ కంపెనీ పెర్ఫియోస్, ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఏథర్, ఫిన్‌టెక్ సంస్థ మనీవ్యూ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో కలిపి దేశంలో యూనికార్న్‌ల సంఖ్య 110కి చేరుకుంది. అందులో 60 శాతం స్టార్టప్‌లు కొవిడ్ సంక్షోభం తర్వాతే (2021, 2022) ఈ హోదా సాధించాయి.

ఎన్‌జే బయోలో సువెన్ ఫార్మాకు 51% వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఎన్‌జే బయో ఇంక్‌లో 56 శాతం వాటాలను కొనుగోలు చేయనున్నట్లు సువెన్ ఫార్మాస్యూటికల్స్ ప్రకటించింది. సుమారు రూ.545 కోట్ల (6.44 కోట్ల డాలర్లు) ఈ వాటాను దక్కించుకున్నట్లు తెలిపింది. ఈ నెలాఖరుకల్లా ఈ డీల్‌ను ముగించే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది. అమెరికాలోని ప్రిన్స్‌టన్ కేంద్రంగా ఎన్‌జే బయో కార్యకలాపాలు సాగిస్తోంది. టెక్నాలజీ ఆధారిత సీడీఎంఓ, ఏడీసీ వంటి ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్‌ను అందించే లక్ష్యానికి అనుగుణంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు సువెన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. అంతేకాకుండా ఏడీసీ/ఎక్స్‌డీసీ విభాగంలో సువెన్ అంతర్జాతీయ కంపెనీగా ఎదిగేందుకు ఎన్‌జే బయో సామర్థ్యాలు తోడ్పడతాయని పేర్కొన్నారు.

జీఎస్‌టీ రికార్డులు, పద్దుల నిర్వహణ ఎలా..?

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి చాలా కాలమైనప్పటికీ జీఎస్‌టీలో నమోదైన చాలా మంది వ్యాపారులకు ఎలాంటి రికార్డులు నిర్వహించాలి, వీటిని ఎంతకాలం జాగ్రత్తగా ఉంచాలన్న విషయాల మీద ఇప్పటికీ అవగాహన లేదు. దీనివల్ల ఆడిట్ లేదా ఇతర తనిఖీలు జరిగేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూచించిన విధంగా రికార్డులు లేకపోయినా లేదా సరైన వివరాలు నమోదు చేయకపోయినా, తేడా ఉన్న మేరకు ఉల్లంఘన జరిగినట్లు భావించి చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. కాబట్టి జీఎస్‌టీలో నమోదైన అందరికీ ఈ రికార్డుల నిర్వహణ మీద అవగాహన కలిగి ఉండాలి.

ఇందులో మొదటిగా స్టాక్ రిజిస్టర్ గురించి చెప్పుకోవాలి. కాంపోజిషన్ స్కీమ్‌లో నమోదైన వారు తప్ప మిగతా వారందరూ స్టాక్ రిజిస్టర్ విధిగా నిర్వహించాలి. దీనిలో స్టాక్స్‌కు సంబంధించిన అన్ని వివరాలు అంటే ఓపెనింగ్ బ్యాలెన్స్, కొనుగోలు, అమ్మకం వివరాలు, క్లోజింగ్ బ్యాలెన్స్ వీటితో పాటు ఏదైనా సరుకు పనికి రాకుండా పోయినా, బహుమతుల రూపంలో ఉచితంగా ఇచ్చినా.. అలాంటి వివరాలన్నీ కచ్చితంగా చూపాలి.

అలాగే రిజిస్ట్రేషన్ తీసుకున్న ప్రతి ఒక్కరు అడ్వాన్సుల వివరాలు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో ఆయా వ్యక్తులు ఇచ్చిన అడ్వాన్సులు, తీసుకున్న అడ్వాన్సులు, వీటికి సంబంధించి చేసిన సర్దుబాట్లు విధిగా చూపాలి. అలాగే పన్ను చెల్లింపునకు సంబంధించిన వివరాలు అంటే చెల్లించాల్సిన పన్ను, వసూలు చేసిన, చెల్లించిన పన్ను వివరాలతో పాటు ఇన్‌పుట్ ట్యాక్స్‌కు సంబంధించిన వివరాలు, అలాగే రివర్స్ చార్జ్‌లో పన్ను చెల్లించాల్సి వస్తే వాటి వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలి. రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తి ఎగుమతులు, దిగుమతులు చేస్తే వాటికి సంబంధించిన వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను నిర్వహించాలి. తయారీ రంగంలో ఉన్న వ్యక్తి అయితే తాను ఉత్పత్తి చేసిన వస్తువుల తాలూకు రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది.

వర్క్స్ కాంట్రాక్ట్ సర్వీస్ రంగంలో ఉన్న వారు ప్రతి కాంట్రాక్టుకు సంబంధించి అన్ని వివరాలు అంటే చేసే పనికి సంబంధించిన వివరాలు, అందులో వాడే వస్తువులు, సేవల వివరాలు, కాంట్రాక్ట్ విలువ, కాంట్రాక్ట్ ఇచ్చిన వ్యక్తి వివరాలతో పాటు తాను వేరే వ్యక్తుల నుంచి ఏదైనా వస్తువులు లేదా సేవలు పొంది ఉంటే ఆయా వ్యక్తుల వివరాలు కూడా కాంట్రాక్ట్ వారీగా నమోదు చేయాలి.



రాంబాబు గొండాల

పైన తెలిపిన రికార్డులు అన్నీ కూడా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో ఉన్న 'ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్'లో అందుబాటులో ఉంచడంతో పాటుగా అదనపు వ్యాపార స్థలాల్లో (అడిషనల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్) సంబంధిత వివరాలు లభ్యమయ్యేలా ఉంచాలి. అయితే రికార్డులు అన్నీ భౌతిక రూపంలో కాకుండా ఎలక్ట్రానిక్ రూపంలో కూడా నిర్వహించవచ్చు.

అన్నిటి కంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ రికార్డులు 6 సంవత్సరాల పాటు కచ్చితంగా ఉంచాలి. మరి ఈ ఆరు సంవత్సరాల గడువు ఎప్పటి నుంచి లెక్కించాలి అంటే ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక (యాన్యువల్) రిటర్న్ నమోదు చేయటానికి ఇచ్చిన గడువు తేదీ నుంచి లెక్కించాలి. ఉదాహరణకు, ప్రస్తుత నిబంధన ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ 2024 డిసెంబరు 31. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులు కనీసం 2030 డిసెంబరు 31 వరకు కచ్చితంగా ఉంచాలి. అంతేకాకుండా, ఏదేనీ విచారణ ఎదుర్కొంటున్నా లేదా అప్పీల్ లేదా కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నా, విచారణ పూర్తయిన అనంతరం లేదా కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కనీసం ఒక సంవత్సరం పాటు ఉంచాలి. ఒకవేళ విచారణ ఆరేళ్ల కంటే ముందే అయిపోయినా.. పైన చెప్పినట్లు కనీసం ఆరు సంవత్సరాల పాటు ఆయా రికార్డులు ఉంచాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,600 ▼	71,100 ▼	1,00,000 ▼
ముంబై	76,187 ▼	69,787 ▼	90,820 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	82
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	93	అనంతపురం	82
గోదావరి	99		

అప్పగించినట్టేనా?

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 337 | భారత్ రెండో ఇన్నింగ్స్ 128/5


ట్రావిస్ హెడ్ రికార్డు శతకం — పింక్ బాల్ టెస్టు

అడిలైడ్: గులాబీ టెస్టులో భారత్‌కు భంగపాటు తప్పేలా లేదు. రెండో రోజు కూడా బ్యాటింగ్‌లో 'తడ'బ్యాటు' కొనసాగింది. ట్రావిస్ హెడ్ (141 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సర్లతో 140) మెరుపు సెంచరీతో కదం తొక్కిన చోట.. భారత బ్యాటర్లలో ఒక్కరు కూడా కనీసం 40 బంతులైనా ఎదుర్కోలేకపోయారు. దీంతో ఫ్లడ్ లైట్ల వెలుతురులో బౌలింగే కాదు.. బ్యాటింగ్ కూడా తమకు చేతకాదని నిరూపించారు. అండగా నిలవాల్సిన సీనియర్లు కెప్టెన్ రోహిత్ (6), విరాట్ (11) ఈసారీ స్వల్ప స్కోర్లకే వెనుదిరగడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. గిల్ (28), జైస్వాల్ (24) ఓ మాదిరి స్కోరుకే పరిమితమయ్యారు. ఫలితంగా శనివారం ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 128 పరుగులు చేసింది. ఆసీస్ 151 పరుగుల ఆధిక్యానికి ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది. రిషభ్ పంత్ (28 బ్యాటింగ్), నితీశ్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కమిన్స్, బోలాండ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 337 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (64) అర్ధసెంచరీ సాధించాడు. పేసర్లు బుమ్రా, సిరాజ్ నాలుగేసి వికెట్లతో చెలరేగడంతో చివరి వికెట్లు వేగంగా నేలకూలాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు మూడో రోజు పంత్, నితీశ్ ఎంతసేపు ఆసీస్ బౌలర్లను ఎదుర్కొంటారనేది చూడాలి. ఏదేమైనా పింక్ బాల్ టెస్టులో ఆసీస్ తిరుగులేని ఆధిక్యంలో కొనసాగుతోంది. భారత్ ఈ టెస్టులో గెలవాలంటే అద్భుతాలు జరగాల్సిందే.



స్టార్క్ బౌలింగ్‌లో గిల్ (28) క్లీన్‌బౌల్డ్

హెడ్ విధ్వంసం: క్రీజులో కుదురుకుంటే ట్రావిస్ హెడ్ ఎంతటి ప్రమాదకర బ్యాటరో క్రికెట్ అభిమానులకు తెలియంది కాదు. గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌తో పాటు ఐపీఎల్‌లో అతడు విధ్వంసకర ఆటతీరుతో విరుచుకుపడ్డాడు. ఈసారి కూడా అతను ఎదురుదాడికి దిగి ఆసీస్‌కు కీలక ఆధిక్యాన్ని అందించాడు. రెండో రోజు ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య క్రీజులోకి వచ్చిన లోకల్ బాయ్ హెడ్ వారినేమాత్రం నిరాశపర్చలేదు. భారత బౌలర్లను అలవోకగా ఆడేస్తూ పరుగులు రాబట్టాడు. అయితే షార్ట్ బంతులను ఆడడంలో ఇబ్బంది ఎదుర్కొనే హెడ్‌కు ఆ తరహా బంతులు వేయడంలో మాత్రం భారత బౌలర్లు విఫలమయ్యారు. ఇక శనివారం తొలి సెషన్ ఆరంభంలోనే ఓపెనర్ మెక్‌స్వీనే (39), స్మిత్ (2) వికెట్లను బుమ్రా తీశాడు. అటు ఫామ్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న లబుషేన్ మాత్రం తన స్థాయికి తగ్గ ఆటను కనబర్చాడు. ఓపికను కనబరుస్తూనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత హర్షిత్ ఓవర్‌లో మూడు ఫోర్లతో చెలరేగాడు. అయితే హెడ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జత చేశాక నితీశ్ ఓవర్‌లో లబుషేన్ వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో హెడ్ ఆటతీరులో వేగం పెరిగింది. మార్ష్ (9) అవుటయ్యాక బ్యాట్ ఝుళిపించాడు. హెడ్ 76 రన్స్ వద్ద ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ వదిలేశాడు. దీంతో హర్షిత్‌ను లక్ష్యంగా చేసుకుని వరుస బౌండరీలతో రన్స్ రాబట్టిన హెడ్.. 111 బంతుల్లోనే శతకం అందుకున్నాడు. క్యారీ (15)తో కలిసి ఆరో వికెట్‌కు 74 రన్స్ జోడించాడు. అయితే తన ఓవర్‌లో 4,6తో ఊపు కనబర్చిన హెడ్‌ను సిరాజ్ సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. ఆఖరి సెషన్ ఆరంభమైన 2.3 ఓవర్లలోనే మిగతా 2 వికెట్లను సిరాజ్ తీయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసింది.



హెడ్ (140)

2 గులాబీ టెస్టుల్లో అత్యధిక సెంచరీలు (3) నమోదు చేసిన రెండో బ్యాటర్‌గా హెడ్. లబుషేన్ (4) టాప్‌లో ఉన్నాడు.

పేలవంగా..: రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్లు నిరాశపరుస్తున్నారు. ఆసీస్ పేసర్ల కట్టుదిట్టమైన బంతులకు పరుగుల సంగతేమో కానీ వికెట్లు కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఓపెనర్లు ఈసారీ శుభారంభం అందించలేదు. తొలి టెస్టులో ఆకట్టుకున్న రాహుల్ (7), జైస్వాల్‌తో పాటు మిగతా బ్యాటర్లు కూడా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో విఫలమయ్యారు. కమిన్స్ ధాటికి ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లోనే రాహుల్ వెనుదిరగగా, జైస్వాల్‌ను తొమ్మిదో ఓవర్‌లో బోలాండ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత బోలాండ్ లెంగ్త్ బాల్‌ను డిఫెన్స్ ఆడాలని చూసిన విరాట్ (11) కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీనికి తోడు స్టార్క్ ఇన్‌స్వింగర్‌కు గిల్ క్లీన్‌బౌల్డ్ కావడంతో జట్టు 86/4 స్కోరుతో కష్టాల్లో పడింది. అలాగే రోహిత్‌ను సైతం కమిన్స్ అద్భుత బంతితో బౌల్డ్ చేసి పెవిలియన్‌కు చేర్చాడు. పంత్ మాత్రం తన సహజశైలిలో బౌండరీలు సాధిస్తూ.. నితీశ్‌తో కలిసి రోజును ముగించాడు.



రోహిత్ (6)

1 డే/నైట్ టెస్టుల్లో వేగవంతమైన (111 బంతుల్లో) సెంచరీ సాధించిన బ్యాటర్‌గా హెడ్. తర్వాతి రెండు స్థానాలు (112, 125 బంతుల్లో) కూడా అతడివే కావడం విశేషం.

2 డే/నైట్ టెస్టుల్లో ఒకే రోజు ఎక్కువ పరుగులు (379) నమోదు కావడం ఇది రెండోసారి. 2019లో ఇదే వేదికపై ఆసీస్-పాక్ మ్యాచ్‌లో 383 పరుగులు వచ్చాయి.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనే (సి) పంత్ (బి) బుమ్రా 39; లబుషేన్ (సి) జైస్వాల్ (బి) నితీశ్ 64; స్మిత్ (సి) పంత్ (బి) బుమ్రా 2; హెడ్ (బి) సిరాజ్ 140; మార్ష్ (సి) పంత్ (బి) అశ్విన్ 9; క్యారీ (సి) పంత్ (బి) సిరాజ్ 15; కమిన్స్ (బి) బుమ్రా 12; స్టార్క్ (సి) హర్షిత్ (బి) సిరాజ్ 18; లియోన్ (నాటౌట్) 4; బోలాండ్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 87.3 ఓవర్లలో 337 ఆలౌట్. వికెట్ల పతనం: 1-24, 2-91, 3-103, 4-168, 5-208, 6-282, 7-310, 8-332, 9-332, 10-337. బౌలింగ్: బుమ్రా 23-5-61-4; సిరాజ్ 24.3-5-98-4; హర్షిత్ రాణా 16-2-86-0; నితీశ్ 6-2-25-1; అశ్విన్ 18-4-53-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) బోలాండ్ 24; రాహుల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 11; పంత్ (బ్యాటింగ్) 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ (బ్యాటింగ్) 15; ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 24 ఓవర్లలో 128/5. వికెట్ల పతనం: 1-12, 2-42, 3-66, 4-86, 5-105. బౌలింగ్: స్టార్క్ 9-0-49-1; కమిన్స్ 8-0-33-2; బోలాండ్ 7-0-39-2.

సిరాజ్ × హెడ్



రెండోరోజు ఆటలో హెడ్, సిరాజ్ మధ్య మాటల యుద్ధంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. భారత బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ హెడ్ సెంచరీతో పాటు ఆసీస్ ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించాడు. అత్యంత ప్రమాదకరంగా మారిన అతడిని చివరకు సిరాజ్ సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. అంతకుముందు హెడ్ మొదటి, మూడో బంతులను 4,6 బాదడంతో సిరాజ్ తీవ్ర అసహనంతో ఉన్నాడు. తర్వాతి బంతికే హెడ్ వికెట్ దక్కడంతో అతడివైపు సిరాజ్ ఉరిమి చూస్తూ 'వెళ్లిపో' అన్నట్టు సైగ చేశాడు. అటు హెడ్ బదులిస్తూ నోటికి పనిచెప్పాడు. అయినా తగ్గకుండా సిరాజ్ ఎహె.. పో అన్నట్టుగా మరోసారి పెవిలియన్‌వైపు చేయి చూపించాడు. కానీ హెడ్ స్థానిక క్రికెటర్ కావడంతో భారీస్థాయిలో హాజరైన అడిలైడ్ ప్రేక్షకులు మాత్రం సిరాజ్‌ను పదేపదే గేలి చేయడం కనిపించింది. మ్యాచ్ ముగిశాక హెడ్ ఈ ఘటనపై స్పందించాడు. సిరాజ్‌ను చక్కగా బౌలింగ్ చేశావని కొనియాడినా, అతడే తప్పుగా అర్థం చేసుకున్నాడని చెప్పుకొచ్చాడు.

స్పోర్ట్స్

మహిళల రెండో వన్డే నేడు
ఆస్ట్రేలియా × భారత్
ఉ. 5.15 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

అండర్-19 ఆసియా కప్ ఫైనల్ నేడు
భారత్ × బంగ్లాదేశ్
ఉ.10.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఇంగ్లండ్ ఆధిక్యం 533

- రెండో ఇన్నింగ్స్ 378/5
- కివీస్ తొలి ఇన్నింగ్స్ 125

వెల్లింగ్టన్: ఆతిథ్య న్యూజిలాండ్‌తో రెండో టెస్టుపై ఇంగ్లండ్ పూర్తిగా పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్‌ను 125 పరుగులకే కుప్పకూల్చిన పర్యాటక జట్టు.. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజైన శనివారం ఆట ముగిసేసరికి 5 వికెట్లకు 378 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా దూసుకెళుతోంది. ఓపెనర్ డకెట్ (92), జాకబ్ బెతెల్ (96) కొద్దిలో సెంచరీలు చేజార్చుకోగా.. జో రూట్ (73 నాటౌట్), బ్రూక్ (55) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. ఓవరాల్‌గా ఇంగ్లండ్ 533 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 280 స్కోరు చేసిన సంగతి తెలిసిందే. రూట్‌కు జతగా స్టోక్స్ (35 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. సౌతీ, హెన్రీ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 86/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. హ్యాట్రిక్ హీరో అట్కిన్సన్ (4/31), బ్రైడన్ కార్స్ (4/46) ధాటికి మరో 39 పరుగులు జోడించి ఆలౌటైంది. ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన 15వ బౌలర్‌గా అట్కిన్సన్ నిలిచాడు. ఇక, టెస్టుల్లో ఆ దేశం నుంచి హ్యాట్రిక్ నమోదవడం 2017 (మొయిన్ అలీ) తర్వాత ఇదే తొలిసారి. కాగా, ఓవరాల్‌గా 1082వ టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఇంగ్లండ్.. టెస్టు క్రికెట్ చరిత్రలో 5 లక్షలకు పైగా పరుగులు చేసిన తొలి జట్టుగా అరుదైన ఘనత సాధించింది.

బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శిగా దేవజిత్

న్యూఢిల్లీ: బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శిగా 55 ఏళ్ల దేవజిత్ సైకియా నియమితులయ్యాడు. అసోంకు చెందిన ఈ మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ ప్రస్తుతం బీసీసీఐలో సంయుక్త కార్యదర్శిగా ఉన్నాడు. ఈ మేరకు అతని నియామకాన్ని ఖరారు చేస్తున్నట్టు బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రకటించాడు. ఇప్పటిదాకా బోర్డు కార్యదర్శిగా ఉన్న జై షా ఇటీవలే ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కాగా, వచ్చే ఏడాది సెప్టెంబరులో బీసీసీఐ కార్యవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. అప్పటిదాకా దేవజిత్ ఈ పదవిలో కొనసాగనున్నాడు.

మళ్లీ అదే ఫలితం

- లిరెన్‌తో గుకేష్ పదోగేమ్ డ్రా

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డ్రాల పర్వం కొనసాగుతోంది. వరుసగా ఏడో గేమ్‌లోనూ ఫలితం తేలలేదు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, భారత స్టార్ గుకేష్ మధ్య శనివారం జరిగిన పదో రౌండ్ డ్రాగా ముగిసింది. నల్లపావులతో ఆడిన గుకేష్ 36వ ఎత్తు వద్ద డ్రాకు అంగీకరించాడు. టోర్నీలో ఇది ఎనిమిదో డ్రా. లిరెన్ ఆరంభ రౌండ్లో గెలవగా.. మూడో రౌండ్‌ను గుకేష్ నెగ్గాడు. మరో 4 గేమ్‌లు మిగిలున్న టోర్నీలో ప్రస్తుతం ఇద్దరు చెరో 5 పాయింట్లతో సమంగా నిలిచారు. ముందుగా 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలవనున్నాడు. ఒకవేళ మొత్తం రౌండ్లు ముగిసేసరికి ఇద్దరూ 7 పాయింట్లతో సమంగా నిలిస్తే.. టైబ్రేకర్ ద్వారా చాంపియన్‌ను నిర్ణయిస్తారు.

ఐటీఎఫ్ టైటిల్ విజేత రిషిత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్ 100 టైటిల్‌ను హైదరాబాద్ అమ్మాయి రిషిత రెడ్డి దక్కించుకుంది. పుణెలో శనివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో రిషిత 6-2, 7-5తో అయోయ్ వతనాబే (జపాన్)పై గెలిచింది. గత మూడు వారాల్లో రిషితకిది హ్యాట్రిక్ టైటిల్.

జాతీయ అథ్లెటిక్స్‌లో తీన్‌మార్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అథ్లెట్లు మూడు పతకాలు కొల్లగొట్టారు. శనివారం భువనేశ్వర్‌లో జరిగిన ఈ పోటీల్లో బాలుర ట్రయథ్లాన్ ఏ-గ్రూప్‌లో శ్రీకాంత్ రజతం, సీ-గ్రూప్‌లో నగేష్ రజతం, బాలికల ట్రయథ్లాన్ ఏ గ్రూప్‌లో నక్షత కాంస్యం సాధించారు.

దక్షిణాఫ్రికాదే పైచేయి

గెబెహా: శ్రీలంకతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 221 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. మూడో రోజు శనివారం ఆట ముగిసేసరికి ఈ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 191/3 స్కోరు చేసింది. అంతకుముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 328 రన్స్‌కు ఆలౌటైంది. పేసర్ జాన్సెన్ ఐదు వికెట్లతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 358 రన్స్ చేసింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 8-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 250 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

నల్లగొండలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభకు భారీగా హాజరైన ప్రజలు



అడ్డగోలు మాటలొద్దు

కేసీఆర్ తరహాలో మీరూ నోరు జారొద్దు

- బీజేపీ అధ్యక్షుడికి సీఎం రేవంత్ హితవు
- బీజేపీ రాష్ట్రాల్లో ఏడాదిలో 55,413 ఉద్యోగాలిస్తే ఢిల్లీలో క్షమాపణ చెబుతా
- ప్రధాని మోదీకి ఇదే నా సవాల్
- బీఆర్ఎస్, కేసీఆర్‌ని నకలు కొడుతున్న ఈటల, కిషన్‌రెడ్డి
- దొంగల సోపతితో దొంగల బండి ఎక్కొద్దు
- కేసీఆర్.. అధికారం ఉంటే ఉప్పొంగడం లేకుంటే కుంగిపోవడం తగదు
- మేం మీలా కాదు.. విపక్షంగా పోరాడాం
- దుష్ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలి
- నల్లగొండ బహిరంగ సభలో సీఎం రేవంత్
- మూసీని ప్రక్షాళన చేయకపోతే నల్లగొండలో ఎవరూ బతకరని వ్యాఖ్య

నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "అడ్డగోలుగా మాట్లాడొద్దు నడ్డా.." అంటూ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ జాతీయ అధ్యక్షుడిని హెచ్చరించారు. కేసీఆర్ తరహాలో మాట్లాడొద్దంటూ హితవు పలికారు. "నడ్డా తెలంగాణ గడ్డ మీద అడ్డగోలుగా మాట్లాడవద్దు. ఆయన్నే కాదు.. ప్రధాని మోదీనీ సవాల్ చేస్తున్నా. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యంలో ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. మీ పార్టీ 23 ఏళ్లుగా అధికారంలో ఉన్న, మీరే స్వయంగా 13 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న గుజరాత్‌లో ఇలా ఇచ్చారా? మీ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఒక్క ఏడాదిలో ఇన్ని ఉద్యోగాలిచ్చినట్లు నిరూపించగలరా? అలా నిరూపిస్తే, నేను ఢిల్లీ నడిబొడ్డున నిలబడి మీకు క్షమాపణ చెబుతా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానికి సవాల్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో బ్రాహ్మణవెల్లంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని, దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ యూనిట్-2లో విద్యుత్తు ఉత్పత్తిని రేవంత్ ప్రారంభించారు. నల్లగొండలో వైద్య కళాశాల

మిగతా 11వ పేజీలో...



అట్టహాసంగా విజయోత్సవాలు

- 3 రోజుల పాటు ముగింపు వేడుకలు.. హెచ్ఎండీఏ భారీ ఏర్పాట్లు
- నేడు సాగర్ తీరంలో ఎయిర్ షో.. రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- హైదరాబాద్‌లో లక్ష మందితో బహిరంగ సభ 11
- ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి.. ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

మభ్యపెట్టి.. అధికారంలోకి

- ప్రజలకు మోసపూరిత హామీలివ్వడమే కాంగ్రెస్ నైజం
- తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌లో.. ఇలానే గెలిచింది
- రేవంత్ సర్కారు మోసాలను ఎండగట్టేందుకే వచ్చా



హైదరాబాద్ సభలో అభివాదం చేస్తున్న నడ్డా. చిత్రంలో లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల

- అప్పులతో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు
- రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి నడుం బిగించాం
- ఒక్కసారి బీజేపీ అధికారంలోకి వస్తే.. శాశ్వతంగా ఉంటుంది
- హైదరాబాద్ బహిరంగసభలో పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా
- రేవంత్, కేసీఆర్ కవలలు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల డీఎన్ఏ ఒక్కటే
- కాషాయజెండా ఎగురవేసే దాకా పోరాటం ఆపం: కిషన్‌రెడ్డి
- మంత్రుల్లో సగం మంది అర్బన్ నక్సల్సే
- ఉద్యోగాలు ఎక్కడిచ్చారు? పాకిస్థాన్.. బంగ్లాదేశ్‌లోనా?: బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి, మభ్యపెట్టి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా ఆరోపించారు. అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని దించేవరకు బీజేపీ కార్యకర్తలు పోరాడుతారని హెచ్చరించారు. తెలంగాణలో ఏడాదిగా ఉన్న ప్రభుత్వం మోసాలను, అబద్ధాల పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు తాను వచ్చానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీజేపీ బహిరంగసభ నిర్వహించింది. ఈ సభలో జేపీ నడ్డాతోపాటు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్ తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడ్డా ప్రసంగిస్తూ.. తెలంగాణతోపాటు హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శలు గుప్పించారు. హిమాచల్‌లో కార్మికులకు పాత పింఛను పథకం, ఐదు లక్షల ఉద్యోగాలని చెప్పి మోసగించిందని, కర్ణాటకలో అంగన్‌వాడీలకు రూ.15 వేలు ఇస్తామని

మిగతా 12వ పేజీలో...

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఖట్టర్.. లేదా శివరాజ్‌సింగ్! 7



తెలంగాణ తల్లి విగ్రహం
ఆవిష్కరణకు రండి

- మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన పొన్నం
- ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి పిలుపు.. గంటపాటు అక్కడే
- కేసీఆర్ కోరడంతో భోంచేశా.. ఆప్యాయంగా మాట్లాడారు:మంత్రి

మర్కుక్, హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికింది. సోమవారం జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేయాలంటూ కేసీఆర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ఇందుకు ఆయన శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రి వెంట ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, ఇతర అధికారులు ఉన్నారు. మంత్రి, అధికారులు గంటపాటు ఫామ్‌హౌస్‌లోనే ఉన్నారు. అనంతరం పొన్నం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ప్రజాపాలన విజయోత్సవాల

మిగతా 11వ పేజీలో...

గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికీ పొన్నం ఆహ్వానం 11

భారత్‌పై కుట్ర

- అస్థిరపరిచేందుకు అమెరికా పన్నాగం
- ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకున్నారు
- జర్నలిస్టులు, రాహుల్‌తో కలిసి కుతంత్రం
- అమెరికాపై బీజేపీ సంచలన ఆరోపణలు
- ఇవి సరికాదన్న అగ్రరాజ్యం



న్యూఢిల్లీ, డిసెంబరు 7: అమెరికా విదేశాంగ శాఖపై బీజేపీ నిప్పులు చెరిగింది. భారత దేశాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని విమర్శలు గుప్పించింది. పరిశోధనాత్మక జర్నలిస్టులు సహా భారత విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతో కలిసి ఈ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ చేసిన ఈ విమర్శలు రాజకీయంగా పెను సంచలనానికి దారి తీశాయి. అమెరికా-భారత్‌ల మధ్య గత రెండు దశాబ్దాలుగా సుహృద్భావ సంబంధాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతం అదానీ కేంద్రంగా అమెరికా దర్యాప్తు సంస్థ చేసిన ఆరోపణలు.. ప్రస్తుతం బీజేపీ చేసిన వ్యాఖ్యలు అందరినీ విస్మయానికి గురి చేశాయి. ఆర్గనైజ్డ్ క్రైం, కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్(ఓసీసీఆర్‌పీ) కథనాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ అదానీ గ్రూపుపై ఏకపక్షంగా విమర్శలు చేస్తోందని బీజేపీ దుయ్యబట్టింది. మోదీ ప్రభుత్వాన్ని అణిచివేయాలని

మిగతా 7వ పేజీలో...



సంక్రాంతిలోపు భూ సమస్యలకు
మోక్షం

- గతంలో కన్నా మెరుగ్గా ట్రైబ్యునల్ వ్యవస్థ
- 2 రోజుల్లో వీఆర్వో వ్యవస్థపై నిర్ణయం
- 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల ఆధారంగానే 1900 కోట్ల విలువైన భూముల్ని కాపాడాం
- అనవసర ఖర్చుల కోసం భూములు అమ్మం
- అవసరమైతే 0.5% స్టాంప్ డ్యూటీ తగ్గిస్తాం
- మంత్రిగా ఏడాదిలో సంతృప్తి: పొంగులేటి

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ] 10

- ఒకే కుటుంబ పాలనకు కాలం చెల్లింది
- మా ప్రభుత్వంలో నిజాయతీ, పారదర్శకత
- కృష్ణాలో 70% వాటాను సాధించి తీరుతాం
- ఫిబ్రవరిలోగా సన్న బియ్యం: ఉత్తమ్
- కులగణన ఆధారంగా సంక్షేమ పథకాలు
- త్వరలో మరిన్ని కొత్త బస్సులు: పొన్నం

భూదాన్ పోచంపల్లి సమీపంలో చెరువులోకి దూసుకెళ్లిన కారును బయటకు తీస్తున్న పోలీసులు



ఉరిమే ఉత్సాహమే
ఉత్పాతమై..

- అదుపుతప్పి పల్టీకొట్టి చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఐదుగురు యువకుల దుర్మరణం.. ఒకరు సురక్షితం
- అందరూ స్నేహితులే.. 19-23 ఏళ్ల మధ్య వయస్కులే
- యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి వద్ద ఘోరం

భూదాన్‌పోచంపల్లి, మన్సూరాబాద్/వనస్థలిపురం/కొత్తపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆ ఆరుగురూ స్నేహితులు! అంతా కలిసి సరదాగా కార్లో షికారు చేయాలనుకున్నారు. ఎవరికి వారు తల్లిదండ్రులకు ఏదో చెప్పి ఇంట్లోంచి బయటపడ్డారు. కార్లో రయ్‌మంటూ దూసుకెళ్తుండగా ఓ మూల మలుపు వద్ద అదుపు తప్పిన వాహనం చెరువులోకి దూసుకెళ్లింది. ఆరుగురిలో ఐదుగురు దుర్మరణం

మిగతా 12వ పేజీలో...

108 చోరీ

- 130 కి.మీ. ఛేజింగ్
- వాహనంతో ఏఎస్సైని ఢీ కొట్టిన దొంగ
- ఎట్టకేలకు అరెస్టు

3



ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా గంగాధర్

- తెలంగాణ తల్లి విగ్రహ రూపకర్తకు పదవి
- ప్రస్తుతం ఫైన్స్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్

7



'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా డిసెంబరు 21

- తీర్మానానికి ఐరాస ఏకగ్రీవ ఆమోదం
- ప్రతిపాదించిన భారత్, పలు దేశాలు

7



బంగ్లాలో మరో ఇస్కాన్ ఆలయం ధ్వంసం

- దేవతల విగ్రహాలకు దుండగుల నిప్పు
- ఢాకా జిల్లా ధౌర్ గ్రామంలో ఘటన
- వారం రోజుల్లో రెండో ఉదంతం



ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్ రాజు

- రెండేళ్ల పాటు పదవిలో
- మర్యాదపూర్వకంగా సీఎంను కలిసిన అగ్రనిర్మాత

8



7

సారథ్యానికి సిద్ధమే..

- 'ఇండియా'ను బెంగాల్ నుంచే నడిపిస్తా
- విపక్ష కూటమిని పెట్టింది నేనే: మమత

మహిళలపై హింసాత్మక దురాగతాలు, ఇస్లాం వ్యతిరేక ఉన్మాదం, ఎడతెగని యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, నిరంకుశ ప్రభుత్వాలతో సతమతమవుతున్న ప్రస్తుత దశకం 1920లకు ఏ మాత్రం సమజోడీ కాదు. ఆధునిక వివేచన భారతీయులలో వికసించేందుకు 1920ల తరం దోహదం చేసింది. 2020 లనాటి మన తరం కాలం చెల్లిన సంప్రదాయాలపై మక్కువ చూపుతోంది.

వెలుగులు విరజిమ్మిన ఆ ఇరవైలు

గతం అంటే.. అనేకమైన విషయాలు. భవిష్యత్తు లేదా సుదూర సంఘటనలను చూపే ఒక దివ్య దర్పణం; అది వర్తమానం యథార్థ స్థితినీ చూపుతుంది. వర్తమానం ఉనికి గతించిన కాలం సమగ్రాకృతి. నాలో నేను, నా భారతదేశం గురించి ఆలోచిస్తూ వర్తమానాన్ని రూపుదిద్దేందుకు ఒకటిగా కలిసిన అనేక గతాల వైపు నా మనో దృక్కులను సారించాను. ఈ అన్వేషణలో మూడు గతించిన దశాబ్దాలు విశిష్టంగా, విలక్షణంగా కనపడ్డాయి. వర్తమాన భారతదేశాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రూపొందించిన ఆ మూడు దశకాలు: 1990లు, 1940లు; 1920లు.

అసాధారణ రాజకీయ, ఆర్థిక సంఘటనలకు 1990లు కాల వేదిక కాగా కొత్త యుగానికి నాంది పలికిన చరిత్రాత్మక నవోదయాలు 1940ల్లో సంభవించాయి. ఈ రెండు దశకాలతో పోల్చినప్పుడు 1920ల్లో అంత నాటకీయత కనిపించదు. అయినప్పటికీ అవి నవ భారతదేశం ఆవిర్భావాన్ని విస్తృతంగా ప్రభావితం చేశాయి. భారతదేశ ఆధునికతను సృజించి, అభివృద్ధిపరిచిన ఒక కొత్త సంవేదనీయత లేదా రసార్ద్రత ప్రభవించేందుకు ఇరవయో శతాబ్ది మూడో దశకం దోహదం చేసింది. ఇప్పుడు 2020ల్లో ఉన్న మనం, ఒక శతాబ్ది దూరంలో, 1920ల్లో భారతదేశం ఎలా ఉంది, ఏమి చేస్తుందో తెలుసుకోవడం సంతోషప్రదంగానే కాకుండా కొంచెం వినోదకరంగా కూడా ఉంటుంది.

1920 దశకాన్ని మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1920లో గుజరాత్ విద్యాపీఠ్‌ను నెలకొల్పడం, 1930లో మహాత్ముడు ప్రపంచ ప్రసిద్ధ దండియాత్ర నిర్వహించడం మధ్య కుండలీకరణం చేయవచ్చు. అలాగే బిఆర్ అంబేద్కర్ 1920లో మూక్ నాయక్ ను ప్రారంభించడం నుంచీ 1932లో పూనా ఒడంబడికపై సంతకం చేయడం మధ్య కాలాన్ని కూడా 1920 దశకంగా చేయవచ్చు. ఆగస్టు 1919లో విక్రమ్ సారాభాయి జననం, 1930లో సివి రామన్ కు భౌతిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించడం మధ్య కాలాన్ని 1920 వ దశకం గా కుండలీకరణం చేయవచ్చు. ఆధునిక భారదేశ ఆధ్యాత్మిక నాయకుల విషయానికి వస్తే తొట్ట తొలుత రమణ మహర్షి 1922లో నెలకొల్పిన రమణాశ్రమం ను ప్రముఖంగా ప్రస్తావించ వలసి ఉంది. 1926లో అరవిందుడు దివ్యజీవన ప్రపక్తగా ప్రభవించారు.

జాతి మేధా, కళా సంవేదనీయతను తీర్చిదిద్దిన అసాధారణ ప్రతిభావంతులు చిన్న పట్టణాల నుంచి ప్రభవించడం 1920ల్లోనే ప్రారంభమయింది. ప్రపంచ ప్రసిద్ధ ఆధునిక భారతదేశ చిత్ర లేఖనకారుల్లో కొంతమంది చిన్న పట్టణాలలోనే జన్మించారు. ఎఫ్ ఎన్ సౌజా 1924లో గోవాలోని శాలిగావ్‌లో జన్మించారు; ఎస్ హెచ్.రాజా 1922లో కక్కాయియాలో పుట్టారు; వి ఎస్ గయిటోండె 1924లో నాగపూర్‌లోను, త్యేబ్ మెహతా 1925లో కపాడ్‌వాంజ్ లో జన్మించారు. వీరంతా చిత్రకళలో అసాధారణ ప్రతిభావంతులు. వారు సృజించిన వర్ణ శోభిత చిత్రకళా రాజాలు దేశంలోనూ, ప్రపంచమంతటా కళాకృతుల సేకరణ కర్తలను, కళాభిమానులను ఆకట్టుకుంటున్నాయి.



ధార్వాడ్ సమీపంలో రోనా అనే పల్లె జనాభా ప్రస్తుతం 25,000. ఒక శతాబ్దం క్రితం ఆ గ్రామంలో కొన్ని వందల మంది మాత్రమే ఉండేవారు. ఇరవయో శతాబ్ది శాస్త్రీయ సంగీతకారులలో మహోన్నతుడు అయిన భీమ్ సేన్ జోషీ 1922లో రోనాలో జన్మించారు. సప్తస్వరాలను లోకోత్తరంగా మంత్రించి ప్రపంచాన్ని సమ్మగ్ధం చేసి భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఒక విలక్షణ గుర్తింపు సమకూర్చిన సంగీతవేత్తలు 1920 దశకం బిడ్డలే. భారతీయ వెండితెర మాంత్రికులలో విశ్వవిఖ్యాతుడు సత్యజిత్ రే 1921లోను, రిత్విక్ ఘటక్ 1925లోను, గురుదత్ 1925లోను జన్మించారు. భారతీయ సంవేదనలను నిర్వచించడమే కాకుండా ప్రపంచంలో భారత్‌కు కీర్తిప్రతిష్ఠలను విశిష్టంగా నిర్మించిన చలనచిత్ర కళాస్రష్టలు వారు. పండిట్ రవిశంకర్ 1920లో జన్మించారు. మధుర గాయకులు హేమంత్ కుమార్ 1920లోను, తలత్ మహమ్మద్ 1924లోను, కిశోర్ కుమార్ 1929లోను, గంధర్వ గాయని లతా మంగేష్కర్ 1929లోను జన్మించారు. భారతీయ సినిమా, ముఖ్యంగా బాలీవుడ్ 1920ల బిడ్డల భుజస్కంధాలపై నిలిచింది. ఇరవయో శతాబ్దిలో చాలవరకు భారతీయ రసభావ రంజిత దృష్టిని ప్రభావితం చేసిన దిలీప్ కుమార్ 1922లోను, దేవ్ ఆనంద్ 1923లోను, రాజ్ కపూర్ 1924లోను జన్మించారు.

ఇరవయో శతాబ్ది భారతీయ ఆధునికతను పరిపూర్ణంగా ప్రభావితం చేసిన సాహితీ స్రష్టలు 1920ల్లోనే జన్మించారు. శ్రీలాల్ శుక్లా 1925లోను, మహా శ్వేతా దేవి 1926లోను, ఖుర్రాతులైన్ హైదర్ 1927లోను జన్మించారు. ఇరవయో శతాబ్ది భారతీయుల కళా సంవేదనలను, సాహిత్య అభిరుచులను అనితర సాధ్యంగా ప్రభావితం చేసినవారందరూ 1920ల్లో జన్మించిన వారే. ఎంతోమంది గాయనీ గాయకుల, రచయితల, కళాకారుల, వైజ్ఞానికుల తొలి బాల్యం 1920ల్లోనే గడిచిందన్నది ఒక సత్యం. ఆ రోజుల్లో ఏమి మహత్యం ఉందో గానీ ఆనాటి ఆ బాలలు దాన్ని స్వాయత్తం చేసుకుని తదనంతర జీవితంలో తమ సృజనాత్మక ప్రతిభతో దాన్ని సమున్నతం చేశారు. 1924లో బెల్గాంలో భారత జాతీయకాంగ్రెస్ వార్షిక మహాసభకు మహాత్మా గాంధీ అధ్యక్షత వహించారు. ఐదు సంవత్సరాల అనంతరం 1929లో లాహోర్ లో జరిగిన కాంగ్రెస్ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసింది. 1920ల్లోనే భారత్ విశాల ప్రపంచానికి సన్నిహితమయింది. 'ప్రపంచపు బాధను తన బాధగా' స్వాతంత్ర్యసాధనలో నిర్ణయాత్మకంగా ముందంజ వేస్తున్న భారత్ భావించింది. ఇటలీలో బెనిటో ముస్సోలినీ బ్లాక్ షర్ట్ దళాల నేర్పాటు చేశాడని, జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ బ్రౌన్ షర్ట్ దళాలను జిప్సీలు, యూదులు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సమీకరించాడన్న విషయాలు నాటి మన సామాజిక నాయకులకు బాగా తెలుసు. 1922లో ఐన్‌స్టీన్ తన 'ది మీనింగ్ ఆఫ్ రెలటివిటీ' ప్రచురించిన విషయం ఆనాటి భారతీయ విద్యాధికులకు తెలుసు.

1920ల్లో భారతీయ సాహితీ వేత్తలకు అమెరికన్, యూరోపియన్ సాహిత్య వేత్తల కొత్త పుస్తకాలు వెన్వెంటనే అందుబాటులోకి రావడం ఆరంభమయింది. రవీంద్రుని 'రక్తకరాబీ'ని స్వాగతించిన విధంగానే అగథా క్రిస్టీ 'ది మిస్టీరియస్ ఎఫైర్ ఎట్ స్టైల్స్' (1920)ను, ఎర్నెస్ట్ హెమింగ్వే 'ఎ ఫేర్ వెల్ టు ఆర్మ్స్' (1929)ను అంతే ఉత్కంఠతో చదివారు. ఐరిష్ మహాకవి డబ్ల్యు.బి.యేట్స్‌కు నోబెల్ పురస్కారాన్ని సాధించిన 'మైఖెల్ రాబర్ట్స్ అండ్ ది డాన్సర్ (1921) ను భారతీయ పాఠకులు అర్థం చేసుకోలేకపోయారు. అయితే భారత్‌తో యేట్స్ మహాకవి మేధో సంబంధాల గురించి మోహినీ చటర్జీ, రవీంద్రనాథ్ టాగోర్ ల ద్వారా వారికి తెలుసు. టి ఎస్ ఇలియట్ 'ది వేస్ట్ ల్యాండ్' (1922), వర్జీనియా ఊల్ఫ్ 'మిసెస్ డల్లో వే' (1925) సమకాలీన భారతీయులను వెన్వెంటనే ఆకట్టుకోలేకపోయాయి. అయితే ప్రస్తావిత పాశ్చాత్య రచయితల సాహిత్య సృజనలతో పాశ్చాత్య సాహిత్య జగత్తులో కొత్త పవనాలు వీస్తున్నాయనే విషయం ఆనాటి భారతీయ విద్యావంతులకు తెలుసు. 1920 దశకంలో ప్రభవించిన సామాజిక సంవేదనలు, సాహిత్య అభిరుచులు భారతీయులలో 1980ల వరకు ప్రభావదాయకంగా ఉన్నాయి. 1950ల్లో నెహ్రూ ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలు, ఉన్నత విద్యా సంస్థలను నిర్మించి వాటిని అభివృద్ధి పరిచారు. ఆ విద్యాసంస్థల్లో పరిఢవిల్లిన సాంస్కృతిక, మేధో సంస్కృతి 1920దశకంలో ప్రభవించిందే. చిత్రమేమిటంటే నెహ్రూ భావజాలాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాలు కూడా 1920ల్లోనే ఊపిరి పోసుకున్నాయి. వినాయక్ దామోదర్ సావర్కార్ 'ఎస్సెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ' ఆ దశకంలోనే వెలువడింది.

1920 దశకం చరిత్రను పునరావలోకనం చేస్తే 2020ల్లో ఉన్న మనం వందేళ్ల నాటి ఉజ్వల భావుకులు, ప్రగతిశీల ఆలోచనా శీలురు అయిన మన పూర్వీకులతో ఏ విధంగాను సమరీతిలో లేము. 1920ల తరం ఆధునిక వివేచన భారతీయులలో వికసించేందుకు విశేషంగా దోహదం చేసింది. 2020 లనాటి మన తరం కాలం చెల్లిన సంప్రదాయాలపై మక్కువ చూపుతోంది. మన తాతలు, నానమ్మల తరం వినూత్న, ప్రయోజనకరమైన తాత్త్విక భావనలు, వైజ్ఞానిక పద్ధతులను ప్రవేశపెట్టి జాతి అభ్యున్నతికి దోహదం చేశారు. అంటురోగాలు, కార్చిచ్చులు, వరదలు, మహిళలపై హింసాత్మక దురాగతాలు, ఇస్లాం వ్యతిరేక ఉన్మాదం, ఎడతెగని యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, నిరంకుశ ప్రభుత్వాలతో సతమతమవుతున్న ప్రస్తుత దశకం 1920లకు ఏమాత్రం సమ జోడీ కాదు. ఈ రెండు దశకాల మధ్య ఒక శతాబ్ది దూరం.. అంతకు మించిన దూరంగా కనిపిస్తుందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

• గణేష్ నారాయణదాస్ దేవి
విద్యావేత్త, సాంస్కృతిక కార్యకర్త

(ది టెలిగ్రాఫ్ సౌజన్యం)

ఆ దాడులపై మౌనం ఎందుకు?


ఇటీవల కాలంలో రెండు అంశాలు నన్ను, ఈ దేశంలో లౌకిక తత్వం వర్ధిల్లాలని కోరుకుంటున్న అనేక మందిని విచలితులని చేశాయి. ఒకటి– సంఘ్ పరివారీయులు అజ్మీర్ దర్గాపై కేసు వేయడం, రెండవది– బంగ్లాదేశ్‌లో హిందూ మత మైనారిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఫాసిస్ట్ దాడులపై సంఘ్ పరివారీయులు తప్ప లౌకిక వాదులు గానీ, మత మైనారిటీ హక్కుల ఠేకేదారులు గాని ఎవరూ స్పందించకపోవడం.

రాజస్థాన్‌లో అజ్మీర్ పట్టణంలో 13 వ శతాబ్దంలో నివసించిన మొయినుద్దీన్ చిష్తి స్మారకార్థం నిర్మించిన దర్గా అన్ని మతాల ప్రజలకు ఒక దర్శనీయ స్థలం. సూఫీ ఋషి మొయినుద్దీన్ చిష్తీ అనంతరం ఆయన శిష్యులు సూఫీయిజాన్ని ప్రచారం చేస్తూ దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. సూఫీయిజం ప్రేమను, సామరస్యాన్ని, సోదర భావాన్ని బోధించే ఒక కల్ట్. అందుకే సూఫీ ఋషుల బోధనలు, సూఫీ సాహిత్యం, సూఫీ భక్తి గీతాలు అన్ని మతాల ప్రజలను ఆకర్షించాయి. వారు మరణించిన తర్వాత ఆయా ప్రాంతాలలో దర్గాలు వెలసి అన్ని మతాల ప్రజలకు దర్శనీయ స్థలాలుగా మారినాయి. జహంగీర్ పీర్ దర్గా, జాన్ పాడ్ దర్గా, పహాడీ షరీఫ్ దర్గా, నిర్మల్ ఘాట్ రోడ్డు మొదట్లో ఉన్న షేక్ సాబ్ దర్గా లాంటివి అనేకంగా తెలంగాణ వ్యాప్తంగా వెలసిన సూఫీ దర్గాలకు హిందువులు, ముస్లింలు, ఇతర మతస్థులు వెళ్ళి మొక్కులు తీర్చుకోవడం చూస్తూనే ఉన్నాము. నిర్మల్ దగ్గర సూఫీ నగర్ పేరుతో దర్గా వద్ద ఒక ఊరు కూడా వెలిసింది. ఈ సహజీవన సంస్కృతే 'గంగా జమునా తేహజీబ్'గా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

అజ్మీర్ దర్గా దేశవ్యాప్తంగా అన్ని మతాల ప్రజలకు మంచి ప్రజాదరణ కలిగిన దర్శనీయ స్థలం. అజ్మీర్ దర్గాను సందర్శించిన వారి కోరికలు తీరుతాయని అపార నమ్మకం ప్రజల్లో ఉన్నది. అజ్మీర్ దర్గాతో నాకు ఉన్న ఒక అనుభవాన్ని గుర్తు చేయాలని అనుకుంటున్నాను. 2010లో తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకులు, మరికొంతమంది సభ్యులం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి నివేదిక సమర్పించడానికి ఢిల్లీ వెళ్ళాము. ఆ కార్యక్రమం అనంతరం అందరం కలిసి అజ్మీర్ దర్గా వెళ్ళాము. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే అజ్మీర్ దర్గా మళ్లీ సందర్శిస్తామని మాలో కొందరు మొక్కుకున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే సంఘం సభ్యులందరూ మళ్ళీ వెళ్ళి తమ మొక్కును చెల్లించుకున్నారు. ఈ దర్గాను సందర్శించి చాదర్ సమర్పించని రాజకీయ నాయకుడు ఈ దేశంలో లేడంటే అతిశయోక్తి కాదు. 13 శతాబ్దంలో అంటే సుమారు 700 ఏండ్ల క్రితం నిర్మించిన అంతటి ప్రజాదరణ కలిగిన ఈ దర్గాను కూడా హిందూ మత ఛాందసులు వదిలిపెట్టలేదు. అజ్మీర్ దర్గా ఒకప్పుడు శివాలయం అని వాదిస్తూ రాజస్థాన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోర్ అజ్మీర్ సివిల్ కోర్టులో కేసు వేసినట్టు, కోర్టు సర్వే నిర్వహించమని ఆదేశాలు జారీ చేసినట్టు వార్తలు చదివి మనసు వికలమయింది.

ప్రాచీన భారత ఉప ఖండంలో శైవం, వైష్ణవం మధ్య, వైదిక, బౌద్ధ మతాల మధ్య, మధ్యయుగాలలో హిందు, ఇస్లాం మతాల మధ్య ఘర్షణలు ఉన్నప్పటికీ సమ్మిళిత సహజీవనం ఈ ఉప ఖండంలో శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చింది. ఇస్లాం భారతదేశంలోకి అడుగు పెట్టి సూఫీ ఋషుల ద్వారా దేశంలోని ఇతర ప్రాంతాలకు, తెలంగాణ లోకి వ్యాపించింది. తెలంగాణలో ఇది కుతుబ్ షాహిల కాలం కంటే ముందు నుంచి ఉనికిలో ఉన్నది. మిశ్రమ సహజీవన సంస్కృతి హైదరాబాద్ రాజ్యంలో వెల్లివిరిసింది. అందుకు ఉదాహరణ తెలంగాణలో ఘనంగా జరిగే మొహర్రం ఉత్సవాలు. గత యుగాలలో మన దేశంలోని వివిధ రాజ్యాల పాలకులు.. హిందువులైనా, ముసల్మాన్‌లైనా.. మతతత్వాన్ని అమలు చేసి ఉండవచ్చు. వైదిక మతాన్ని ఆశ్రయించిన హిందూ రాజులు బౌద్ధ, జైన ఆలయాలను శైవ, వైష్ణవ ఆలయాలుగా మార్చినట్టు చరిత్రకారులు అనేకం గుర్తించారు. తిరుమల బాలాజీ మందిరం ఒకప్పుడు బౌద్ధ ఆరామమని విశ్లేషిస్తూ పుస్తకాలు కూడా ప్రచురితమయినాయి. అట్లాగే ముస్లిం పాలకులు కూడా హిందూ ఆలయాలను కూల్చి, లేదా వాటి పక్కనే మసీదులు కట్టి ఉంటారు. విగ్రహాలను ధ్వంసం చేసి ఉంటారు. కానీ ప్రజలు మాత్రం కలిసి మెలసి జీవించారు. తిరుమల వేంకటేశ్వరుని గుడి తమదేనని బౌద్ధులు కేసు వేస్తే ఎలా ఉంటుంది? తిరుమల గుడిని బౌద్ధులకు అప్పగిస్తారా? ఆదిలాబాద్ జిల్లాలో జైనద్ లో ఉన్న ఒకప్పటి జైన దేవాలయం హిందూ దేవాలయంగా మారింది. ఊరి పేరులోనే జైనం కనిపిస్తున్నది. ఈ దేవాలయంపై జైనులు కేసు వేస్తే జైనులకు అప్పగిస్తారా? రాచరిక వ్యవస్థలో చరిత్రలో జరిగిన అనేక తప్పిదాలను ఈ రోజు తిరగదోడుతూపోతే ఈ దేశంలో మత సామరస్యత చెదిరిపోయి మత వైషమ్యాలు పెచ్చరిల్లిపోవా? అజ్మీర్ దర్గా కేసుపై ఎంఐఎం అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు, మత మైనారిటీల హక్కుల కోసం గొంతు చించుకొని మాట్లాడే అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ 'ఇది దేశాన్ని అస్థిరపరచే చర్య' అన్నాడు. ఇప్పుడు మనం ప్రజాస్వామ్య యుగంలో ఉన్నాము. దేశానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాము. భిన్నత్వంలో ఏకత్వం మన రాజ్యాంగ స్ఫూర్తి. మతాచరణ మన వ్యక్తిగతం, రాజ్యాంగాచరణ సామాజికం చేసుకోవలసిన అత్యవసర పరిస్థితి ఇప్పుడు దేశంలో నెలకొని ఉన్నది.

ఇక రెండవ అంశంలోకి వెళితే.. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలైన హిందువులపై, హిందూ దేవాలయాలపై కొన్ని నెలలుగా ఇస్లాం మతతత్వవాదుల దాడులు జరుగుతున్న వార్తలు దేశాన్ని కుదిపివేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువుల మీద, హిందూ దేవాలయాల మీద మెజారిటీ ఇస్లాం మతతత్వం పేట్రేగిపోయి దాడులు చేస్తుంటే ఈ దేశంలో ఉన్న లౌకికవాదులు, మైనారిటీ హక్కుల ఠేకేదారులు ఎందుకు మాట్లాడరు? దాడులను ఎందుకు ఖండించరు? అన్న ప్రశ్నలు నా లాంటి వారిని కలచి వేస్తున్నది. అక్కడి మైనారిటీ హిందువుల మీద దాడులను ఖండించే బాధ్యతను సంఘ్ పరివారానికే వదిలిపెడితే ఈ దేశంలో లౌకిక వాదం ఎట్లా నిలబడుతుంది? మెజారిటీ మతతత్వం ఫాసిజానికి దారి తీస్తున్న వాదనతో ఏకీభావం కలిగిన వాళ్ళు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘానిస్తాన్, మయన్మార్, ఇజ్రాయిల్, సిరియా, ఆఫ్రికా తదితర దేశాలలో మత మైనారిటీలపై (ఏ మతస్థులైనా) జరిగే ఫాసిస్టు దాడులకు ఇక్కడ లౌకిక వాదులు స్పందించకపోతే లౌకిక వాదం ఎట్లా నిలబడుతుంది? సంఘ్ పరివార్ భావ ప్రచారానికి లోను కాకుండా ఈ దేశ యువతను కాపాడుకోవడం ఎట్లా? ఈ దేశంలో ముస్లిం మత మైనారిటీల హక్కుల గురించి పార్లమెంట్‌లో, పార్లమెంట్ బయట గొంతు చించుకొని అరిచే అసదుద్దీన్ ఒవైసీ బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలపై జరిగే దాడులను కూడా అంతే తీవ్రంగా ఖండించాలి కదా! అజ్మీర్ దర్గా కేసు దేశాన్ని అస్థిర పరుస్తుందని సరిగ్గానే ఆవేదన వ్యక్తం చేసిన అసదుద్దీన్ కు బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలపై దాడులను ఖండించడానికి మాటలు రావెందుకు? రాహుల్ గాంధీ, ఇతర లౌకిక పార్టీల నాయకులు స్పందించరెందుకు? హక్కుల సంఘాల వారు మౌనం వీడరెందుకు? పాలస్తీనా సంఘీభావ కవిత్వం రాసే కవులు, హిందూ మత తత్వ ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేసే రచయితలు, కవులు స్పందించరెందుకు? మనం అన్ని రకాల మత తత్వాలను వ్యతిరేకించాలి కదా! దేశంలో మతతత్వ ఫాసిజం ప్రబలకుండా చూడవలసిన బాధ్యత ప్రజాస్వామ్యాన్ని, సమాజ హితాన్ని కోరుకునే ప్రజలదే. ఇవ్వాళ్ళ మనం అన్ని రకాల మతతత్వాలకు వ్యతిరేకంగా నిలబడవలసిన అవసరం ఏర్పడింది. సంఘ్ పరివారం తయారు చేసి వదులుతున్న నేరేటివ్స్ ఈనాటి యువతరాన్ని, మధ్య తరగతి మేధావి వర్గాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వారిని లౌకిక భావనల నుంచి దూరం చేస్తున్నది. అదే సమయంలో సంఘ్ పరివార్ నేరేటివ్స్‌కి కౌంటర్ నేరేటివ్స్ తయారు చేయడంలో దేశంలో లౌకిక వాదులు విఫలమవుతున్నారు. అన్ని రకాల మత తత్వాలను వ్యతిరేకించకుండా కేవలం మెజారిటీ మత తత్వం పేరిట హిందూ మతతత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తే ఈ దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోలేము. ఇక్కడ లౌకిక వాదుల నుంచి తప్పిదాలు జరుగుతున్నాయని నా భావన. లౌకిక వాదులు తమ పాక్షిక వైఖరిపై పునర్విచారణ చేసుకోవడం అవసరం. లేనట్లైతే దేశంలో లౌకిక తత్వం బలహీనపడుతుంది. మతతత్వ ఫాసిస్టు శక్తులు వేళ్లూనుకుంటాయి. ప్రధాన తెలుగు పత్రికలు బంగ్లాదేశ్ పరిణామాలపై సంపాదకీయాలు రాయడం హర్షించదగినది. అయితే లౌకిక వాదులు ఇంకా మౌనం వహించడం మాత్రం బాధిస్తున్నది.



> **తిరుమల వేంకటేశ్వరుని గుడి తమదేనని బౌద్ధులు కేసు వేస్తే ఎలా ఉంటుంది? ఆ గుడిని బౌద్ధులకు అప్పగిస్తారా? ఆదిలాబాద్ జిల్లాలో జైనద్‌లో ఉన్న ఒకప్పటి జైన దేవాలయం హిందూ దేవాలయంగా మారింది. జైనులు కేసు వేస్తే ఆ ఆలయాన్ని జైనులకు అప్పగిస్తారా? రాచరిక వ్యవస్థలో జరిగిన అనేక తప్పిదాలను ఈ రోజు తిరగదోడుతూ పోతే ఈ దేశంలో మత సామరస్యత చెదిరిపోయి మత వైషమ్యాలు పెచ్చరిల్లిపోవా?**

> **అన్ని రకాల మతతత్వాలను వ్యతిరేకించకుండా కేవలం మెజారిటీ మతతత్వం పేరిట హిందూ మతతత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తే ఈ దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోలేము. లౌకిక వాదులు తమ పాక్షిక వైఖరిపై పునర్విచారణ చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో దేశంలో లౌకికతత్వం బలహీనపడుతుంది. మతతత్వ ఫాసిస్టు శక్తులు వేళ్లూనుకుంటాయి.**

▪ శ్రీధర్‌రావు దేశ్‌పాండే

చమురు మంటలు రగిల్చిన ఉద్యమాలు

యాభై సంవత్సరాల క్రితం, 1974లో దేశ రాజకీయాలలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు, అజేయురాలుగా వెలుగొందుతున్న ఇందిరాగాంధీకి చిక్కులు తెచ్చిపెట్టాయి. ఇజ్రాయెల్‌పై 1973 యుద్ధంలో అరబ్ దేశాల ఓటమితో అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు పెరిగి, భారత ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లకు గురయింది. నిత్యావసరాల ధరలు మిన్నంటి కోట్లాది కుటుంబాలు అల్లల్లాడిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజ్వరిల్లిన విద్యార్థి, యువ జన ఉద్యమాలు దేశ రాజకీయాలలో పెనుమార్పులకు దారితీశాయి. 1970 దశకం మధ్యనాళ్లో వేల మైళ్ల దూరంలో జరిగిన యుద్ధం మన దేశ రాజకీయాలను ఎలా ప్రభావితం చేసిందన్నది ఆసక్తికరమైన చరిత్ర.

ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య ఎడతెగని యుద్ధాలలో ఒకటైన యోమ్ కిపూర్ యుద్ధం (రమదాన్ యుద్ధంగా కూడా ప్రసిద్ధి) 1970 దశకం మధ్యనాళ్లలో భారత రాజకీయాల్లో పెను మార్పులకు ప్రధాన కారణాలలో ఒకటి. ఆ యుద్ధం 1973 అక్టోబర్ లో ఇజ్రాయెల్‌పై ఈజిప్ట్, సిరియాల దాడితో మొదలై అదే నెలలో ఇజ్రాయెల్ పాక్షిక విజయంతో ముగిసింది. ఆ పోరులో మరొక తొమ్మిది అరబ్ దేశాలే కాక, క్యూబా, ఉత్తర కొరియాల సైనికులు కూడా ఈజిప్ట్, సిరియాల పక్షాన పోరాడాయి. ఈ యుద్ధానంతరం అవమాన భారంతో, తమను సమర్థించని దేశాలకు (అగ్ర దేశాలతో సహా) గుణపాఠం నేర్పాలని ఒపెక్ దేశాలు చమురు ధరను అమాంతం 70 శాతం పెంచగా బ్యారెల్ ధర 5.11 డాలర్ల మేరకు పెరిగింది. మిత్ర దేశాలు గనుక తమ పట్ల అరబ్బులు సానుకూల ధోరణిని కనపరుస్తారని ఆశించిన భారత్‌కు నిరాశ ఎదురయ్యింది. నిర్ణయించిన చమురు ధర ప్రపంచానికంతటికీ వర్తిస్తుందని భారత్‌కు మినహాయింపు ఇవ్వలేమని ఒపెక్ తేల్చి చెప్పింది.

దాంతో భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. అంతవరకు ఐదు వందల మిలియన్ డాలర్లున్న దిగుమతి వ్యయం ఒక్క సారిగా 1.3 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పటికే రెండు సంవత్సరాలుగా వర్షాభావాన్ని ఎదుర్కొంటున్న దేశం ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది. ధరలు ఆకాశాన్నంటాయి. 1971లో 3.08 శాతం ఉన్న ద్రవ్యోల్బణం రేటు 1974లో 28.60 శాతానికి పెరగగా ప్రభుత్వం ఒక లాంటి 'షాక్' లోనికి జారుకున్నది. పాలనా దక్షుడు, ఆర్థిక శాస్త్ర నిపుణుడు అయిన సిసుబ్రహ్మణ్యం దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలను ఇవ్వలేదు.

ఈ ధరల పెరుగుదలను సహజంగానే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఇందిరా గాంధీపై ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి పాత కాంగ్రెస్ నాయకులు (మొరార్జీ దేశాయ్, అతుల్య ఘోష్, సంజీవ రెడ్డి ప్రభృతులు), భారతీయ జన్ సంఘ్, సోషలిస్టులు (భారతీయ క్రాంతి దళ్)లకు అంది వచ్చిన అవకాశమైంది. ధరల పెరుగుదల, పెరిగిన అవినీతి, ప్రభుత్వ అలసత్వం పై పోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో వారికి మరొక సువర్ణావకాశం లభించింది. 1973 డిసెంబర్ లో అహ్మదాబాద్ లో ఎల్.డీ (లాల్ భాయ్ దల్పత్ భాయ్) ఇంజనీరింగ్ కళాశాలలో ఒక్కసారిగా 20 శాతం పెరిగిన మెస్ బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన అప్పటి ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ అవినీతికి వ్యతిరేకంగా జరగబోయే ఉద్యమానికి నాంది పలికింది. ఈ ఉద్యమం 'నవ్ నిర్మాణ్ ఆందోళన్' గా చరిత్రపుటల్లో స్థానం సంపాదించుకుంది. రెండు నెలల పాటు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు , విద్యార్థులు, కార్మికులు, మహిళలు గుజరాత్ ను స్తంభింపచేసి చిమన్ భాయ్ పటేల్ బేషరతుగా రాజీనామా చేయాలని ఎలుగెత్తి డిమాండ్ చేశారు. మొరార్జీ దేశాయ్ ఆమరణ నిరాహార దీక్షకు ఉపక్రమించారు. రాష్ట్రమంతటా ఉగ్ర రూపం దాల్చిన నిరసనలో పోలీసు కాల్పులలో దాదాపు వందమంది మరణించారు. ప్రజాభీష్టానికి తలొగ్గిన ఇందిరా గాంధీ ఆదేశం మేరకు చిమన్ భాయ్ 1974 ఫిబ్రవరిలో రాజీనామా చేయగా ఆ తరువాత రెండు నెలల్లో అన్ని పార్టీలకు చెందిన శాసన సభ్యులు పెద్ద ఎత్తున రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో మార్చి నెలలో రాష్ట్రపతి శాసన సభను రద్దు చేశారు.

అదే సమయం లో బిహార్ లో రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పెరిగిన ధరలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయ వాది, సర్వోదయ నాయకుడు జయప్రకాష్ నారాయణ్ నేతృత్వం లో ప్రజలు ఉద్యమించారు. దేశ వ్యాప్తంగా ప్రజ్వరిల్లిన నిరసనలలో మధ్యప్రదేశ్‌లో పోలీసు కాల్పులు ఎనమండుగురిని బలి గొన్నాయి. మార్చి 1974లో బిహార్ లో ప్రముఖ రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలన్నీ భారీ బహిరంగ సభలో తాము లోక్ నాయక్ నేతృత్వంలో సంపూర్ణ విప్లవాన్ని సాధిస్తామని ప్రతిన పూనాయి. బిహార్ ఛాత్ర సంఘర్ష్ సమితి పేరుతో ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ సంఘానికి అధ్యక్షుడిగా పాట్నా విశ్వ విద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షుడైన లాలూ ప్రసాద్ యాదవ్ ఎన్నికవ్వగా, బిహార్ ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, సుశీల్ కుమార్ మోడీ, వశిష్ఠ నారాయణ్ సింగ్, రామ్ విలాస్ పాశ్వాన్ (ఈయన అప్పటికే శాసన సభ్యుడు) రవి శంకర్ ప్రసాద్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమం లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జూలై నెలలో ఒక భారీ బహిరంగ సభలో జయ ప్రకాష్ నారాయణ్ తాను దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని తీవ్ర తరం చేయనున్నట్లుగా ప్రకటించారు. కొన్ని నెలల తరువాత ఆయన పోలీసులకు సైనిక దళాలకు కూడా ప్రభుత్వంపై తిరుగుబాటు చేయమని పిలుపునివ్వడం గమనార్హం. ఈ ప్రకటనను రాజ్యాంగ వ్యతిరేక చర్యగా చాలామంది విమర్శించారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడానికి ఇది కూడా ఒక కారణంగా పలువురు పేర్కొంటారు. బిహార్ లో విద్యార్థుల ఒత్తిడికి 30 మందికి పైగా ప్రతిపక్ష ఎంఎల్ఏలు రాజీనామా చేశారు. కానీ గుజరాత్‌లో వలే ముఖ్యమంత్రి మార్పిడి జరగలేదు. ఈ లోగా జబల్‌పూర్ లోక్ సభ నియోజక వర్గ సభ్యుడైన సీనియర్ కాంగ్రెస్ నేత సేఠ్ గోవింద్ దాస్ మరణించగా జరిగిన ఉప ఎన్నికలో విద్యార్థి నాయకుడు ఉద్యమకారుడు అయిన శరద్ యాదవ్ ను ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థిగా జయప్రకాశ్ నారాయణ్ నిలబెట్టారు. శరద్ యాదవ్ గెలిచాడు. ఆ గెలుపు ప్రతిపక్షాల ఆత్మ స్థైర్యాన్ని ద్విగుణీకృతం చేసింది. లక్ష్యాలలో, కార్యాచరణలో స్పష్టత లోపించినా, ప్రజా బాహుళ్యంలో గల అసంతృప్తికి, కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యం పట్ల వ్యతిరేకతకు అద్దం పట్టిన ఈ ఉద్యమ ప్రకంపనలు దేశమంతటా వినిపించాయి. ఈ రెండు ఉద్యమాలలో రాజకీయ ఓనమాలు దిద్దిన నాటి విద్యార్థి నాయకులైన శరద్ యాదవ్, అరుణ్ జైట్లీ, వెంకయ్య నాయుడు, విజయ్ గోయల్, భూపేంద్ర సింగ్ చుడసామ లాంటి వారు తరువాతి కాలంలో రాష్ట్ర జాతీయ స్థాయిల్లో రాజకీయాలను ప్రభావితం చేయగా, పదుల సంఖ్యలో యువ కళాకారులు, పాత్రికేయులు ఈ ఉద్యమాలలో పాల్గొన్నారు.

ఆ తరువాత చోటు చేసుకున్న గొలుసు కట్టు పరిణామాలైన దేశ వ్యాప్త నిరసనలు, రాయిబరేలి లో ఇందిరా గాంధీ ఎన్నికను అలహాబాద్ హై కోర్టు కొట్టివేయడం, సుప్రీమ్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు, ఎమర్జెన్సీ విధింపు అందరికీ తెలిసినవే. నవ నిర్మాణ్ ఉద్యమాన్ని విశ్లేషిస్తూ ది ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి లో వ్రాసిన ఒక సమగ్ర వ్యాసంలో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఘన్ శ్యామ్ షా ఆ ఉద్యమంలో పాల్గొన్న శక్తులన్నీ ప్రగతిశీలకమైనవి కావని స్పష్టం చేశారు. ఆ ఉద్యమం రిజర్వేషన్ వ్యతిరేక ధోరణులను కనపరచిందని కూడా పేర్కొన్నారు. అదే విధంగా బిహార్ ఉద్యమాన్ని అరాచకత్వానికి ప్రతీకగా, జయప్రకాశ్ నారాయణ్‌ను అనార్కిస్టుగా విమర్శించినవారూ లేకపోలేదు. బిహార్ లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిపిఐ సమర్థించగా సిపిఐ(ఎం) వ్యతిరేకించింది. గుజరాత్, బిహార్ ఉద్యమాల వలన భారతీయ జన సంఘ్ గణనీయంగా బలపడిందన్నదీ నిజం. యోమ్ కిపూర్ యుద్ధం భారత రాజకీయాలను కొంత మేరకు ప్రభావితం చేసిందనడానికి చారిత్రక ఆధారాలున్నాయి.



> **1970 దశకంలో ఇజ్రాయెల్‌పై యోమ్‌కిపూర్ యుద్ధంలో అరబ్ దేశాల ఓటమితో చమురు ధరను ఒపెక్ ఒక్కసారిగా 70 శాతం పెంచింది. ప్రపంచ దేశాల, ముఖ్యంగా భారత్ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోమయింది. ఆ కల్లోల కాలంలోనే గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో లోక్ నాయక్ జెపి నాయకత్వంలో 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమం ప్రజ్వరిల్లాయి. ఈ ఉద్యమాలు దేశ రాజకీయాలను కుదిపివేసి 'అత్యవసర పరిస్థితి'కి దారితీశాయి.**

◆ కొట్టు శేఖర్
ఆచార్యుడు, మిజోరం యూనివర్సిటీ

అభివృద్ధికి అవినీతి గ్రహణం

స్వాతంత్ర్యానంతరం స్వపరిపాలనలో హక్కుగా పొందే సేవలకు ప్రజలు తెలియక, పనిపూర్తయిన తరువాత అధికారికి ఏదో ఒక కానుకను ఇచ్చేవారు. అది ఒక ఆనవాయితీగా మారింది. మీరు హక్కుగా పొందే సేవలకు మేము ఏమీ ఆశించకుండా పనిచేయాలని, దానికి ప్రభుత్వం నుండి జీతాలు పొందుతున్నామని అధికారులు ప్రజలకు ఎప్పుడూ చెప్పలేదు. రానురాను అధికారులు కానుకలు తీసుకోవడం తమ హక్కుగా భావిస్తూ వచ్చారు. క్రమంగా ప్రతి పనికి ఆ కానుకలనే లంచం రూపంలో తీసుకోవడం వారికి అలవాటైంది. ప్రజాస్వామ్య పాలనలో మన అభివృద్ధికి ఆ అవినీతే ఆటంకమని తెలుసుకోలేక సతమతమవుతున్నాం.

పాలనలో అవినీతిని అరికట్టడం పెద్ద సవాల్. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే గాని అవినీతిని అరికట్టడం సాధ్యం కాదు. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు ఒకనాడు తమ పాలనా వ్యవస్థల్లో అవినీతిపై యుద్ధం చేసినవారే. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వాలు నడుస్తాయి. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను అభివృద్ధికి, సేవలకు, సంక్షేమ సాధనకు నిజాయితీగా ఖర్చు చేస్తే ప్రజలకు ఆ ప్రభుత్వంపై నమ్మకం కలిగి పన్నులు ఆనందంగా చెల్లిస్తారు. ఇప్పుడు ప్రజలకు మన ప్రభుత్వాలపై నమ్మకం సన్నగిల్లింది.





అవినీతి రెండురకాలు. ఒకటి రాజకీయనాయకులు, వ్యాపారస్థులు కుమ్మక్కై జరిపే అవినీతి. ఇది పెద్ద ఎత్తున జరిగే అవినీతి. దీనిలో ప్రజాధనం పెద్ద ఎత్తున రాజకీయనాయకుల, వ్యాపారస్థుల పాలవుతుంది. చిరు అవినీతి–అంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో మునిసిపాలిటీలో, రెవెన్యూ ఆఫీసులో, పోలీసు స్టేషన్‌లో చెల్లించే లంచాలు. పరిస్థితులు ఎంతగా దిగజారాయంటే సామన్యుడు లంచాన్ని ఒక అదనపు పన్నుగా ఓర్చుకుంటున్నాడు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రతి పనికి ఒక ధరను నిర్ణయించి ఆ పనులు చేస్తారన్న విషయం తెలిసిందే. ఇది ఒక దురాచారం. సంఘసంస్కర్తలు ప్రజలను చైతన్యపరచి ఎన్నో సాంఘిక దురాచారాలను రూపుమాపారు. అయితే అవినీతిని నిర్మూలించలేకపోయారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అవినీతిని అదుపు చేసేందుకు ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చినా ఆ మహమ్మారిని నిర్మూలించడం సాధ్యపడలేదు. క్రమేపీ అరికట్టడంతో సర్దుకుపోవాలి. పాలనలో అవినీతి వలన జరిగే నష్టాలు అతి ప్రమాదకరమైన ప్రభావం చూపుతాయని ప్రజలకు విశదీకరించాలి. ప్రజలలో అశాంతి, అలజడి, కుంగుబాటుతనం, దొంగతనాలు, అరాచకాలు, హత్యలు, అభద్రతాభావం, ఒకరిపై ఒకరికి అపనమ్మకం, ఈర్ష్యాద్వేషాలు, కపటం, కోపం పెరిగి సామాజిక పతనం సంభవిస్తున్నది.

మనం నిర్మించుకున్న వ్యవస్థలపైనే మనకు సందేహం. రాజకీయ నాయకులపై ప్రజలకు నమ్మకం లేకపోతోంది. దీనితో అవినీతి ప్రజల జీవనవిధానంలో ఒక భాగమైపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఎక్కువ శాతం మంది ఉద్యోగస్థులు అవినీతిపరులే. లంచాలకు అలవాటుపడ్డ అధికారులకు వారికి వచ్చే జీతంతో పనిలేదు. వచ్చే లంచాల ముందు వారి జీతం చాలా తక్కువ. వచ్చే లంచాలతో విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడి తాము చేయవలసిన ఉద్యోగ బాధ్యతలను, అందివ్వవలసిన ప్రజా సేవలను పూర్తిగా మరచి లేనిదానికీ కానిదానికీ ఏదో ఒక కారణం చూపించి, ప్రతిదానికీ లంచం ఇస్తే గాని పనిచేయని దౌర్భాగ్య పరిస్థితి ఉన్నది. ప్రజలు కూడ గత్యంతరం లేక లంచాలు ఇవ్వడానికి అలవాటు పడ్డారు. ఎవరైనా నిజాయితీగా మెలగాలన్నా, మెలిగే పరిస్థితి లేని సమాజం ప్రస్తుతం ఉంది. పైగా నిజాయితీగా ఉంటే బతకలేనివాడని, చేతకానివాడని సమాజమే నిర్వచిస్తుంది. అవినీతి వలన సమర్థత తగ్గి అసమర్థులు పెరుగుతున్నారు. అవినీతి నిరోధక శాఖ పనిచేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల జోక్యంతోనూ, చట్టాలను నిజాయితీగా అమలు చేయలేక పోవడంవలనా ఉద్యోగులలో మార్పు రావడం లేదు. మరొకవైపు రాజకీయ అవినీతి, అన్ని రకాల ఆర్థిక కుంభకోణాలు మనదేశాన్ని కుంగదీస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన స్వల్పకాలంలోనే స్వాతంత్ర్యం కొరకు పోరాడిన విలువలు కలిగిన నాయకులను ఈ దేశం కోల్పోయి అనుభవం లేని నాయకుల చేతుల్లోకి వెళ్ళి ఇంత పెద్ద దేశాన్ని ఒక మంచి మార్గంలో నడపడం అసాధ్యమవుతున్నది.

అవినీతిని అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నా, అవినీతికి అలవాటుపడిన ఉద్యోగస్థులు కొత్త కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని కాకుండా రాజకీయ నాయకులందరికీ అవినీతిని నిర్మూలించాలన్న ఉద్దేశమే లేదు. అవినీతి నిరోధక శాఖ, డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు, విజిలెన్స్ కమిషన్, లోకాయుక్త వంటి సంస్థలకు పదును పెట్టాలి. ప్రతి కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్లు తయారుచేసి ప్రతి పని ఎన్ని రోజులలో చేస్తారో తెలుపుతూ బోర్డులు పెట్టాలి. అలాగే సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకతను జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి. ప్రజలు కూడ కొద్దో గొప్పో ఇబ్బంది కలిగినప్పటికీ లంచాలు ఇవ్వకుండా పనులు చేయించుకొనే అలవాటు నేర్చుకోవాలి. అవినీతిపరులైన ఉద్యోగుల నుంచి ఆరంభంలో ఎదురైన ప్రతిఘటన ఎక్కువ కాలం కొనసాగదని గుర్తించాలి. అవినీతికి వ్యతిరేకంగా బలమైన పోరాటం జరిగినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

○ సోమ శ్రీనివాసరెడ్డి
ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

(డిసెంబరు 9: అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
ఆదివారం 8 డిసెంబరు 2024
3

ఓరుగల్లు పత్తికి మహర్దశ



- వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రం మంజూరు
- ఆమోదం తెలిపిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి
- ఇక మరిన్ని పరిశోధనలకు ఆస్కారం
- జాతీయ స్థాయిలో పత్తిసాగుపై టెక్నాలజీని పెంచుకునే అవకాశం
- బీటీ-2 పత్తి సాగు, ఉత్పత్తులు పెరిగే చాన్స్
- కొత్త వంగడాల సాగు, చీడ పీడల విరుగుడుకు పరిశోధనలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో యేటా 5,13,289 ఎకరాల్లో పత్తిసాగు

దేశంలోనే నాణ్యమైన పత్తిని అందించే ఓరుగల్లు రైతులకు శుభవార్త. వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రం మంజూరైంది. దీనికి ఏఐసీఆర్‌పీ, ఐసీఏఆర్ సంస్థలు ఆమోదం తెలిపాయి. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఇది కొనసాగుతుంది. ఇక్కడి నుంచి ప్రధాన శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలపై పరిశోధనలు చేస్తారు. 2020లోనే వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపగా, ఎట్టకేలకు ఇపుడు మంజూరైంది. ఇకనుంచి ఇక్కడ నూతన వంగడాలు, దిగుబడి, చీడపీడలనివారణ చర్యలపై పరిశోధనలు జరుగుతాయి. ఈ సందర్భంగా జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

6



స్మార్ట పిడుగ!



- మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్న జనం
- పిల్లల నుంచి పెద్దల వరకూ అదే 'మాయ'లో..
- 90శాతం మంది పిల్లలపై అధిక ప్రభావం
- నాడీ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం
- నయనాలకు నష్టమని తెలిసినా వదలని వైనం
- మితిమీరిన వాడకంతో దెబ్బతింటున్న బాంధవ్యాలు

6

"పిల్లలకు గోరుముద్దలు తినిపించాలంటే ఒకప్పుడు చందమామను చూపించి.. చందమామ రావే, జాబిల్లిరావే అంటూ అమ్మ తన అద్భుతమైన గొంతుతో పాడుతూ కడుపు నిండా తిండిని తినిపించేది. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్లు చూడందే.. రైమ్స్ వినిపించనిదే.. కదలాడే బొమ్మలు కానరానిదే చిన్నారులకు ముద్ద కూడా మింగడం లేదు. దీంతో చేసేది లేక తల్లిదండ్రులు పిల్లల చేతుల్లో ఫోన్లు పెడుతున్నారే తప్ప కాలక్రమేనా వచ్చే నష్టాలను అంచనా వేయలేక పోతున్నారు."

ఇప్పుడంతా స్మార్ట్ యుగం నడుస్తోంది. చిన్నపిల్లల నుంచి ముసలి వారి వరకు సెల్‌ఫోన్ లేకుంటే పూట గడవడం లేదు. అరచేతిలోకి వచ్చిన ప్రపంచాన్ని చూస్తూ గంటలకొద్దీ మాయా లోకంలో విహరిస్తున్న పరిస్థితి. మానవ సంబంధాలు, బంధుత్వాలు తగ్గుతున్నా.. కళ్లకు ప్రమాదమని తెలిసినా.. నాడీ సంబంధ సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నా.. జీవితమే చీకటి మయమవుతుందని చెబుతున్నా మొబైల్ ఫోన్లను మాత్రం వదలడం లేదు. ఇటీవల సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఓ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థతో కలిసి దేశంలోని పలు ముఖ్య నగరాల్లో జరిపిన సర్వేలోనూ ఈ విషయాలే స్పష్టమయ్యాయి. 90 శాతం మంది సెల్‌ఫోనే ప్రపంచంగా బతుకుతున్నారని తేలింది. ముున్ముందు రోజుల్లో ఈ అనారోగ్య సమస్యలే కాకుండా.. నా అనేవారు లేక ఒంటరయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. అయితే ఇలాంటి దుష్పరిణామాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్ మినహా సోషల్ మీడియా నిషేధిస్తూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేయడం విశేషం.

- నర్సింహులపేట / గార్ల, ఆంధ్రజ్యోతి



ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం..

- వచ్చే నాలుగేళ్లలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు
- 50 గజాలు వచ్చిన భూ నిర్వాసితులకు 75 గజాలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



భూ నిర్వాసితులకు ఇంటి పట్టాలను అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గీసుగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసితీరుతుందని ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం ఆయన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో కలిసి కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇండ్ల పట్టాలను అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే నాలుగేళ్లలో నిరపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, రూ.2లక్షల లోపు రైతు రుణమాఫీ అమలు చేశామన్నారు. ఆరోగ్యశ్రీని కూడా రూ.10లక్షల వరకు పెంచామని, టెక్స్‌టైల్‌పార్కులో 50గజాలు వచ్చిన భూనిర్వాసితులకు 75 గజాలకు పెంచుతామని, పార్కు కోసం భూములు ఇచ్చిన 863 మందికి ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తామని అన్నారు. టెక్స్‌టైల్‌పార్కులో అండర్ డ్రైయినేజీ నిర్మాణం కోసం రూ.161కోట్లు మంజూరు చేశామనానరు. ఈ సందర్భంగా రూ.2కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.58లక్షలతో వెటర్నరీ భవనం, రూ.4.8 కోట్లతో సంగెం మండలం లోహిత నుంచి గోపనపెల్లి వరకు బీటీ రోడ్డు, సంగెంలో కస్తూర్బా బాలికావిద్యాలయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు యంగ్‌వన్, కైటెక్స్ కంపెనీల ప్రతినిధులతో పరిశ్రమల నిర్మాణాలపై మంత్రి సమీక్షించారు.

ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. స్థానిక యువకులకు, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సంగెం, దామెరలలో మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ ఉద్యోగాల కోసం 2500 యువకులకు ట్రెయినింగ్ ఇచ్చేందుకు లిస్ట్ తయారుచేసినట్లు చెప్పారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధానిగా చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, టీజీఐఐసీ ఛైర్మన్ తూర్పుకోట నిర్మలజగ్గారెడ్డి, టీజీఐఐసీ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, కలెక్టర్ సత్యశారద, ఆర్డీవో పోలం ఉమారాణి, తహసీల్దార్ రియాజుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, బంగారం కోసమే హత్య

- రిటైర్డు బ్యాంకు మేనేజర్ హత్య కేసు నిందితుడు శ్రీనివాసరావు అరెస్టు

4

కార్యకర్తల సంక్షేమం కోసం కృషి



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

- పదవుల కల్పనకు గాంధీభవన్‌కు చక్కర్లు కొడతా..
- ఎమ్మెల్యేగా నా గెలుపు మీ కష్టమే.. మరచిపోలేను..
- ఏడాదిలో పశ్చిమను అభివృద్ధి చేసి చూపించా..
- ప్రజా పాలన పశ్చిమ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

4

ఇద్దరు ఏసీపీల బదిలీ



ఏసీపీ సతీష్‌బాబు

వరంగల్ క్రైం, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సి.సతీష్‌బాబును పరకాల ఏసీపీగా, పరకాల ఏసీపీగా పనిచేస్తున్న ఈ. కిషోర్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అమలు కాని హామీలతో కాంగ్రెస్ మోసం

4

న్యూస్ బాక్స్

కోడెలను విక్రయించినట్లు వచ్చిన వార్తలు అవాస్తవం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలోని కోడెలను విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దీన్ని ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. గత ప్రభుత్వ హయాంలో సరైన నిర్వహణ లేక అనేక కోడెలు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వాటి నిర్వహణ నిమిత్తం ఆరు నెలల కిందట సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వేములవాడ ఆలయ ఈవో కన్వీనర్‌గా పలువురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి మార్గదర్శకాలను రూపొందించినట్లు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారి ధ్రువీకరణ పత్రం ఉంటేనే ఒక రైతుకు రెండు కోడెల చొప్పున ఇస్తున్నామని, కోడెల సంరక్షణ కోసం గోశాలలో సీసీ ఫ్లోరింగ్‌తో పాటు షెడ్లు , తాగునీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. ప్రతీ కోడెకు దేవస్థానంలో శాశ్వతమైన ట్యాగ్ ఉంటుందని, ట్యాగ్‌లో ఉన్న కోడెలు ఎక్కడా పట్టుబడలేదని స్పష్టం చేశారు.

కార్యకర్తల సంక్షేమం కోసం కృషి

- పదవుల కల్పనకు గాంధీభవన్‌కు చక్కర్లు కొడతా..
- ప్రజాపాలన పశ్చిమ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే నాయిని



పశ్చిమ కార్పొరేటర్లకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'ఇకపై నా దృష్టి అంతా మీ కోసమే.. మీకు న్యాయం చేయడమే పనిగా పెట్టుకుంటా..' వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వ పశ్చిమ నియోజకవర్గ విజయోత్సవ సభ శనివారం రాత్రి హనుమకొండ సుబేదారి న్యాయ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ప్రజా పాలన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విజయోత్సవాల పరిశీలకుడు ఆరెపల్లి మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ కడియం కావ్య, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తొలుత డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు. వరంగల్ పశ్చిమ అభివృద్ధిని డిజిటల్ స్ర్కీన్‌పై ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తన కోసం కార్యకర్తలు ఎన్నో కష్టనష్టాలు అనుభవించారంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనను ఆదరించారని, వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని చెప్పారు. ఏడాదిగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కృషి చేశారనని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ అభివృద్ధి మున్ముందు వేగంగా కొనసాగుతుందన్నారు. అయితే ఇకపై కార్యకర్తలపై మరింత దృష్టి సారించాలని నిర్ణయించుకున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. పశ్చిమ అభివృద్ధి కోసం ఫైళ్లు పట్టుకొని సెక్రెటేరియట్ చుట్టూ చక్కర్లు కొట్టానని రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఇకపై పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు పదవుల కల్పనతో న్యాయం చేసేందుకు గాంధీభవన్ చుట్టూ చక్కర్లు కొడతానని వెల్లడించారు. కార్యకర్తలు, నాయకులపై బీఆర్ఎస్ నాయకులు పెట్టిన తప్పుడు కేసులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ నగరాభివృద్ధిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలకు దమ్ముంటే చర్చకు రావాలని, ఇందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేయడం కాదని, ప్రజాక్షేత్రంలోకి వస్తే తేలుతుందన్నారు. మహబూబాబాద్‌కు చెందిన రవీందర్‌రావు మంత్రి కొండా సురేఖపై చేసిన వ్యాఖ్యలు శోచనీయమన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సభ్యత లేని వారుగా ప్రవరిస్తున్నారని ధ్వజమెత్తారు.

పశ్చిమ అభివృద్ధిపై నాయిని అంకితభావం

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అంకితభావం స్ఫూర్తిదాయకమని పరకాల ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద అభివృద్ధి అవశ్యకతను వివరిస్తూ ఒప్పిస్తున్నారన్నారు. తమ లాంటి సీనియర్లు కూడా అబ్బురపడేలా పనిచేస్తున్నారన్నారు. పశ్చిమ అభివృద్ధిని చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ నగరానికి వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.5,500 కోట్లు మంజూరు కావడంలో ఎమ్మెల్యే నాయిని పాత్ర కీలకమని ఎంపీ కడియం కావ్య చెప్పారు. కాజీపేట బస్టాండ్ నిర్మాణం, ఫాతిమానగర్ బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి కావడానికి కృషి చేస్తున్నారన్నారు. పార్టీ కోసం నిజాయితీగా పని చేస్తే తప్పక న్యాయం జరుగుతుందని, ఇందుకు రాజేందర్‌రెడ్డి సాక్ష్యమని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. అందరినీ సమన్వయపరుస్తూ రాజేందర్‌రెడ్డి పని చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. విజయోత్సవ సభలో కార్యకర్తలను సన్మానించడం గొప్ప విషయమని, తమ నియోజకవర్గంలో కూడా ఇదే స్ఫూర్తి చాటుతామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి కృషి చేసిన రాజేందర్‌రెడ్డి అభినందనీయుడని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కొనియాడారు. గ్రేటర్ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పని చేస్తున్నారని మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, వరద రాజేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, డాక్టర్ శ్రవణ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చరిత్రతోనే భవిష్యత్ తరాలకు చక్కటి మార్గదర్శనం

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- హిస్టరీ విభాగంలో మూడు రోజుల సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, పక్కన ప్రొఫెసర్లు, చరిత్రకారులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర అధ్యయనంతో మన భవిష్యత్ తరాలకు చక్కటి మార్గదర్శనం చేయొచ్చని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. శనివారం కేయూ సెనెట్ హాల్‌లో చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ అధ్యక్షతన మూడురోజుల పాటు ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ప్రారంభ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగాహాజరైన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పురాతన శాసనాలు జాతి ఆస్తి అని చెప్పారు. వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నారు. చరిత్ర శాసనాల్లో ఆనాటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమాచారం నిక్షిప్తంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర కూటులు, పల్లవులు, చోళులు, పాండ్య రాజులు, హోయసాలలు, కాకతీయు కాలం నాటి శాసనాల్లో రాజకీయ అంశాలతో పాటు సామాజిక, ఆర్థిక విషయాలు తెలుసుకోవచ్చునని వివరించారు. యువ చరిత్ర పరిశోధకులు ఎపిగ్రాఫీపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అలాగే మల్టీ డిసిప్లెన్, బహుముఖ ప్రజ్ఞ ఉండాలని అన్నారు.

కలకత్తా యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, యన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్, విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సుస్మిత బసు మజుందార్ మాట్లాడుతూ.. 1978 నుంచి తమ సంస్థ చరిత్ర పరిశోధనలతో పాటు అకడమిక్‌గా పనిచేస్తోందని అన్నారు. దేశంలోని ప్రదేశాల పేర్లలో సామాజిక, ఆర్థిక చరిత్ర నిక్షిప్తంగా దాగి ఉందని చెప్పారు. సాహిత్యం, పురావస్తు శాస్త్రాలు అదే విషయాన్ని రూఢీ చేస్తున్నాయని వివరించారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనూ ఈ ప్రస్తావన ఉందన్నారు. ఆయా పుస్తకాల్లో సరుకును బట్టి ఊరు పేరుందని వివరించారు. సింధూ నది పేరుతో సైంధవ లవణం, లవణి గ్రామం, లవణి తాటక, ఏనుగు పేరుతో హస్తిపదా, హస్తినాపురా అనే పేర్లు వచ్చాయని పేర్కొన్నారు. మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.స్వామినాథన్‌లు చరిత్ర అధ్యయన ప్రాధాన్యతను వివరించి యువ పరిశోధకులు నూతన అంశాలపు వెలికితీయాలని కోరారు. కేయూ సోషల్ సైన్స్ విభాగాల డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ మాట్లాడుతూ.. వర్సిటీలో మూడు రోజుల సదస్సు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు కేయూ చరిత్ర విభాగం ప్రాశస్త్యాన్ని అభివృద్ధిని వివరించారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. చరిత్ర గొప్పతనాన్ని గుర్తించాలని, యువ పరిశోధకులు మతపరమైన అడ్డం కులను అధిగమించాలని కోరారు.

ఈ సదస్సులో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నాలుగు పరిశోధన పుస్తకాలను ఆవిష్కరించారు. రష్యా దేశం ప్రముఖ చరిత్రకారులు అలెగ్జాండర్ సదస్సులో ఎపిగ్రాఫిక్ సొసైటీ బాధ్యులు, డాక్టర్ ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ టీఎస్ రవిశంకర్, డాక్టర్ ఎస్.కృష్ణమూర్తి, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.రామచంద్రారెడ్డి అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కృష్ణనుమంత్, డాక్టర్ ఉప్పయ్య, డాక్టర్ వై.రాంబాబు, డాక్టర్ బలుగూరి రాజు డాక్టర్ కేవీఎస్ నరేందర్, డాక్టర్ దామెరభిక్షపతి, డాక్టర్ ఆకులపల్లి కుమారస్వామి, డాక్టర్ ఎమ్డీ.రహీమ్, డాక్టర్ బ్రహ్మంతోపాటు దేశ, విదేశాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. కాగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి.

అమలు కాని హామీలతో కాంగ్రెస్ మోసం

- నర్సంపేట అభివృద్ధిని విస్మరిస్తున్న ఎమ్మెల్యే
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజం

నర్సంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు నిరాశే మిగిలిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల అమలుకు నోచుకోని తీరుకు నిరసనగా పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రూ.12 వేలు, కూలీలకు రూ.10వేలు, మహిళలకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందన్నారు. అభివృద్ధి, మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకు సఖ్యతలేనట్టు నటిస్తూ, చీకటి ఒప్పందాలతో నర్సంపేట అభివృద్ధిని విస్మరిస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో అభివృద్ధి, సంక్షేమం ఆగిపోయిందన్నారు. అవినీతి, అక్రమకేసులు, పోలీసుల రాజ్యం నడుస్తోందన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికోసం తాను తీసుకువచ్చిన నిధులను సొంత కాంట్రాక్ట్ సంస్థతో ఎమ్మెల్యే దొంతి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. గిరిజన తండాలకు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లను మంజూరు చేయిస్తే వాటిని రద్దుచేసి పనులను నిలిపివేశారన్నారు. లాభాల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే సొంత కాంట్రాక్టు సంస్థతో మళ్లీ టెండర్లు పిలిపించుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీవో 346 ద్వారా రూ.75కోట్లతో ప్రత్యేకంగా నర్సంపేట నియోజకవర్గానికి వ్యవసాయ యాంత్రీకరణ ప్రాజెక్టును తీసుకువచ్చానని అన్నారు. అందులో రూ.16కోట్లు ఖర్చుకాగా, మిగతా రూ.59కోట్ల నిధులు వెనక్కిపోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ మంత్రికి లేఖరాశానన్నారు రైతులకు ఉపయోగపడే పైలట్ ప్రాజెక్టును ఆపేశారని అన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మెన్ గుగులోతు రామస్వామి నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్. పార్టీ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గోనె యువరాజ్. డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బానోతు సారంగపాణి, మచ్చిక నర్సయ్య గౌడ్, ఊడ్గుల ప్రవీణ్‌తో పాటు నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకలు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని అవమానపరుస్తున్న సీఎం

తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి కొత్తరూపంతో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలుచేస్తూ తెలంగాణ తల్లిని సీఎం రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడాన్ని, అంబేద్కర్ జయంతి రోజు ఆయన విగ్రహానికి నివాళులు అర్పించకుండా అడ్డుకున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ నర్సంపేట పట్టణంలోని తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అణచివేత పద్ధతిలో తెలంగాణ విగ్రహం రూపాన్ని మార్చాలనుకోవడం కాంగ్రెస్‌కు తగదన్నారు. రాష్ట్రంలో 6500 సెంటర్లలో, నర్సంపేట నియోజకవర్గంలో 40 సెంటర్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసి దైవంగా పూజించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.



నర్సంపేటలో తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

డబ్బు, బంగారం కోసమే హత్య

- మద్యం తాగించి, రోకలిబండతో కొట్టిచంపిన వైనం
- బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఐదు రోజుల పాటు పలు కోణాల్లో విచారణ జరిపి నిందితుడిని పట్టుకున్నారు. డబ్బులు, బంగారం కోసమే ఈ హత్య చేసినట్లు నిర్ధారించారు. కేసు వివరాలను శనివారం సాయంత్రం మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వెల్లడించారు.

ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన నిందితుడు జక్కుల శ్రీనివాసరావు కొంత కాలంగా హనుమకొండ ప్రగతినగర్ రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మణెమ్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ప్రధాన మంత్రి యోజన స్కీమ్‌లో కో ఆర్డినేటర్‌గా పని చేస్తూనే దాంతో పాటు పెళ్లి సంబంధాలు చూస్తానంటూ డబ్బున్నవారికి అందమైన అమ్మాయిల ఫొటోలు చూపిస్తూ మభ్యపెట్టి ఏదో ఒకరకంగా వారిని ఇరికించి తద్వారా డబ్బు వసూలు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల కిందట అతడికి ఒక ఫోన్ దొరికింది. దాన్ని తిరిగి ఇచ్చే క్రమంలో రాజమోహన్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత వీరిద్దరు కలిసి తిరగడం, బార్లలో కూర్చొని మద్యం సేవించడం మామూలైపోయింది. ఈ క్రమంలో తనకు ఇద్దరు ఆడపిల్లలున్నారని, ఒకరు యూఎస్ఏలో, మరొకరు హైదరాబాదులో ఉంటున్నారని, తన భార్య చనిపోయిందని, ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నానని, ఎవరైనా వితంతు ఉంటే పెళ్లి చేసుకుంటానని రాజమోహన్ చెప్పుకున్నాడు. దాన్ని ఆసరాగా తీసుకున్న శ్రీనివాసరావు తనకు రూ.5లక్షలు అవసరం ఉందని అడిగాడు. ప్రస్తుతం తన దగ్గర లేవని రాజమోహన్ చెప్పడంతో ఎలాగైనా అతడి ఒంటిమీద ఉన్న బంగారం అయినా తీసుకోవాలని భావించాడు. పథకం ప్రకారం ఈ నెల 2న రాత్రి రిటైర్డు మేనేజర్‌ని నమ్మించి ప్రగతినగర్‌లోని తన ఇంటికి తీసుకొచ్చి మద్యం తాగించాడు. తర్వాత రోకలిబండతో కొట్టి చంపేశాడు. అతడి ఒంటిపై ఉన్న బంగారు బ్రాస్‌లెట్, గొలుసు, మూడు ఉంగరాలు తీసుకున్నాడు. తర్వాత మృతదేహాన్ని కారు వెనుక సీటులో పెట్టుకొని నగరంలోని పలుప్రాంతాల్లో తిరిగాడు. ఎక్కడా పడేయడానికి వీలు కాకపోవడంతో చివరికి వరంగల్ రంగంపేట ఏరియాకి వచ్చి అక్కడ ఎలాంటి జనసంచారం లేకపోవడంతో రోడ్డుపక్కన కారు వదిలిపెట్టి అక్కడి నుంచి ఆటోలో వెళ్లిపోయాడు.

ఆటో ఆధారంగా నిందితుడి ఆచూకీ

శ్రీనివాసరావు ప్రయాణించిన ఆటోను సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలించిన పోలీసులు ఆటోడ్రైవర్‌తో మాట్లాడి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. శనివారం అరెస్టు చేసి అతడి వద్ద సెల్‌ఫోన్, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు అతడు ఉపయోగించిన రోకలిబండను సైతం స్వాధీనపర్చుకున్నారు. హత్య కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, సాంబయ్య, విఠల్, లచ్చయ్య, క్రైం పార్టీ పోలీసులను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు. కాగా, నిందితుడు గతంలో యూట్యూబ్ జర్నలిస్టుగా పనిచేస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

ఏసీ బస్సుల టికెట్టు చార్జీలపై రాయితీ

హనుమకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏసీ బస్సుల టికెట్టు చార్జీలపై 10 శాతం రాయితీ కల్పించనున్నట్లు వరంగల్ రీజియన్ మేనేజర్ డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మరింత సౌకర్యాలను కల్పించడం కోసం ఏసీ బస్సుల టికెట్టు చార్జీ తగ్గించినట్లు ఆర్ఎం తెలిపారు. ఈ అవకాశాన్ని లహరి ఏసీ స్లీపర్, ఏసీ సీటర్ రాజధాని బస్సులకు డిసెంబరు నెల మొత్తం టికెట్టుపై 10 శాతం రాయితీ ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అరుణాచలగిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు

తమిళనాడులోని అరుణాచలగిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం హనుమకొండ నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు శనివారం వరంగల్ రీజియన్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. డిసెంబరు 15న పౌర్ణమి సందర్భంగా ఈనెల 13 మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండు నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ టికెట్టు ధర పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,000 ఉన్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సెల్:9959226056, 9014169807లను సంప్రదించగలరని ఆయన కోరారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ సమాజానికి క్షమాపణ చెప్పాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పేరాల మధుసూదన్‌రావు, బల్గూరి శ్రీరామారావు

వడ్డెపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెలమ కులస్తులపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పేరాల మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు కోశాధికారి సిద్దూరి స్వామిరావు, కార్యవర్గ సభ్యులు బల్గూరి శ్రీరామారావులు మాట్లాడారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన ప్రవర్తనను మార్చుకోవాలని హెచ్చరించారు. కులాల మధ్య చిచ్చుపెట్టడం దౌర్భాగ్యమని అన్నారు. శాసనసభ్యుడైన వీర్లపల్లి శంకర్ రాజకీయ వ్యవస్థను దిగజార్చుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జ ప్రభాకర్‌రావు, తక్కళ్లపల్లి సోమేశ్వర్‌రావు, జిల్లా నాయకులు దేశినేని సత్యనారాయణరావు, పల్లెపాటి బాలకిషన్‌రావు, మార్నేని వెంకటేశ్వర్‌రావు, తాటిపర్తి రాంచందర్‌రావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ కబుర్లు

10న దివ్యాంగుల దినోత్సవం

కేయూక్యాంపస్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10న మంగళవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని కేయూ దివ్యాంగుల సెల్ డైరెక్టర్ ఎ.రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యురాలు కె.అనితారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్ హాజరవుతారని తెలిపారు.

సౌత్ జోన్ మహిళల టెన్నిస్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7నుంచి 9 వరకు కర్నాటకలోని మణిపాల్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ మహిళ టెన్నిస్ జట్టును 2024-25 ఏడాదికి గాను శనివారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో డి.ప్రదీప్త. (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), బి.భూమిక, (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), ఎ.అఖిల, (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్) కె. భూమిక,(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి)ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా బొల్లికుంట వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యూ.రవీందర్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అభినందించారు.

సెమిస్టర్ పరీక్షల్లో 31 మంది డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి): కేయూ డిగ్రీ రెగ్యులర్ 1,3,5 సెమిస్టర్ పరీక్షలలో శనివారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 31 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు కట్ల రాజేందర్, ఎం.తిరుమలదేవి తెలిపారు. వారిలో ఆదిలాబాద్‌లో 26 మంది, ఖమ్మంలో ముగ్గురు, వరంగల్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు.

స్త్రీలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి): స్త్రీల ఆరోగ్య సమస్యలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అమ్‌తుల్లా హప్సా ఉద్బోధించారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు స్త్రీల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.భిక్షాలు సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీరియడ్‌లతో మహిళలు ఎదుర్కొనే సమస్యలను తేలికగా తీసుకోవద్దని కోరారు. ఎదైనా సమస్య ఎదురైతే వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో రచన, అధ్యాపకులు డాక్టర్‌వీణ, సాహితీ, జ్యోత్స్న, శ్రీజ,లావణ్య, చైతన్య పాల్గొన్నారు.

ఫార్మసీలో ఇద్దరికి డాక్టరేట్


శ్రీరమ్య


దివ్య

కేయూ క్యాంపస్, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభా గంలో ఇద్దరు డాక్టరేట్ సాధించారు. వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శనివారం వారికి డాక్టరేట్ ప్రకటిం చారు. 'డిజన్, సింథసిస్ అండ్ స్క్రీనింగ్ ఆఫ్ న్యూ హెట్రోసైకి కంపోండ్స్ ఫర్ న్యూరోడిజినేరేటీవ్ ఆఫ్ డిసోడర్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు శ్రీరమ్య డాక్టరేట్ పొందారు. కేయూ ఫార్మసీ విభాగం డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో శ్రీరమ్య పరిశోధన పూర్తి చేశారు. అదేవిధంగా 'సింథసిస్ అండ్ సీఎస్ఎస్ అక్టీవీటీ ఆఫ్ న్యూ ఐడోంల్ డెరీవర్సిటీస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను దివ్య డాక్టరేట్ పొందారు. కేయూ ఫార్మసీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ ఎం.సారంగపాణి పర్యవేక్షణలో దివ్య పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన ఇద్దరిని పలువురు అభినందించారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

తలంబ్రాలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు





వేయిస్తంభాల ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు, ఉర్సు నాగమయ్య ఆలయానికి తరలివచ్చిన భక్తులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో శనివారం నేత్రపర్వంగా సుబ్రమణ్యషష్ఠి కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని కళ్యాణోత్సవానికి గాను ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకొని దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా పవిత్ర సుబ్రమణ్యషష్ఠిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కళ్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక కల్యాణ వేదికపై పంచలోహ ఉత్సవ విగ్రహాలనుంచి పాంచరాత్ర ఆగమానుసారంగా కళ్యాణోత్సవ తంతును నిర్వహించారు. దారురి శ్రీమన్నారాయణచార్య, మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మలు శాస్త్రయుక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆలయాల్లో ప్రభుత్వ ప్రజా పాలన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.

● కాజీపేట: కాజీపేట వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై శనివారం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు బోళ్ల వాణి కుమారస్వామి, దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పండిత్ సూర్జిత్ రామ్, అంజనేయ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలుచేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరై కల్యాణం తిలకించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రవితేజ, జక్కుల రాజు, జేకే మేకల రవి, గోల్కొండ శివరాం, గిరిధర్, మర్యాల కృష్ణ, పెసరు రాజేశ్, పాలడుగుల కిషన్, బొల్ల రమేశ్, బండి విజయ్ కుమార్, జి.శ్రీవణీకుమార్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: లేబర్‌కాలనీలోని పంచముఖ వీరేంద్రస్వామి దేవాలయంలో శనివారం వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని ప్రధాన పూజారి శివశ్రీ భోగేశ్వరశాస్త్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం దేవులపల్లి రాకేష్-ప్రవళిక దంపతులు మహాఅన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ నాయకులు మామిడాల రమేష్‌బాబు, ఆరుగొండ భూదేవి, గజవెళ్ళి లక్ష్మయ్య, కుందారపు రాజేందర్, ఎ. రమేష్, మూడెడ్ల సతీష్, రాజసమ్మయ్య, సుచిత్ర, రాజేందర్ పాల్గొన్నారు.

● శంభునిపేట: ఉర్సు నాగేంద్రనగర్‌లోని ప్రసిద్ధ నాగేశ్వర ఆలయంలో శనివారం వల్లీ సమేతసుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం రమణీయంగా సాగింది. వేడుకలను తిలకించటానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి కోటయ్య శర్మ కడురమణీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన నాగమయ్య ఆలయం కావడం, అతి పెద్ద సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం ఉండడంతో ఈ ఆలయం విశిష్టతను తెలుసుకోవటానికి ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేడుకల్లో కార్పొరేటర్‌లు పోశాల పద్మస్వామి, గుండు చందనపూర్ణచందర్, బీజేపీ జిల్లా నాయకులు కర్నె రవీందర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500కోట్లు కేటాయించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎరుకల ప్రజాసమితి నేతలు

వడ్డేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి (టీఈపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కెమసారపు తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతి సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంది ప్రవీణ్‌లు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 50వేలకు పైగా కుటుంబాలు పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు.

పందులను షెడ్లలో పెంచుకోవడానికి ప్రతీ కుటుంబానికి రూ.10లక్షల వ్యక్తిగత రుణ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏకలవ్య కార్పొరేషన్ ద్వారా ప్రతీ జిల్లాకు వెయ్యి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏకలవ్య కార్పొరేషన్ నిధుల నుంచి కేటాయించి ట్యాంకు బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందు కోసం ఈ నెల 17న హైదరాబాద్‌లో ప్రతినిధుల సభను నిర్వహిస్తున్నట్లు తిరుపతి తెలిపారు. సమావేశంలో టీఈపీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు కూతాడి కోమల, కుర్ర రజిత, పులిచేరి రజిత, కేతిరి సాంబ, దేవర రేణుక, పల్లకొండ పోశాలు, అంగడి రమేష్, బిజిలి శ్రీనివాస్, మానుపాటి రమేష్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో అవకతవకలు లేవు

'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలకు స్పందించిన కలెక్టర్ పి.ప్రావీణ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు. 'భద్రకాళి గర్భంలో ఏముందో..?' 'భద్రకాళి మట్టిపై.. అక్రమార్కుల కన్ను..!' అనే శీర్షికలతో ఈనెల 6, 7 తేదీలలో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. వెంటనే అన్ని లైన్ డిపార్ట్‌మెంట్స్, ఇరిగేషన్, కుడా గ్రేటర్ మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, మైన్స్ అండ్ జియాలజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రౌండ్ వాటర్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్స్‌తో పూడికతీత పనులపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భద్రకాళి చెరువు పూడికతీత పనులు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్‌ల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, ఎటువంటి అవకతవకలు లేకుండా పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అలాగే పనులు జరుగుతున్న సమయంలో ఏవైనా పురాతన విగ్రహాలు లభిస్తే సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు అందజేస్తామన్నారు. చెరువు మట్టి కావాల్సిన వారు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించాలని, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అనుమతిలేనిది ఎవరైనా మట్టి అక్రమంగా తరలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

కుటుంబ నియంత్రణలో పురుషులు ముందుండాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



కు.ని. ఆపరేషన్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

హసన్‌పర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పురుషులు ముందు వరుసలో ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు. వెసెక్టమీ అవగాహన, శస్త్ర చికిత్సల పక్షోత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కోత, కుట్టులేని ఎన్ఎస్‌వీ ఆపరేషన్ చాలా తేలికైందని ఆపరేషన్‌కు ముందుకు రావడం మగవారి బాధ్యత అని అన్నారు. కోత, కుట్టులేని ఎన్ఎస్‌వీ ఆపరేషన్ గురించి వివరించారు. ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాషా మాట్లాడుతూ.. ఎన్ఎస్‌వీ ఆపరేషన్ వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఆపరేషన్ తర్వాత కూడా తమ పనులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 32 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాజు, స్థానిక వైద్యాధికారి రామక్రిష్ణ, భార్గవ, డాక్టర్ భరత్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎస్‌వో ప్రసన్నకుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.మాధవరెడ్డి, పీహెచ్ఎస్ మెరీనా, హెచ్ఈవో రాజేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు లచ్చులు, రూతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు కందుకూరి సంతోష్, నాగయ్య, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

11న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎం.మల్ల య్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో జనరల్ డ్యూటీ అసిస్టెంట్లు, హాస్పిటల్ బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న 50 పోస్టు లకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు హాజరు కావాలని కోరారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తొలి దశలోనే కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. జాతీయ కుష్టువ్యాధి (లెప్రసీ) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నూతన లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వేలెన్స్ ఎల్‌సీడీసీ ప్రోగ్రామ్‌లో భాగంగా లష్కర్‌సింగారం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశాలతో సమావేశం నిర్వహించి ఈ నెల 2 నుంచి నిర్వహిస్తున్న సర్వే వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఈ నెల 15 వరకు ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ కుష్టువ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, వైద్యాధికారి డాక్టర్ హైదర్, జిల్లా మాస్‌మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎంఓ రవీందర్, కొమురయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మడికొండలో మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం



మడికొండలో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, కాంగ్రెస్ నాయకులు

మడికొండ, డిసెంబరు 7: తెలంగాణ రాష్ట్ర ఐటీ, కమ్యూనికేషన్ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం జిల్లాకు చేరుకున్న సందర్భంగా శనివారం మడికొండలో ఘనస్వాగతం లభించింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్‌రాజు , కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కండువా కప్పి మంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ రఘు పైడిపాల, బిల్ల రవీందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, కర్ర హరీష్‌రెడ్డి, కంచన పెల్లి వెంకటయ్య, వస్కుల నాగరాజ్, వస్కుల శ్రీను, నీలం వేణుయాదవ్, వస్కుల భాస్కర్, కడమంచి సాయిలు, కళ్ళెపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అస్తమించిన శ్రీనివాస్ మాస్టారు

● అంత్యక్రియలకు తరలివచ్చిన అశేష ప్రజానీకం



శ్రీనివాస్‌రావు (ఫైల్)

శంభునిపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎందరికో విద్యా బుద్ధులు నేర్పడమే కాకుండా ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవ చేస్తూ మరెంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన శ్రీనివాస్ మాస్టారు ఇక లేరు. నగరంలోని రంగశాయిపేటకు చెందిన దున్నాల శ్రీనివాసరావు (65) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో రంగశాయిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాసరావు ఉర్సు, కరీమాబాద్‌తో పాటు జిల్లాలోని పలు పాఠశాలల్లో 35 ఏళ్ల ఉపాధ్యా యుడిగా సేవలందించారు. అంతేకాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన మరణ వార్తను తెలుసుకొని తన శిష్యులతో పాటు బంధుమిత్రులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. అశ్రున యనాలతో ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సీనియర్ పాత్రికేయుడు శెంకేసి శంకర్‌రావు, కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, కేడల పద్మజనార్దన్, కర్నె రవీందర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహరాములు, బాధ్యులు కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, ఎలుగు రవి, రాజా మహేందర్, సంపెట రాఘవులు, తదితరులు శ్రీనివాస్ అంతిమయాత్రలో పాల్గొని భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

వరంగల్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశాయిపేట సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం విద్యుత్ వినయోగదారుల సదస్సు ఏర్పాటు చేసినట్లు ఫోరం చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మ ర్ల మార్చటం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, లోపాలు ఉన్న మీటర్లు మార్చటం, నూతన సర్వీసుల మంజూరు, సర్వీసు పేరు మార్పు, సర్వీసు రద్దు తదితర సమస్యలకు సంబంధించి వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సదస్సులో దేశాయిపేట, ఆరెపల్లి, మట్టెవాడ, పోచమ్మమైదాన్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులు మాత్రమే పాల్గొనాలని, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన వివరించారు.

అవినీతిపై ఫిర్యాదు చేసిన వ్యక్తిని సత్కరించిన సీపీ

వరంగల్ క్రైం, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారిపై ఫిర్యాదు చేసి జైలు శిక్ష పడటంలో కీలకంగా నిలిచిన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ప్రాంతానికి చెందిన బాలెం వీరభద్రంను సీపీ అంబర్‌కిషోర్ ఝా శనివారం ఘనంగా సత్కరించారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఈ సందర్భంగా సీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీఆర్ఎస్ నాయకులు

కాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆదివారం జరుగనున్న ధర్నాకు కాజీపేట నుంచి శనివారం బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు 60శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, బస్టాండ్ ఏర్పాటు చేయాలని, బోడగుట్టకు పై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. రైల్వే మంత్రిని కలిసి వినతిప్రతం సమర్పిస్తామన్నారు. వారిలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్, దువ్వ కనుకరాజ్, శిరుమళ్ల దశరథం, ఎండీ అప్జల్, కోంద్ర శంకర్, ఎండీ హుస్సేన్, సుంచు అశోక్, బరిగెల వినయ్, రాబర్ట్ తదితరులు ఉన్నారు.

కార్మికుడి మృతిపై బల్దియాలో కలకలం

● అధికారుల ఒత్తిడే కారణమని కుటుంబ సభ్యుల ధర్నా



రఘు (ఫైల్)



మృతదేహంతో బల్దియా కార్యాలయం ఎదుట నిరసన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పనిచేసి సస్పెన్షన్‌కు గురైన కనకం రఘు (45) గుండెపోటుతో మృతి చెందాడు. అయితే సస్పెన్షన్‌కు గురై ఇంటి వద్దనే ఉంటున్న రఘుపై బల్దియా శానిటేషన్ విభాగానికి చెందిన ఓ అధికారి పోలీసు కేసు పెట్టించి మానసిక క్షోభకు గురి చేయడంతో శనివారం గుండె పోటుతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ మేరకు బల్దియా కార్యాలయం ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పదిహేను రోజులుగా మట్టెవాడ పోలీసులు రఘును ప్రతీ రోజు పిలిచి మానసికంగా ఇబ్బంది చేస్తున్నారని తెలిపారు. తనకు ఉద్యోగం రాకుండా ఓ అధికారి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కుటుంబ సభ్యులకు చెప్పేవాడని, ఇక తనకు ఉద్యోగం రాదనే బెంగ పెట్టుకున్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా బయటకు వచ్చి మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. దీంతో నిరసనకారులు వెనక్కి తగ్గారు. కాగా, రఘు మృతి చెందడానికి ఎవ్వరు ఒత్తిడి చేయలేదని బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేశాననడంతో వాస్తం లేదన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ సైనికులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి, సిబ్బంది, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్స్ శనివారం కలెక్టర్ ప్రావీణ్యను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్‌సీసీ కేడెట్స్‌తో వందన సమర్పణ చేశారు. అనంతరం సాయుధ దళాల పతాకాన్ని అందజేసి విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హుండీలో విరాళం వేశారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్స్ పతకాలను ప్రజల వద్దకువెళ్లి అమ్మి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎస్.సత్యశ్రీ, మాజీ సైనికులు మల్లయ్య, సోమా నర్సమ్మ, కె.సుమన్, మాడిశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

● **కన్సీజన్ సర్టిఫికెట్ జారీ చేయాలి**

వరంగల్ మెడికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హత గల దివ్యాంగులకు రైల్వే కన్సీజన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అంబటి రాజేందర్, అధ్యక్షుడు బండి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి గైనతీష్ ఉన్నారు.

● **రెవెన్యూ సంఘంతో మాకు సంబంధం లేదు..**

రాంనగర్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా ఆదివారం నూతనంగా ఏర్పాటు చేయబోతున్న రెవెన్యూ సంఘానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ)కు సంబంధం లేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. ఏ ఉద్యోగ సంఘానికి తాము వ్యతిరేకం కాదని, అనుకూలం కాదని ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూశాఖలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

● **మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి**

వడ్డెపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను అరికట్టాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్ బి.రమాదేవి అన్నారు. శనివారం చైతన్య మహిళా సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలపై జరుగుతున్న హింసను ఖండిస్తూ ప్లకార్డులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కళ, ప్రజా సంఘాల నాయకులు మార్క శంకర్‌నారాయణ, బాలరాజు, జనగాం కుమారస్వామి, అమిత, జ్యోతిరమణి, విలాసిని, రమ తదితరులు పాల్గొన్నారు.

● **మారథాన్ గడువు పొడిగింపు**

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ప్రతిపాదనల సమర్పణ గడువు పొడిగించినట్లు డీఈవో దౌలాగర్ వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు ప్రతిపాదనల సమర్పణకు అవకాశం కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

● **దళారులపై చర్య తీసుకోవాలి**

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పత్తి కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంవో సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తాల్లో తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ అధికారులు దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌రెడ్డి హంసరెడ్డి, కుసుంబ బాబూరావు, మహ్మద్ ఇస్మాయిల్, సుంచు జగదీశ్వర్, గోనె రాంచందర్, నగేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● **పేకాటరాయుళ్ల అరెస్టు**

హసన్‌పర్తి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ పరిధి పెగడపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.48,500ల నగదును స్వాధీనం చేసుకొని హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్సై శీలం రవి తెలిపారు.

● **ముగిసిన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు**

హసన్‌పర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ట్రీపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అభిజ్ఞాన్ 3.0 నేషనల్ లెవల్ టెక్నో కల్చరల్ ఈవెంట్ వేడుకలు శనివారం ఘనంగా ముగిసాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకలకు బెంగుళూరు సైబర్ సెక్యూరిటీ ఇంజనీరు ఓలేటి సాయి రూపక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఎథికల్ హాకింగ్, ఓఎస్ ఫండమెంటల్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, మాల్స్‌వేర్, ఓపెన్ సోర్స్ ఫోరెన్సిక్ అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కల్చరల్‌ఫ్యూజియన్‌లో విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్యాంప్‌ఫైర్, డీజే నైట్ ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్య క్రమంలో ఐట్రిపుల్‌ఈ ఎస్‌బీ అడ్వైజర్ మూల రాము, వివిద విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఎన్.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

● **టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు**

హసన్‌పర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వంగపహాడ్, పెగడపల్లి గ్రామాలలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు జరిపారు. వంగపహాడ్‌లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠా సభ్యులతో పాటు పెగడపల్లిలో పేకాటస్థావరంపై దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం హసన్‌పర్తి పోలీసులు గాలిస్తున్నారు. వంగపహాడ్ గ్రామానికి చెందిన తెట్టె శ్రీనివాస్, మౌటం రాజు, తెట్టె భిక్షపతి, గోనెల సదానందం గ్రామంలో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. వారి వద్ద సుమారు రూ.1,42,480 విలువ గల 54.8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. హసన్‌పర్తి ఎస్సై శీలం రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్మార్ట్ పడగ!

సెల్ ఫోన్లకు బానిసలవుతున్న జనం

- పిల్లల నుంచి పెద్దల వరకూ అదే 'మాయ'లో..
- 90 శాతం మంది పిల్లలపై అధిక ప్రభావం
- నాడీ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం
- నయనాలకు నష్టమని తెలిసినా వదలని వైనం
- మితిమీరిన వాడకంతో దెబ్బతింటున్న బాంధవ్యాలు

నర్సింహులపేట / గార్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవితం ఆధునికత వైపు అడుగులేస్తోందని ఆనందప డాలో.. అదే ఆధునికత జీవితాన్ని చీకటిమయం చే స్తోందని బాధపడాలో అర్థం కాని పరిస్థితి. ప్రస్తు తం ప్రపంచాన్ని స్మార్ట్ యుగం శాసిస్తున్న సమయంలో పిల్లల నుంచి పెద్దల వరకు తెలియకుండానే స్మార్ట్ ప్రపంచంలోకి జారి పోతున్నారు. ఉపయోగాలు ఎన్ని ఉన్నా యో నష్టాలూ అన్నే ఉన్నాయన్న విష యాన్ని పక్కనపెట్టి బానిస లు గా మారుతున్నారు. ముఖ్యంగా చేతిలో మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని వారున్నారంటే పరిస్థితి అ ర్థం చేసుకోవచ్చు. చివరకు నెలల వయసు న్న చిన్నారులు కూడా స్మార్ట్‌ఫోన్‌లో బొమ్మల వీడియోలు, రైమ్స్ లాంటివి చూపించనిదే పాలు తాగడం లేదు.. ఆహారం తీసుకోవడం లే దంటే ఏమేరకు స్మార్ట్ ఫో న్లు మన జీవితాలను కమ్మేశాయో చూడాలి. మానవ మనుగడ సాగాలంటే గాలి, నీరు, వెలుతురు, ఆహారం ఎంత ముఖ్యమో.. ప్రస్తు తం సెల్‌ఫో న్ అంతకంటే ముఖ్యమైపోయింది. మన దేశ జనా భాకు మూడింతలు సెల్‌ఫోన్లు ఉన్నాయని సర్వేలో తేటతెల్లమైంది. మొబైల్ ఫోన్ల వల్ల కూడ మానవ సంబంధాలు కనుమరుగై పోతున్నాయి. ఒకరితో ఒకరు ఆప్యాయంగా మాట్లాడుకునేది పోయి.. పొట్టి సందేశాలతో పలకరింపులు జరిగిపోతున్నాయి.

మేలుకోకుంటే ప్రమాదమే..

పిల్లలు సెల్ ఫోన్లు వాడే విషయంలో జాగ్రత్తలు పాటించకుంటే పెను ప్రమాదాలే ఎదుర్కొకతప్పదు. కొందరు తల్లిదండ్రులైతే మా పిల్లవాడు ఏడాది వయస్సు నుండే మొబైల్ ఆపరేట్ చేసేస్తున్నాడండీ అంటూ గొప్పలు చెప్పకుండా నష్టాన్ని అంచనా వేసి ముందుకు సాగాలి. వీలైనంత వరకు వారిని సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి. నిద్రపో యే గదిలో టీవీ, ఐప్యాడ్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ల లాం టివి ఉంచకూడదు. ఇన్‌డోర్, అవుట్ డోర్ గేమ్స్‌కు అలవాటు చేయాలి. డ్యా న్స్ మ్యూజిక్ లాంటి వాటిపై దృష్టి సారించేలా చూడాలి. అల్పాహారం, భోజనం తీనే సమ యంలో టీవీ, ఫోన్ చూడటం లాంటివి చేయ కుండా చూసుకోవాలి. ముఖ్యంగా పెద్దలు పిల్లల ముందు మొబైల్ ఫోన్లు వాడటం మానాలి. వారాంతంలో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. వారితో మమేకమై ఆట పాటలతో వారి దృష్టిని మళ్లకుండా చూసుకోవాలి.

ఓ సర్వేలో విస్తుపోయే విషయాలు

ఇటీవల ఓ ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ, సైబర్ మీడియా రిసెర్చ్ (సీఎంఆర్)తో కలిసి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల నుంచి 1500కు పైగా నమూనాలను సేకరించారు. సర్వే ప్రకారం 12 ఏళ్లకు పైబడిన పిల్లలు స్మార్ట్ ఫోన్లను ఎక్కువగా వాడుతున్నారని, వారు రోజుకు సగటున 5, 6 గంటలపాటు ఫోన్‌లో లీనమౌతూ ఎక్కువ సమయం గేమ్స్‌కే కేటాయిస్తున్నారని తేలిసింది. 90 శాతం మంది పిల్లలు ఇంట్లో ఉంటే ఫోన్‌తప్ప మరో ధ్యాస ఉండడం లేదని, చాలామంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని 94 శాతం మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కళాశాల, పాఠశాలస్థాయి పిల్లల్లో 83 శాతం మంది నిద్రలేవగానే సెల్ ఫోన్‌తో గడిపేస్తున్నారు. 63శాతం మంది నిద్రపోయే ముందు ఫోన్ చూస్తున్నారు. తల్లిదండ్రుల విషయానికి వస్తే 87, 73 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వాడుతూ పిల్లలతో రోజుకు సగటున 2 గంటలు మాత్రమే కేటాయిస్తున్నారు. కళాశాల స్థాయి విద్యార్థులు పాఠశాల స్థాయి పిల్లలు 58 శాతం మంది స్నేహితులతో కనెక్టు అయ్యేందుకు స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారు.

దెబ్బతింటున్న బంధుత్వాలు.. ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు..

సెల్‌ఫోన్ అతిగా వాడటంతో బంధుత్వాలపై తీవ్ర ప్రభావం పడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. 90 శాతం మంది పెద్దలు, పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లో కాలం గడిపేస్తుండటంతో ఇతరులతో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కుటుంబ బాంధవ్యాలను కూడా పట్టించుకోకుండా ఒంటరవుతున్నాడని తాజా అధ్యయనంలో వెల్లడవం ఆందోళన కలిగించే అంశం. పిల్లలతో పాటు పెద్దల్లో ప్రధానంగా దృష్టిలోపం వస్తోంది. మొబైల్ ఫోన్‌ను కళ్లకు అతిదగ్గరగా పెట్టుకొని చూస్తుండటం, చీకటిలో ఎక్కువగా చూడటం లాంటి వాటి వల్ల కంటిచూపు కోల్పోతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరోపక్క ఊబకాయం పెరిగిపోతుంది. తలనొప్పి. మెదడు సంబంధ సమస్యలు, నిద్రలేమి, నాడీ వ్యవస్థ దెబ్బతినడం లాంటివి కూడా వస్తున్నాయి.

సెల్ ఫోన్ అతిగా వాడితే ప్రమాదమే..

దారం రవీందర్, రేడియాలజిస్టు, వరంగల్



సెల్‌ఫోన్ మితిమీరిన వాడకంతో రేడియేషన్ తీవ్రతవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్రధానంగా కంటి చూపు తగ్గడంతో పాటు క్యాన్సర్, గుండె, మెదడు మందగించడం, పని విధానం తగ్గడం, స్త్రీలల్లో గర్భకోశ వ్యాధులు అధికంగా వస్తాయి. స్మార్ట్‌ఫోన్ వాడకం తగ్గించుకోకుంటే మానవ మనుగడకు ప్రమాదం తప్పదు. ఒక్క ఆరోగ్య పరంగానే కాదు సైబర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

టైప్‌రైటర్.. కనుమరుగు

కంప్యూటర్ రాకతో కాలగర్భంలోకి..



ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో టైప్‌రైటర్ చేసే 'టక..టక..'అనే శబ్దంతో కళకళలాడుతూ ఒకరకమైన హడావుడి ఉండేది. కాలక్రమేణా కంప్యూటర్, ప్రింటర్ రాకతో టైప్ రైటర్ కాల గర్భంలో కలిసిపోయింది. ఇప్పుడు చూద్దామన్నా టైపింగ్ యంత్రం ఎక్కడా కానరావడంలేదు. నూతన సాంకేతికతతో అంతరించిపోయిన పరికరాల జాబితాలో టైప్‌రైటర్ ఎప్పుడో చేరింది. భవిష్యత్తులో దీన్ని మ్యూజియంలో చూడాల్సి వస్తుందేమో. ఒకప్పుడు కార్యాలయ టేబుల్‌పై హుందాగా ఉన్న టైప్‌రైటర్ కేసముద్రం ఎంపీడీవో కార్యాలయం స్టోర్‌రూంలో నిశబ్దంగా అవసాన స్థితిలో కనిపించడంతో టైపింగ్ అభిమానులు అయ్యో...! కాలం ఎంత చిత్రమైందని అనుకుంటున్నారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

కృష్ణవేణికి గోల్డ్‌మెడల్

ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్‌లో పతకం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే రెండు కాళ్ల చచ్చుబడిపోయినా జీవన ప్రయాణంలో అధైర్యపడకుండా విశ్వనాథ పురం గ్రామానికి చెందిన మాచర్ల ఎల్లయ్య కుమార్తె, మాచర్ల కృష్ణవేణి ఇంటర్నేషినల్ పారా త్రోబాల్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. గత నెల 30న కృష్ణవేణి కాంబోడియా వెళ్లింది. ఈనెల 2వ నుంచి 5 వరకు జరిగిన పోటీలో అత్యంత ప్రతి భ, నైపుణ్యాలను కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించి సత్తా చాటింది. 5న రాత్రి అక్కడి అధికారుల చేతుల మీదుగా కృష్ణవేణి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దాత బెలిదె వెంకన్న కృష్ణవేణికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో కృష్ణవేణికి సాయం అందించి పారా ఒలంపిక్స్ క్రీడల్లో పోటీపడాలే తర్ఫీ దును తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించి కాంబోడియా దేశంలో జరిగే ప్రపంచ స్థాయి పోటీలకు సెలెక్ట్ కావడంతో పాటు పోటీలకు రావాలని అక్కడి నుంచి పిలుపువచ్చింది. పేద కుటుంబానికి చెందిన క్రిష్ణవేణి అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో అక్టోబరులో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రూ.1.05లక్షల ఆర్థిక సాయం అందించారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కృష్ణవేణి



భద్రకాళి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఊకల్‌లో స్వామికి తలంబ్రాలు సమర్పిస్తున్న శ్రీధర్‌బాబు

కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

వరంగల్ కల్చరల్/గీసుగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం షష్టి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం నాగేంద్రస్వామి దేవాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మీ ముహూర్తం నుంచే సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వేద మంత్రాలతో అభిషేకం, అలంకరణ, హారతులు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపించారు. గీసుగొండ మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వర, వల్లీదేవి, దేవాసేనాదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముందు ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్ల, ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కల్యాణవేదికకు తోడ్కొని వచ్చారు. కల్యాణోత్సవాన్ని జ్యోతిష్యరత్న సముద్రాల సుదర్శనాచార్యులు కన్నుల పండువగా జరిపించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి వేడుకలను తిలకించారు. ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు హాజరై స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, మాచినపెల్లి మోతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు

వరంగల్ ఎల్లం బజార్‌లోని ప్రసిద్ధ శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, ఉర్సులోని నాగేంద్రస్వామి దేవాలయం, శివనగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయం, బట్టల బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని నాగేంద్రస్వామి, ఓసిటీలోని నాగేంద్రస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, రామన్నపేటలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో గల శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, ములుగు రోడ్‌లోని కన్నెమూల గణపతి దేవాలయం సమీపంలో నాగేంద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకం పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో వేయి అరటిపండ్లతో సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం లేనివారు, వివాహం కానివారు స్వామి వారి కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

వేడుకలకు హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు

భద్రకాళిదేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చక బృందం స్వామివారికి అభిషేకం అలంకరణ అనంతరం వల్లీదేవసేన సుబ్రహ్మహ్యేశ్వర స్వామి దేవతామూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, ఆలయ సూపరిండెంటెంట్ అద్దంకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళిలో ధ్యాన మందిరం

- చెరువు మధ్యలోని ద్వీపంపై నిర్మాణం
- ఐల్యాండ్ నుంచి మాడవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జి
- 2005లోనే తయారైన డీపీఆర్‌కు కొత్త మెరుగులు



భద్రకాళి చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్ (ద్వీపం)

హనుమకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా భద్రకాళి చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్ (ద్వీపం)పై ధ్యాన మందిరాన్ని నిర్మించాలన్న ప్రతిపాదన మరోసారి తెరమీదికి వచ్చింది. 2005లోనే ఈ ప్రతిపాదనకు బీజం పడింది. అప్పట్లోనే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఈ మేరకు రూ.2కోట్లతో డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రూపొందించింది. అప్పట్లో నిధుల కొరతవల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు తాజాగా డీపీఆర్ మరోసారి పరిశీలనకు వచ్చింది. అయితే మారిన పరిస్థితులు, ఇప్పటి అవసరాల దృష్ట్యా ఈ డీపీఆర్‌ను సవరించి మరింత ఆధునిక పద్ధతుల్లో ఐలాండ్‌ను అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. సరిగ్గా చెరువు మధ్యలో ఉండే ఈ ఐలాండ్ (మట్టి దిబ్బ) సుమారు 2 నుంచి 3 ఎకరాల వరకు ఉంటుందని అంచనా. దీనిపై ధ్యానమందిరాన్ని నిర్మిస్తారు.

2015లో చెరువులోని నీరు పూర్తిగా ఇంకిపోయినప్పుడు ఈ ద్వీపం స్వరూపం, స్వభావం పూర్తిగా బయటకు వచ్చింది. అప్పట్లో అధికారులు ఈ దిబ్బమీదకు వెళ్లి పరిశీలన కూడా చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా జరిపిన తవ్వకాల్లో కొన్ని ప్రాచీన శిల్పాలు కూడా బయట పడ్డాయి. ధ్యాన మందిరం నిర్మాణానికి ఐలాండ్ అనువుగా ఉందన్న నిర్ధారణకు అధికారులు అప్పుడే వచ్చారు. ఆ తర్వాత వర్షాల వల్ల చెరువు నీటితో నిండిపోవడం, ఐలాండ్ వద్దకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కాలక్రమంలో అక్కడ ధ్యాన మందిరం నిర్మాణం ప్రతిపాదన మరుగున పడింది. ఐల్యాండ్‌లో ధాన్యం మందిరం, అక్కడి నుంచి కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే భద్రకాళి చెరువు మరో లక్నవరం పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

కేబుల్ బ్రిడ్జి

ఐలాండ్ నుంచి భద్రకాళి గుడి మాడవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జిని నిర్మించే ప్రతిపాదన కూడా తాజాగా పరిశీలనకు వచ్చినట్టు సమాచారం. ఐలాండ్‌లో ధాన్యమందిరంతో పాటు అక్కడ అందమైన పార్క్‌ను, మ్యూజియం, కేఫెటేరియాను, వీలైతే ఒక కాటేజీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. అయితే అక్కడ అందుబాటులో ఉండే స్థలాన్ని బట్టి వీటి ఏర్పాటు ఉంటుంది. ప్రస్తుతం భద్రకాళి గుడి చుట్టూరా మాఢవీదులను నిర్మిస్తున్నారు. మాడవీదిలో కొంతభాగం చెరువు మీది నుంచి నిర్మాణమవుతుంది. ఈ మాఢవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం మాడవీధిలో నడుస్తూ చెరువు అందాలను వీక్షించేందుకు వీలు ఏర్పడుతుంది. కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తే ఈ సందర్శ కులు ధ్యాన మందిరానికి చేరుకొని అక్కడ కొద్దిసేపు విశ్రాంతిగా గడిపే అవకాశం ఉం టుంది. ఈ ధ్యాన మందిరం నిర్మిస్తే అది అటు ఆధ్యాత్మిక కేంద్రంగానూ ఇటు పర్యాటక ప్రాంతంగానూ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. భద్రకాళి చెరువు నుంచి తీసే పూడిక మట్టిలో కొంత భాగాన్ని ఈ ఐల్యాండ్ పటిష్ఠం చేయనున్నారు. చెరువు మట్టిని అక్కడే పోసి దానిని మరింత విస్తరించనున్నారు.

జనవరి రెండో వారంలో పూడికతీత

భద్రకాళి చెరువు పూడికతీత పనులను జనవరి రెండు లేదా మూడో వారం నుంచి మొదలు పెట్టనున్నారు. 350 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఈ పురాతన చెరువులో వందేళ్లల్లో ఎప్పుడూ పూడిక తీయలేదు.

నాలుగు దశాబ్దాల కిందట భద్రకాళి చెరువును తాగునీటి జలాశయంగా మార్చేక్రమంలో కొంత మేరకు మట్టితీసి శుభ్రం చేసే ప్రయత్నం జరిగింది కానీ పూర్తి స్థాయిలో పూడిక తీయలేదు. భద్రకాళిని వేసవి రిజర్వాయర్‌గా మార్చక ముందు వేసవిలో కొంత మేరకు ఎండిపోయేది. చెరువులోకి మురుగునీరు చేరకుండా బండ్ నిర్మించిన తర్వాత అటు ధర్మసాగర్ నీరు ఇటు వర్షపు నీరు నిండుగా చేరి ఎప్పుడూ కళకళలాడుతూ కనిపించేది. ఈ క్రమంలో చెరువులో పూడిక తీయడం కష్టంగా మారనున్నట్టు కనిపిస్తోంది.

ఓరుగల్లు పత్తికి మహర్దశ

వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రం మంజూరు | ఆమోదం తెలిపిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు పత్తికి మహర్దశ పట్టనుంది. దేశంలోనే నాణ్యమైన పత్తిని అందించే వరంగల్ రైతులకు రానున్న రోజుల్లో మరింత నాణ్యమైన పత్తి ఉత్పత్తి చేసేలా కేంద్రం దృష్టిసారించింది. ఈ మేరకు వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రానికి భారత పత్తి పరిశోధన సమన్వయ కేంద్రం (ఏఐసీఆర్‌పీ), భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపాయి. దీంతో ఇక నుంచి ఓరుగల్లు కేంద్రంగా జాతీయ స్థాయిలో పత్తిపై పరిశోధనలు చేయనున్నారు. అంతేకాకుండా కొత్త వంగడాల సాగుతో పాటు చీడపీడల నివారణలపై విస్తృతంగా పరిశోధనలు చేసే అవకాశం లభిస్తుంది. ప్రధానంగా పత్తి పంట చేతికి వచ్చే సమయంలో వేరుతెగుళ్ల, గులాబీ పురుగు ఉధృతితో రైతులు దిగుబడి కోల్పోతున్నారు. ఇలాంటి సమయంలో పరిశోధన కేంద్రంలో వీటిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓరుగల్లు రైతులకు సలహాలు ఇచ్చే అవకాశం ఉంది.

వరంగల్‌కు పరిశోధన కేంద్రం మంజూరు

పత్తి పంట సాగుకు కేరాఫ్‌గా ఉన్న వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పదేళ్లుగా డిమాండ్ ఉంది. గత 2020లో వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం కోసం గత ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే ఆ ప్రతిపాదనలు ఢిల్లీకి చేరకముందే బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పత్తి పరిశోధన కేంద్రంపై దృష్టిసారించింది. గత నెలలో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఆర్‌ఏ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీపీ.శర్మలను కలిసి వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు అవశ్యకతపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య వివరించారు. దీంతో అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా ఆచార్య జయశంర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా, పత్తి పరిశోధన కేంద్రం వరంగల్‌కు మంజూరు కావటంతో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) నుంచి శాస్త్రవేత్తలతో పాటు ఉద్యోగులను నియమించనున్నారు. వీరికి వేతనాలతో పాటు ఇతర సౌకర్యాలను ఐకార్ కల్పించనుంది. అలాగే వరంగల్‌లో పరిశోధనలు చేసేం దుకు కేంద్రం నుంచి నిధులు విడుదల చేయనున్నారు. జాతీయ స్థాయిలో సాంకేతికతను పంచుకుంటూ వరంగల్‌లో మరింత నాణ్యమైన పత్తి ఉత్పత్తికి పరిశోధనలు మేలు చేయనున్నాయి. అంతేకాకుండా పత్తి ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్‌కు పరిశోధన కేంద్రం ఉపయోగపడనుంది.

పత్తి రైతుకు వరంగా పరిశోధనలు

అఖిల భారత పత్తి పరిశోధన పథకం(ఏఐసీఆర్) కింద వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రాన్ని మంజూరు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పరిశోధన కేంద్రం అమల్లోకి రానుంది. దీంతో జాతీయస్థాయిలో పత్తి సాగుపై వరంగల్ కేంద్రంగా పరిశోధనలు చేయనున్నారు. అధిక దిగుబడులను ఇచ్చే సాగు, సమతుల్య ఎరువులు, చీడలు, తెగుళ్ల నివారణ చర్యలు, పరిశోధన కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన మెరుగైన రకాల పెంపకం, అధిక నాణ్యత, స్థిరమైన ఉత్పత్తి లక్ష్యంగా ఈ కేంద్రంలో పరిశోధనలు జరగనున్నాయి. 2021నుంచి రైతులు బీజీ-2 పత్తి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అయితే దేశవ్యాప్తంగా 300రకాలకు పైగా బీజీ-2 విత్తనాలు ఉన్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం 20 నుంచి 30రకాల బీజీ-2 విత్తనాలనే సాగు చేస్తున్నారు. వీటిపై కూడా ఓరుగల్లులో పరిశోధనలు చేసి, ఈ రకం విత్తనాలు ఇక్కడి భూములకు అనుకూలమో.. కాదో వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించను న్నారు. ఇప్పటికే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పత్తి పంటతో పాటు మిర్చి, వరి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలపై పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా పత్తి పరిశోధన కేంద్రం రావటంతో ఐకార్‌తో కలిసి జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పని చేయనున్నారు. దీంతో వరంగ ల్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లా పత్తి రైతుల సమస్యలపై పరిశోధనలు జరగనున్నాయి. ప్రధానంగా వరంగల్ రైతులు వేగు తెగుళ్లతో పాటు గులాబీ పురుగు ఉధృతితో తీవ్రంగా నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ఈ వైరస్ సోకటంతో దిగుబడి తగ్గుతుంది. దీనిపై పరిశో ధనలు చేసి, రిపోర్టు వచ్చే సరికే పంటకు జరుగాల్సిన నష్టం జరిగిపోతుంది. వరంగల్‌లోనే పరిశోధన కేంద్రం ఉండటంతో స్థానికం గానే టెక్నాలజీతో వరంగల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశోధ నలు చేసి, నివారణ చర్యలు సూచించే అవకాశం ఏర్పడుతుంది. దీంతో వరంగల్ రైతులకు పరిశోధన కేంద్రం వరంగా మారనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పత్తికి కేరాఫ్ ఓరుగల్లు

తెలంగాణలోనే అత్యధికంగా పత్తి సాగయ్యే జిల్లాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా మొదటి స్థానంలో ఉంటుంది. గతంలో వరంగల్‌లో పత్తి ఆధారిత పరిశ్రమలు పుష్కలంగా ఉండేవి. దీంతో చాలా ఏళ్ల నుంచి పత్తి సాగుకే రైతులు మొగ్గుచూపుతూ వస్తున్నారు. 2024-25 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఈ సీజన్‌లో అకాలవర్షాలతో పాటు గులాబీ పురుగు ఉధృతి, వేరుతెగుళ్ల వ్యాధులతో పత్తి దిగుబడి భారీగా తగ్గింది.

దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ సీజన్‌లో 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేశంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వరంగల్ పత్తికి నాణ్యత ఎక్కువ. వరంగల్ పత్తి పింజ పొడువు 29 మి.మీల నుంచి 30.5మి.మీలకు పైగానే ఉంటుంది. అయితే గుజరాత్, పంజాబ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో గరిష్ఠంగా పత్తి పింజ పొడువు 29మి.మీల వరకే ఉంటుంది. నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్నప్పటికీ దిగుబడి మాత్రం ఇతర ప్రాంతాలతో పోల్చితే ఓరుగల్లు రైతులకు తక్కువే వస్తోంది. దీనికి ప్రధాన కారణం తెగుళ్లే. గులాబీ పురుగు దాడికి పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేసినప్పటికీ ఓరుగల్లు నష్టాలను ఎదుర్కొంటున్నారు.

వ్యవసాయ పరిశోధన స్థానంలోనే..



వరంగల్‌లో ఇప్పటికే వ్యవసాయ పరిశోధన కేంద్రం ములుగురోడ్డులో ఉంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతుంది. ఈపరిశోధన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలపై పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఐకార్ ఆమోదం పొందిన పత్తిపరిశోధన కేంద్రాన్ని కూడా ఇక్కడి నుంచే కొనసాగించే అవకాశం ఉంది. ఈ పరిశోధన కేంద్రంలో ప్లాంట్ బ్రీడింగ్, ఎంటమాలజీ, అగ్రనామి తదితర డిపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. దీనిలో ముగ్గురు ప్రధాన శాస్త్రవేత్తలు, ఆరుగురు శాస్త్రవేత్తలు, ఇద్దరు ఏఈవోలు, ఇతర ఫీల్డ్ స్టాఫ్‌ను మంజూరు చేయనున్నారు. మొత్తానికి ఎన్నో ఏళ్లుగా ఓరుగల్లు రైతులు ఎదురుచూస్తున్న పత్తి పరిశోధన కేంద్రం వరంగల్‌కు మంజూరు కావటం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

పరిశోధనలతో రైతులకు ఎంతో మేలు

వీరన్న, కాటన్ ప్రధాన శాస్త్రవేత్త, వరంగల్



వరంగల్‌కు మంజూరైన పత్తి పరిశోధన కేంద్రంతో రైతులకు ఎంతో మేలు. జాతీయ స్థాయిలో పత్తిసాగుపై జరిగే పరిశోధనల ఫలితాలు మనకు కూడా ఉపయోగపడుతాయి. వ్యవసాయరంగలో ఉన్న టెక్నాలెజీని ఉప యోగించుకుని దేశవ్యాప్తగా పత్తి సాగు చేస్తున్న రాష్ట్రాలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. స్థానికంగా వచ్చే తెగుళ్లపై ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి, సమస్య పరిష్కారానికి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.

భారత్‌పై కుట్ర



(మొదటి పేజీ తరువాయి)

భావిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేసింది. అదానీ గ్రూపుపై ఎఫ్‌బీఐ చేసిన లంచాల ఆరోపణలను బీజేపీ నిరాధారమైనవని కొట్టిపారేసింది. అదేవిధంగా ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్ ద్వారా భారత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిని.. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు దుయ్యబడుతున్నారన్న ఓసీసీఆర్‌పీ కథనాలను కూడా ఖండించింది. కాగా, ఈ రెండు అంశాలను భారత ప్రభుత్వం గతంలోనే ఖండించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఓసీసీఆర్‌పీ సహా 92 ఏళ్ల జార్జ్ సోరోస్‌లు మోదీ ప్రభుత్వంపై చేసిన విమర్శలను బీజేపీ కూడా దుయ్యబట్టింది. తాజాగా ఓసీసీఆర్‌పీ, సోరోస్‌లపై స్పందిస్తూ.. వీరికి అమెరికానే నేరుగా 50 శాతం నిధులు సమకూరుస్తోందని, ఈ విషయాన్ని ఫ్రెంచ్ మీడియా పేర్కొందని బీజేపీ తెలిపింది. 'ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని భారత్‌ను అస్థిరపరిచేందుకు 'డీప్ స్టేట్' లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. "ఈ మొత్తం వ్యవహారం వెనుక.. అమెరికా విదేశాంగ శాఖ అజెండా స్పష్టంగా కనిపిస్తోంది" అని బీజేపీ ఎక్స్‌లో పేర్కొంది.

మమ్మల్ని నిరాశపర్చింది: అమెరికా

బీజేపీ వ్యాఖ్యలపై అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. వృత్తిపరమైన అభివృద్ధి కోసం జర్నలిస్టులకు అమెరికా ప్రభుత్వం మద్దతిస్తుందని పేర్కొన్నారు. దీనర్థం.. ఆయా పత్రికల ఎడిటోరియల్ నిర్ణయాలను ప్రభావితం చేయడం కాదని తెలిపారు "భారత అధికార పార్టీ(బీజేపీ) ఇలాంటి ఆరోపణలు చేయడం మమ్మల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది" అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛకు పెద్దపీట వేస్తున్న దేశం తమదేనని తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

పొట్టలో తూటా దిగినా..రక్తం ధారగా కారుతున్నా..

15 మందిని కాపాడిన జీపు డ్రైవర్

పట్నా, డిసెంబరు 7: ఆ డ్రైవర్ ప్రదర్శించిన గొప్ప సాహసం, ధైర్యం.. అంతకుమించి 15 మంది ప్రాణాలను ఎలాగైనా కాపాడాలనే తపనతో చూపిన పరిణతిని ఎంత పొగిడినా తక్కువే! తన జీప్‌ను బైక్‌పై వెంబడించిన ఇద్దరు దుండగులు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఓ తూటా డ్రైవర్ పొట్టలోకి దూసుకెళ్లింది. రక్తం ధారగా కారుతున్నా.. దుండగుల నంచి ప్రయాణికులను కాపాడటానికి వాహనం స్పీడును ఆ డ్రైవర్ మరింత పెంచాడు! ప్రయాణికులను సురక్షితమైన స్థానానికి చేర్చాడు. బిహార్‌లోని భోజ్‌పూర్‌లో జిల్లాలో బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన జరిగింది. 'తిలకం' వేడుక ముగిశాక అందులో పాల్గొన్న 15మందిని గమ్యస్థానానికి చేర్చేందుకు తన జీప్‌లో ఎక్కించుకొని బయలుదేరాడు డ్రైవర్ సంతోష్ సింగ్. కొద్ది సేపటికి ఆ జీప్‌ను ఇద్దరు సాయుధులు బైక్‌పై వెంబడిస్తూ కాల్పులు జరిపారు. కాగా, ప్రయాణికుల్లో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి, తీవ్ర గాయాలతో డ్రైవింగ్ సీట్లోనే ఒరిగిపోయిన సంతోష్ సింగ్‌ను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులు బాధితుడి కడుపులోంచి తూటాను బయటకు తీశారు. అతడికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



సిరియాకు వెళ్లొద్దని కేంద్ర సూచన

న్యూఢిల్లీ : సిరియాలో ఇస్లామిక్ రెబెల్స్ దాడులు కొనసాగుతున్నందున ఆ దేశానికి వెళ్లొద్దని విదేశీ వ్యవహారాల శాఖ ప్రజలకు సూచన జారీ చేసింది. అలాగే ఆ దేశంలో ఉంటున్న భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సాధ్యమైనంత త్వరగా ఆ దేశం నుంచి బయటపడాలని సలహా ఇచ్చింది. డమాస్కస్‌లోని భారత ఎంబసీతో సంప్రదింపులు జరపాలని సూచించింది. సిరియాలోని అలెప్పో నగరాన్ని చాలావరకు స్వాధీనం చేసుకున్న రెబెల్స్ గురువారం సిరియా మధ్యలో ఉన్న హోమ్స్ నగరాన్ని కూడా చేజిక్కించుకున్నారు.

ఎమర్జెన్సీలో ఫోన్ ట్యాపింగ్!

» ఐజీ లేదా ఆపై స్థాయి అధికారి మాత్రమే అధికారం: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 7: అత్యవసర పరిస్థితుల్లో ఐజీ లేదా ఆ పైస్థాయి పోలీసు అధికారి ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేయవచ్చని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఫోన్ ట్యాపింగ్ తాజా నిబంధనలను జారీ చేస్తూ కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ శుక్రవారం ఓ నోటిఫికేషన్‌ను వెలువరించింది. ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేసిన అధికారి ఏడు పని దినాల్లో సదరు ఆదేశాలు నిజమైనవేనని నిర్ధారించకపోతే.. ట్యాపింగ్ ద్వారా సేకరించిన వివరాలను దేనికీ ఉపయోగించవద్దని ఈ నిబంధనల్లో పేర్కొన్నారు. రెండు పనిదినాల్లో ఆ వివరాల తాలూకు పత్రాలను ధ్వంసం చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా మారుమూల ప్రాంతంలో ఫోన్ ట్యాపింగ్ కోసం ఆదేశాలు జారీ చేయటానికి సంబంధిత అధికారికి సాధ్యం కాకపోతే, ఆ అధికారి తర్వాత స్థానంలో ఉన్న అధికారి (ఐజీ ర్యాంకుకు తగ్గని వారు) ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపారు. సదరు అధికారి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవారై ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ట్యాపింగ్ ఆదేశాలను కేంద్రస్థాయిలోనైతే క్యాబినెట్ కార్యదర్శి, న్యాయ శాఖ, టెలికాం శాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాల్సి ఉంటుందని.. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ కార్యదర్శి, న్యాయ, హోంశాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాలని కేంద్రం స్పష్టం చేసింది.

ప్రధాని మోదీని చంపేస్తామని బెదిరింపులు

ముంబై, డిసెంబరు 7: ప్రధాని మోదీని హత్య చేస్తానంటూ గుర్తుతెలియని దుండగుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. బాంబు పేలుడు ద్వారా మోదీని చంపేందుకు ఇద్దరు ఐఎస్‌ఐ ఏజెంట్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాడు. ఈ మేరకు శనివారం ముంబై ట్రాఫిక్ పోలీసులకు బెదిరింపు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వాట్సాప్ నంబరు ఆధారంగా రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి బెదిరింపులు వచ్చినట్లు గుర్తించామని, ఓ ప్రత్యేక బృందాన్ని అక్కడి పంపామని తెలిపారు. అయితే నిందితుడి మానసిక పరిస్థితి నిలకడగా లేకపోవడమో లేదా మద్యం తాగిన మత్తులో ఈ పని చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.50లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామంటూ కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్‌ను అజ్ఞాత వ్యక్తి ఫోన్‌లో బెదిరింపు సందేశం పంపించాడు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ నేత ప్రేమ్‌శంకర్‌కు, ఆయన తండ్రి గోపీనాథ్‌కు ఇలాగే రూ.50 లక్షలు డిమాండ్ చేస్తూ బెదిరింపు సందేశం పంపిన కేసులో రాజ్‌కుమార్ సింగ్ అనే వ్యక్తిపై గతనెలలో యూపీ పోలీసులు కేసు నమోదు చేశారు.

శబరిమలలో వర్షం హెచ్చరికలు

శబరిమల, డిసెంబరు 7: శబరిమలలో మరోమారు భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం నుంచి మూడ్రోజులపాటు ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ.. 11వ తేదీ నుంచి శబరిమల ఉన్న పథనంతిట్ట జిల్లాతోపాటు.. ఇడుక్కి జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. కాగా.. మండలపూజ సీజన్(అక్టోబరు 16 నుంచి) గురువారం వరకు అరవణ పాయస విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అరవణ ప్రసాద విక్రయాలతో రూ.60.54 కోట్ల మేర ఆదాయం సమకూరిందని, గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.18.34 కోట్ల మేర అధికంగా ఉందని వివరించింది.

న్యాయాన్ని అవహేళన చేసిన రామజన్మభూమి తీర్పు

» అయినా అందులోని 5 పేజీలు కీలకం

» సుప్రీం మాజీ జడ్జి నారిమన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 7: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 'న్యాయానికి జరిగిన పెద్ద అవహేళన' లాంటిదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్ అభిప్రాయపడ్డారు. అది లౌకికవాదం అన్న సూత్రాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. అయితే ఈ తీర్పులోనూ కాంతిరేఖలాంటి ఓ మంచి అంశం ఉందని, అది ప్రార్థనా స్థలాల చట్టం-1991ని ఆమోదించడమని స్పష్టం చేశారు. జస్టిస్ ఎ.ఎం.అహ్మది స్మారక ప్రథమ ఉపన్యాసంలో 'లౌకికవాదం-భారత రాజ్యాంగం' అన్న అంశంపై ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వేయి తలల జలసర్పం (హైడ్రా) మాదిరిగా దేశమంతటా తలలు ఎగరవేస్తున్న ప్రార్థనా మందిరాల వివాదాలకు ముగింపు పలకాలంటే ప్రార్థనా స్థలాల చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేయడమే మార్గమని చెప్పారు. "మసీదులపై, దర్గాలపై ఒక కేసు తరువాత మరో కేసు నమోదవుతునే ఉంది. ఇది మత విద్వేషాలకు దారి తీస్తుంది. దీన్ని అడ్డుకోవాలంటే రామజన్మభూమి-బాబ్రీ మసీదు తీర్పులోని అయిదు పేజీలే కీలకం. అది ప్రార్థనా మందిరాల ప్రత్యేక నిబంధనల చట్టాన్ని ఆమోదించింది. దాన్ని ప్రతి జిల్లా కోర్టులోను, హైకోర్టులోనూ చదివి వినిపించాలి. ఎందుకంటే అవి సుప్రీంకోర్టు ఆదేశాలు. అందరూ కట్టుబడి ఉండాలి" అని పేర్కొన్నారు. మరోవైపు, ప్రార్థనా స్థలాల చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ఆరు ప్రయోజన వ్యాజ్యాలపై ఈ నెల 12న సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ జరపనుంది. 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న ప్రార్థనా మందిరాల స్వరూపాన్ని మార్చకూడదని ఈ చట్టం చెబుతోంది.

డిసెంబరు 21

ప్రపంచ ధ్యాన దినోత్సవం

తీర్మానానికి ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవ ఆమోదం



ఐక్యరాజ్యసమితి, డిసెంబరు 7: ప్రతి ఏటా డిసెంబరు 21వ తేదీని 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా జరపాలని భారత్ సహా పలు దేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యూఎన్‌జీఏ) ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ విషయాన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "సమగ్ర శ్రేయస్సు, అంతర్గత పరివర్తన కోసం ఒక రోజు! డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరపాలని భారత్ సహా పలు ఇతర దేశాలు తీసుకొచ్చిన తీర్మానాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ ఈ రోజు(శుక్రవారం) ఆమోదించింది" అని పేర్కొన్నారు. వసుధైక కుటుంబం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే సూత్రాన్ని బలంగా విశ్వసించే భారత్.. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం కృషి చేస్తోందని అన్నారు. డిసెంబరు 21వ తేదీకి ఒక ప్రత్యేకత ఉందని, భారత సంప్రదాయం ప్రకారం శీతాకాలం అయనం అంటే ఉత్తరాయనంలోకి అడుగుపెట్టే రోజని, ఇది చాలా పవిత్రమైన రోజని తెలిపారు. ఇది సరిగ్గా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించే జూన్ 21వ తేదీ (వేసవి అయనం)కి ఆరు నెలల తర్వాత వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా యోగాపై గతంలో భారత్ చేసిన ప్రతిపాదనను హరీశ్ గుర్తుచేసుకున్నారు. 2014లోనూ ప్రతి ఏటా జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించే విషయంలో భారత్ నాయకత్వం తీసుకుందని పేర్కొన్నారు. ఈ దశాబ్ద కాలంలో యోగా విశ్వవ్యాప్తం అయిందని, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది యోగాను పాటిస్తూ, తమ జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారని అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవంపై లిచ్‌టెన్‌స్టీన్ అనే దేశం యూఎన్‌జీఏలో తీర్మానం తీసుకొచ్చింది. 193 దేశాలు గల యూఎన్‌జీఏలో ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందేందుకు కృషి చేసిన దేశాల గ్రూపులో భారత్ సహా శ్రీలంక, నేపాల్, మెక్సికో, అండోర్రా ఉన్నాయి. తీర్మానానికి ఇంకా బంగ్లాదేశ్, బల్గేరియా, బురుండి, ది డొమినికన్ రిపబ్లిక్, ఐస్‌లాండ్, లక్సెంబర్గ్, మారిషస్, మొనాకో, మంగోలియా, పోర్చుగల్, స్లొవేనియా కో-స్పాన్సర్ చేశాయి. కాగా, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంపై ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. తీర్మానాన్ని ఆమోదింపచేయడంలో భారతదేశం కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. ప్రపంచంలోని పలు ప్రాంతాలు ఘర్షణలు, ఉద్రిక్తతలతో మండుతున్న వేళ ఈ నిర్ణయం రావడంపై ఆనందం వ్యక్తం చేసింది. ధ్యానం అనేది పురాతన పద్ధతుల నుంచే ఉందని, ఇది అంతర్గత పరివర్తన, నేటి ఆధునిక కాలంలో శాంతి స్థాపనకు సమర్థవంతంగా పనిచేస్తుందని అభిప్రాయపడింది. ధ్యానం మానసిక, భావోద్వేగ, శారీరక, ఆధ్యాత్మిక అంశాలతో సహా ప్రపంచ మానవాళి శ్రేయస్సుకు ఉద్దేశించిందని పేర్కొంది. ఇది నేటి ఉరుకుల పరుగుల, ఒత్తిడితో కూడిన జీవితంలో ఉపశమనం కలిగిస్తుందని తెలిపింది. దీనితో చాలా లాభాలు ఉన్నాయని, మన జీవితాలపై ప్రభావం చూపుతుందనే దాన్ని ఆధునిక శాస్త్రం కూడా ధ్రువీకరిస్తోందని పేర్కొంది. ప్రతి రోజూ ధ్యానం చేస్తే ఒత్తిడి తగ్గుతుందని, మానసిక, శారీరక సంబంధిత కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైందని భారత మిషన్ పేర్కొంది.

బంగ్లాలో మరో ఇస్కాన్ ఆలయం ధ్వంసం

» దేవతామూర్తుల విగ్రహాలకు నిప్పుపెట్టిన దుండగులు

ఢాకా/లఖ్‌నవూ, డిసెంబరు 7: బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇస్కాన్‌కు చెందిన మరో ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేసి, నిప్పుపెట్టారు. ఈ ఘటనలో మందిరంలోని దేవతామూర్తుల విగ్రహాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ మేరకు కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఢాకా జిల్లా ధౌర్ గ్రామంలో హరేకృష్ణ నామ్‌హట్టా సంఘానికి చెందిన రాధాకృష్ణ ఆలయం, మహాభాగ్య లక్ష్మీనారాయణ ఆలయాలకు తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య దుండగులు నిప్పు పెట్టారని పేర్కొన్నారు. భైరబ్ ప్రాంతంలోని ఇస్కాన్ ఆలయాన్ని ధ్వంసం చేసిన వారం రోజుల తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువుల దుస్థితిపై కాంగ్రెస్ పార్టీ మౌనంగా ఉందని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆరోపించారు. బాధితుల్లో ఎక్కువమంది దళితులు, బలహీన వర్గాలకు చెందినవారేనని తెలిపారు. శనివారం లఖ్‌నవూలో ఆమె విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో కాంగ్రెస్ చేసిన తప్పిదం కారణంగా పొరుగు దేశంలో దళితులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని భారత్‌కు రప్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దాడుల అంశాన్ని ప్రధాన ప్రతిపక్షం పార్లమెంట్‌లో లేవనెత్తకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. సంభాల్ హింస సాకుతో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, వాటి మిత్రపక్షాలు ముస్లిం ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

బీజేపీ చీఫ్‌గా ఖట్టర్ లేదా చౌహాన్!

» రేసులో రాంమాధవ్ కూడా..

» తెలుగు రాష్ట్రాల్లోనూ నాయకత్వ మార్పులు!

న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం సంస్థాగత మార్పులకు రంగం సిద్ధం చేసిందా? జేపీ నడ్డా స్థానంలో.. బీజేపీ చీఫ్‌గా మనోహర్‌ఖట్టర్ లేదా శివరాజ్ చౌహాన్ అధ్యక్ష పదవిని అధిరోహించనున్నారా? రేసులో రాంమాధవ్ కూడా ఉన్నారా? ఈ ప్రశ్నలకు పార్టీ వర్గాలు అవుననే చెబుతున్నాయి. వచ్చే నెలాఖరులోగా పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక, ఆఫీస్ బేరర్ల పునర్వ్యవస్థీకరణ పూర్తవనున్నట్లు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు.. వచ్చేనెల మొదటి వారానికి రాష్ట్రాల వారీగా అధ్యక్షుల నియామకాలు పూర్తవుతాయని వివరిస్తున్నాయి. వచ్చే నెలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఖట్టర్ లేదా శివరాజ్‌ను నియమించే అవకాశాలున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాంమాధవ్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. ఒకవేళ ఆయనకు చాన్స్ రాకుంటే.. బీఎల్ సంతోష్ స్థానంలో ఆయనను సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా అవకాశాలున్నట్లు చెబుతున్నారు. బీఎల్ సంతోష్ 2019 నుంచి ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఇక రాష్ట్రాల్లో నాయకత్వ మార్పుల్లో భాగంగా తెలుగు రాష్ట్రాలతోపాటు.. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళల్లో అధ్యక్షులు మారే అవకాశాలున్నాయి.

కూటమి సారథ్యానికి సిద్ధమే..

'ఇండియా'ను బెంగాల్ నుంచే నడిపిస్తా.. ప్రతిపక్ష కూటమిని పెట్టింది నేనే: మమత

కోల్‌కతా, డిసెంబరు 7: అవకాశం ఇస్తే ఇండియా కూటమికి నేతృత్వం వహించడానికి తాను సిద్ధమేనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమత అన్నారు. హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి వరుస పరాజయాల నేపథ్యంలో మమత వ్యాఖ్య ఆ కూటమిలో అలజడి రేపుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన ఓ న్యూస్ చానల్‌కు శనివారం మమత ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇండియా కూటమి పనితీరు పట్ల ఆమె పెదవి విరిచారు. అటు ముఖ్యమంత్రి పదవినీ, ఇటు 'ఇండియా' పగ్గాలనూ సమన్వయం చేయగలనని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. "ఇండియా' కూటమిని నేనే ఏర్పాటుచేశాను. ఆ కూటమి బాగోగులు ఇప్పుడు దానిని నడిపిస్తున్నవారిని బట్టే ఉంటాయి" అంటూ కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా చురకలు వేశారు. 'కూటమి పగ్గాలను మీరు చేపడతారా' అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అవకాశం వస్తే తప్పకుండా ఆ బాధ్యతను తీసుకుంటానని ఆమె తెలిపారు. బెంగాల్ నుంచే కూటమిని నడిపిస్తానన్నారు. ఇండియా కూటమి, కాంగ్రెస్ తమ అహం పక్కనబెట్టి మమతాబెనర్జీ నాయకత్వాన్ని అంగీకరించాలని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శుక్రవారం వ్యాఖ్యానించారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో మెరుగ్గా కనిపించిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తర్వాత నుంచి మాత్రం తన రాజకీయ పట్టును కోల్పోతూ వస్తోంది. మరోవైపు.. బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీని తృణమూల్ మట్టి కరిపించింది. దీంతో 'ఇండియా'కు కాంగ్రెస్ సారథ్యంపై కూటమిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇండియా కూటమి సారథ్యం విషయంలో మమత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్టు సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ ప్రకటించారు. మమత 'ఇండియా' కూటమిలో ప్రధాన నాయకురాలిగా ఉండాలని కోరుకుంటున్నామని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) అగ్రనేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కోల్‌కతా వెళ్లి దీనిపై ఆమెతో చర్చిస్తామని ఆయన తెలిపారు. కాగా, మమత ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. జాతీయ నేతగా మమత సమర్థతను ప్రశ్నించింది. ఇదిలాఉండగా, అదానీ అవినీతిపై కాంగ్రెస్ నిర్వహించిన నిరసన ప్రదర్శనకు తృణమూల్, ఎస్పీ దూరంగా ఉన్నాయి.

మహా వికాస్ అఘాడీకి ఎస్పీ గుడ్‌బై!

ముంబై, డిసెంబరు 7: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటమిపాలైన షాక్ నుంచి ఇంకా తేరుకోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమికి ఊహించని పరిణామం ఎదురైంది. ఈ విపక్ష కూటమి నుంచి తమ పార్టీ తప్పుకోవాలని నిర్ణయించినట్టు శనివారం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మహారాష్ట్ర చీఫ్, ఎమ్మెల్యే అబు అజ్మీ ప్రకటించారు. మహారాష్ట్రలో ఇటీవలి ఓటమి అనంతరం ఎంవీఏ కూటమిలోని శివసేన(యూబీటీ) హిందూ అజెండాను ఎత్తుకున్నట్టు ఆయన ఆరోపించారు. శివసేన(యూబీటీ) ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ బాబ్రీ మసీదు కూల్చివేతను ఇటీవల ప్రశంసించారు. ఇదే ఎస్పీ ఆగ్రహానికి దారితీసినట్టు తెలుస్తోంది.

ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా గంగాధర్

తెలంగాణ తల్లి విగ్రహ రూపకర్తను కీలక పదవిలో నియమించిన సర్కారు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ టి.గంగాధర్‌ను ప్రభుత్వం నియమించింది. తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేసింది ఈయనే. ఈ నెల 9న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహావిష్కరణకు రెండు రోజుల ముందు గంగాధర్‌ను కీలక పదవితో ప్రభుత్వం సత్కరించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.శ్రీధర్ శనివారం జీవో జారీ చేశారు. ప్రస్తుతం వర్సిటీలోని ఫైన్స్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా గంగాధర్ పని చేస్తున్నారు. మరోవైపు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చక్రపాణి గతంలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, వివిధ పరిపాలనా పదవుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొదటి చైర్మన్‌గా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. గతంలో తనకు కేసీఆర్ అవకాశం ఇచ్చారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పిలిచి అవకాశం ఇచ్చినట్టు చెప్పారు. వాస్తవానికి ఒక ప్రభుత్వానికి దగ్గర ఉన్న వ్యక్తి వేరే ప్రభుత్వానికి దూరంగా ఉంటారని, తాను తెలంగాణకు దగ్గరి వ్యక్తిని అయినందుకే ఇప్పుడు ఉపకులపతిగా అవకాశం వచ్చిందన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. యూనివర్సిటీతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను ఇక్కడ 30 ఏళ్లు పని చేశానని చెప్పారు. మరోవైపు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఎల్.విజయక్రిష్ణారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ విద్యార్థి సేవల ఇన్‌చార్జి డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. పరీక్షల అదనపు కంట్రోలర్‌గా దయాకర్ నియమితులయ్యారు.

ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన బాలకిష్టారెడ్డి

జేఎన్‌టీయూ నూతన ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమై ఆయా విభాగాల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ వీసీ కట్టా నర్సింహారెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన కొన్ని డైరెక్టరేట్లకు పెట్టిన పేర్లు బాగా లేవని, మూడు విభాగాల పేర్లను మార్చాలని నిర్ణయించారు. న్యాయశాస్త్రానికి సంబంధించిన కోర్సులకు ప్రాధాన్యత పెరుగుతున్నందున కొన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ వచ్చేవరకు ఇన్‌చార్జ్ వీసీ (మరో రెండు నెలలపాటు)గా యూనివర్సిటీ అభివృద్ధికి తన సహకారాన్ని అందిస్తానని బాలకిష్టారెడ్డి స్పష్టంచేశారు. జేఎన్‌టీయూను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, వర్సిటీ డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

'పుష్ప-2' తొక్కిసలాట ఘటన

ఇంకా స్పృహలోకి రాని శ్రీతేజ్

చిక్కడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా చూసేందుకు వచ్చి తొక్కిసలాటలో గాయపడ్డ బాలుడు శ్రీతేజ ఇంకా స్పృహలోకి రాలేదని కిమ్స్ వైద్యులు వెల్లడించారు. ఐసీయూలోనే చికిత్స అందిస్తున్నామని, శుక్రవారంలో పోల్చితే కొద్దిగా ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ లేకుండానే శ్వాస తీసుకునే స్థితికి వచ్చాడన్నారు. జ్వరం తగ్గిందని, రక్తప్రసరణ మెరుగుపడిందని చెప్పారు. ఇదిలా ఉండగా.. తొక్కిసలాట ఘటనపై ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ జరుగుతోందన్నారు. కాగా, ఘటనలో శ్రీతేజ్ తల్లి రేవతి(35) మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె మృతిపట్ల నటుడు అల్లు అర్జున్ శుక్రవారం సంతాపాన్ని తెలిపారు. రూ. 25లక్షలు ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీతేజ్ వైద్యఖర్చులు సైతం భరించనున్నట్లు ప్రకటించారు.

సాదలేక ముగ్గురు కొడుకులను అమ్మిన తల్లి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో తన ముగ్గురు కొడుకులను సాదలేక విక్రయించింది ఓ కన్నతల్లి. ఇందుకు సుమారు 4 లక్షల వరకు తీసుకుంది. అయితే నగదు అయిపోవడంతో మళ్లీ డబ్బులు డిమాండ్ చేసి కటకటాల పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన సంగెం భాగ్యలక్ష్మికి ముగ్గురు కుమారులు. ఐదేళ్ల క్రితం భర్తతో విడిపోయి అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. గత కొంతకాలంగా భాగ్యలక్ష్మికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో 10 నెలల క్రితం తన ముగ్గురు కొడుకులను వేర్వేరు ప్రాంతాల్లోని వ్యక్తులకు విక్రయించింది. సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు ఏడేళ్ల కుమారుడిని రూ.లక్షకు, జగిత్యాలకు చెందిన వనజకు ఐదేళ్ల కొడుకుని రూ.2 లక్షలకు, భీమ్‌గల్ మండలం బెజ్జోర గ్రామానికి చెందిన నర్సయ్యకు రూ.లక్ష 20వేలకు మూడో కుమారుడిని విక్రయించింది. అయితే ఆ డబ్బులు అయిపోవడంతో సంతానాన్ని విక్రయించిన వారికి ఫోన్ చేస్తూ మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై పిల్లలను తీసుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు శనివారం భాగ్యలక్ష్మి, అలాగే పిల్లలను కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా దిల్ రాజు



ప్రముఖ నిర్మాత 'దిల్ రాజు'(వెంకట రమణారెడ్డి)కి ప్రభుత్వ కీలక పదవి లభించింది. తెలంగాణా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఆయన్ని ప్రభుత్వం నియమించింది. దిల్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. శనివారం దిల్‌రాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.



హీరోయిన్‌తో దర్శకుడి పెళ్లి

'కలర్‌ఫొటో' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, అదే సినిమాలో నటించిన నటి చాందినీరావు వివాహం తిరుమలలో వైభవంగా జరిగింది. కొద్దిరోజులుగా ప్రేమికులుగా ఉన్న వీరు శనివారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. తిరుమలలోని ఓ మఠంలో శనివారం ఉదయం జరిగిన ఈ వివాహానికి 'కలర్‌ఫొటో' హీరో సుహాస్ దంపతులు, హాస్య నటుడు వైవా హర్ష తదితరులు పాల్గొని సందడి చేశారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)



ఈ క్రెడిట్ అంతా సుకుమార్‌దే

అల్లు అర్జున్

అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప 2'. వై.రవి శంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బ్లాక్‌బస్టర్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ మాట్లాడుతూ "ఈ సినిమాను ఎంతగానో ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ థాంక్స్. ఫాస్టెస్ట్ రూ.500 కోట్లు వసూలు చేసిన సినిమాగా రికార్డు సృష్టించింది. మరింత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. "సినిమాని అమితంగా ప్రేమించే ఇద్దరు కలసి పని చేస్తే ఎలా ఉంటుందో అదే 'పుష్ప 2'" అని నిర్మాత రవిశంకర్ చెప్పారు. "ఈ సినిమా విషయంలో రాజమౌళి ఎంతో సపోర్ట్ చేశారు. ఫహాద్ ఫాజిల్ లాంటి గొప్ప నటుడితో పని చేయడం నా అదృష్టం. ఈ విజయానికి కారణం చిత్రబృందం పడిన శ్రమ. సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో నా టీమ్ ముందుగానే లెక్కలతో సహా చెప్పేశారు" అని దర్శకుడు సుకుమార్ అన్నారు. "దేశ నలుమూలల నుంచి మాకు సపోర్ట్ చేసిన అందరికీ ధన్యవాదాలు. ఈ సక్సెస్ క్రెడిట్ అంతా సుకుమార్‌దే. ఆయనకి రుణపడి ఉంటాను. అలాగే మాకు ఎంతో సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. అనుకోకుండా సంధ్య థియేటర్లో జరిగిన సంఘటన మమ్మల్ని ఎంతగానో కదిలించింది. 20 ఏళ్లుగా ఇలాగే ఆ థియేటర్లో అభిమానులతో సినిమా చూడ్డానికి వచ్చేవాడ్ని. కానీ ఇంటికి వచ్చిన తరువాత ఆ రోజు జరిగిన సంఘటన తెలిసి చాలా బాధ కలిగింది. ఆ కుటుంబం కోసం రూ.25 లక్షలు కేవలం ఒక సాయంగా ఇచ్చినా.. మనిషి లేని లోటును ఎవరూ తీర్చలేం. అందుకు ఎంతో విచారిస్తున్నాను. అంతా కుదుటపడిన తరువాత వ్యక్తిగతంగా వెళ్లి ఆ కుటుంబాన్ని కలుస్తాను" అని తెలిపారు.

70 అవార్డులు వచ్చాయి కానీ...



హీరోయిన్ వేదిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఫియర్'. డా.హరిత గోగినేని దర్శకత్వంలో డా.వంకి పెంచలయ్య, ఏఆర్.అభి నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకురాలు హరిత మీడియాతో ముచ్చటించారు. "మూడేళ్ల క్రితం మొదలైన ఆలోచన ఇది. ఈ సినిమాకు వేదిక యాప్ట్ అని ఆమె నటించిన 'ముని', 'కాంచన 3' సినిమాలు చూశాక నిర్ణయించుకున్నా. మొదట ఈ సినిమాకు 'భయం' అనే టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ అది క్యాచీగా లేదని 'ఫియర్' ఫైనలైజ్ చేశాం. సస్పెన్స్ థ్రిల్లర్‌లలో ఉండే యూనివర్సల్ అప్పీల్ వల్ల అందరికీ నచ్చుతాయి. ఈ సినిమా ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులు గెలుచుకుంది. ఆ అవార్డ్స్ ఇచ్చిన సంతోషం కంటే సినిమా తెలుగు ప్రేక్షకులకు రీచ్ అయితే వచ్చే సంతోషం ఎక్కువ. ఇది రెగ్యులర్ సినిమా కాదు.. సరికొత్త అనుభూతిని ఇచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది" అని చెప్పారు.

మూర్ఖత్వం బోర్డర్ దాటేసిన పాత్ర



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చలమల్లి'. 'సోలో బతుకే సో బెటరు' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బు మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా కథ విన్న వెంటనే నరేశ్ అంగీకరించారు. ఇది క్యారెక్టర్ బేస్డ్ మూవీ. ఇందులో నరేశ్ పాత్ర చాలా రఫ్‌గా ఉంటుంది. మూర్ఖత్వం బోర్డర్ దాటేసిన పాత్ర ఇది. 90ల్లో జరిగే ఈ సినిమాలో కమర్షియల్ అంశాలతో పాటు మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. ఇందులో ఫాదర్ ఎమోషన్ కీలకం. ప్రతీ ఒక్కరూ తప్పులు చేస్తారు. కానీ అవి సరిదిద్దుకోలేని విధంగా ఉంటే.. ఎంత నష్టపోతామో ఇందులో చూపించాం. చాలా నిజాయితీగా తీసిన సినిమా ఇది. ఇంతవరకూ ఇలాంటి క్యారెక్టర్‌ను నరేశ్ పోషించలేదు. ఈ సినిమా స్క్రీన్‌ప్లే నాన్ లీనియర్‌గా ఉంటుంది. సంభాషణలు చాలా సహజంగా ఉంటాయి. విశాల్ చంద్రశేఖర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.



ప్రేక్షకులు మెచ్చేలా

ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ, రాస్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం 'ఏ రోజైతే చూశానో నిన్ను'. రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రం ద్వారా భరత్ రామ్ హీరోగా, కన్నడ నటి ఐశ్వర్య గౌడ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. షూటింగ్ ఈనెలలోనే ప్రారంభం కానుంది. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రం ఉంటుందని చిత్ర బృందం తెలపింది.

భోజనం మానేయమన్నారు



సంజయ్‌లీలా భన్సాలీ తీర్చిదిద్దిన వెబ్‌సిరీస్ 'హీరామండీ:ద డైమండ్ బజార్'లో బిబ్బోజాన్ పాత్రలో మెప్పించారు నటి అదితీరావు హైదరీ. భోజనం మానేసి షూటింగ్‌లో పాల్గొన్నారట. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అదితి వెల్లడించారు. 'సెట్లో కొన్ని సార్లు భావోద్వేగ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చేయమంటే నేనే వాటిని రొమాంటిక్‌గా చేశాను. ఎంత ప్రయత్నించినా అవి సహజంగా రాలేదు. ఆకలితో చేస్తే భావోద్వేగ సన్నివేశాలు మెరుగ్గా వస్తాయని భోజనం మానేయమని సలహా ఇచ్చారు దర్శకుడు. ఇది నాకు చాలా ఉపయోగపడింది. సిరీస్ షూటింగ్ పూర్తయ్యే వరకూ ఆ సలహానే పాటించాను' అని ఆమె చెప్పుకొచ్చారు.

8న జగదీశ్ గుప్తా సంస్మరణ సభ

ఆదిత్య మ్యూజిక్ కంపెనీ ఉమేశ్ గుప్తా సోదరుడు జగదీశ్ గుప్తా ఇటీవల మరణించారు. ఆయన సంస్మరణ సభను ఈనెల 8న హఫీజ్‌పేట్‌లో నిర్వహించనున్నారు. సంగీత్ సాగర్ మ్యూజిక్ స్టోర్‌తో జగదీశ్ గుప్తా తన ప్రస్థానాన్ని ఆరంభించారు. ఇది అంచెలంచెలుగా ఎదిగి ఆదిత్య మ్యూజిక్ గ్రూప్‌గా రూపాంతరం చెందింది.

కొత్తగా..

యథార్థ సంఘటన ఆధారం



సతీశ్ మాలెంపాటి దర్శకత్వంలో కన్నడ హీరో శశికుమార్ తనయుడు ఆదిత్య శశికుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సమిధ'. చాందిని తవిళరసన్, లావణ్య సాహుకార హీరోయిన్లు. అరుణ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. రాజస్థాన్‌లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సతీశ్ మాలెంపాటి మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ట్విస్ట్‌లు, టర్న్‌లతో పాటు ఛేజింగులు, యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది అన్నారు.

అందరికీ నచ్చే థ్రిల్లర్



అమిత్ రావు హీరోగా నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'జిన్'. చిన్మయ్ రామ్ దర్శకత్వంలో నిఖిల్ ఎమ్.గౌడ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇవ్వగా.. గీత రచయిత రామజోగయ్యశాస్త్రి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు చిన్మయ్ మాట్లాడుతూ "మంచి కథతో తెరకెక్కుతోన్న చిత్రమిది. అందరికీ నచ్చే థ్రిల్లర్ ఇది" అని చెప్పారు. "ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాం" అని నిర్మాత నిఖిల్ అన్నారు.

హారర్ కామెడీ



కొండా వెంకట రాజేంద్ర, అనాల సుస్మిత, మనిషా జష్నాని, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ గణేశ్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మించిన హారర్ బేస్డ్ కామెడీ మూవీ 'లోపలికి రా చెప్తా'. కొండా వెంకట రాజేంద్ర స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రంలోని మొదటి గీతాన్ని డెలివరీ బాయ్ జాఫర్‌తో శనివారం రిలీజ్ చేయించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకట రాజేంద్ర మాట్లాడుతూ 'మా చిత్రంలో హీరో క్యారెక్టర్ డెలివరీ బాయ్. అందుకే మొదటి సాంగ్‌ను ఓ డెలివరీ బాయ్‌తో విడుదల చేయించాం. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

మదర్ సెంటిమెంట్‌తో..



సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహించి ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'ఎర్రచీర-ది బిగినింగ్'. ఈ సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ మనవరాలు తేజస్విని నటించింది. ఎన్.వి.వి.సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మాతలు. మదర్ సెంటిమెంట్, హర్రర్, యాక్షన్ సెంటిమెంట్‌తో తెరకెక్కింది. ఈనెల 27న సినిమా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ 'సెంటిమెంట్ ఉన్న హారర్ సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయి. అలాంటి మంచి కంటెంట్ ఈ సినిమాలో కనిపిస్తోంది' అని అన్నారు. చిత్ర దర్శకనిర్మాత, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూ' బేబి సాయి తేజస్విని చాలా అద్భుతంగా నటించింది. సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడుతూ 'సుమన్ బాబు శ్రమ ట్రైలర్‌లో ఉన్న క్వాలిటీతో తెలుస్తోంది' అని అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో భూకంపం

» రిక్టర్ స్కేలుపై 3.0గా తీవ్రత

చిన్నచింతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఇటీవల భూకంపం సంభవించిన విషయాన్ని మరువక ముందే తెలంగాణలో మరోసారి భూప్రకంపనలు సంభవించాయి. మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని దాసర్‌పల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదైంది. భూప్రకంపనల ప్రభావంతో పలు ఇళ్లలో వస్తువులు కింద పడగా.. ప్రజలు ఇంటి నుంచి బయటికి పరుగులు తీశారు. గ్రామంలోని 90 శాతం మంది రైతులు, వ్యవసాయ కూలీలు కాగా... పొలం పనుల్లో ఉన్నవారంతా భూకంపం దెబ్బతో భయపడి తామ వారి కోసం ఇళ్లకు పరుగు తీశారు. భూకంపం సమయంలో ఒక్కసారిగా కళ్లు తిరిగాయని, మంచం మీద కూర్చున్న వారు కింద పడ్డారని స్థానికులు తెలిపారు. కాగా, భూకంపం భయంతో చాలా మంది ప్రజలు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇళ్లలోకి వెళ్లకుండా ఆరుబయటే ఉండిపోయారు.

ఏపీలో మెగా పేరెంట్, టీచర్స్ మీట్

» 44,303 స్కూళ్లలో 1.20 కోట్ల మందితో నిర్వహణ

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని బాపట్లలో మెగా పేరెంట్, టీచర్స్ మీట్ (పీటీఎం) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒకేసారి 44,303స్కూళ్లలో 1.20 కోట్ల మంది పాల్గొన్నారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు వైపు.. బడి వైపు ఒక అడుగు' పేరిట శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. విద్యాశాఖ మంత్రి మంత్రి లోకేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.."వారసత్వంగా గుంతల రోడ్లు, చెత్తతో నిండిన పట్టణాలు, పది లక్షల కోట్ల అప్పు కూటమి ప్రభుత్వానికి వచ్చాయి. అన్నింటినీ సరిచేసే పనిలోనే ఉన్నా' అని అన్నారు. ఈ కార్యక్రమం ఇచ్చే ఊతంతో రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థలో పెనుమార్పులు రాబోతున్నాయని తెలిపారు. ఒకేసారి 44,303 స్కూళ్లలో 1.20 కోట్ల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం అపురూపమనీ, ఓ రకంగా ఇది గిన్నిస్ రికార్డుగా కూడా మిగిలిపోతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఎస్‌పీటీపీ (స్టూడెంట్-పేరెంట్-టీచర్-ప్రభుత్వం) ఒప్పందంతో విద్యార్థి భవిష్యత్‌కు హామీ లభిస్తుందని చెప్పారు. "ఇప్పటికీ నేను అనునిత్యం నేర్చుకుంటూనే ఉంటాను. నేను విజన్-2020 భావనను ప్రవేశపెట్టినప్పుడు అందరూ నవ్వారు. కానీ, ఆ ఫలితాలను ఇప్పుడు హైదరాబాద్‌లో కనిపిస్తున్నాయి. ఇప్పుడు స్వర్ణాంధ్ర- 2047 అంటున్నా. దానినీ సాకారం చేసి చూపిస్తాను" అని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై అసభ్యకర పోస్టులు

» జర్నలిస్టు శంకర్‌పై చర్యలు తీసుకోండి

» బేగంబజార్ పోలీసులకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహం మీద అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న జర్నలిస్టు శంకర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం బేగంబజార్ పోలీసులకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు కైలాశ్ సజ్జన్, జంగా శ్రీనివాసరావు, హైదరాబాద్ కోఆర్డినేటర్ వీఎస్ వంశీలు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీలనే గౌరవం కూడా లేకుండా కేవలం రాజకీయ లబ్ధికోసం సీఎం రేవంత్ రెడ్డి సతీమణి, కుమార్తెల ఫొటోలను జత చేస్తూ తెలంగాణ తల్లి విగ్రహం పట్ల సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతున్నారన్నారు. జర్నలిస్టు శంకర్, యూట్యూబ్ చానల్ నిర్వాహకులు గతంలోనూ ఇలాంటి పోస్టులు చేశారని, శంకర్ జైలుకు కూడా వెళ్లాడని ఫిర్యాదులో గుర్తుచేశారు.

కంగారెత్తించిన కుయ్ కుయ్!

హయత్‌నగర్‌లో అంబులెన్స్‌తో ఉడాయించిన దొంగ

రంగంలోకి 3 జిల్లాల పోలీసులు.. 130 కి.మీ మేర ఛేజ్

ఆపేందుకు యత్నించిన ఏఎస్‌ఐ.. ఢీకొట్టడంతో తీవ్రగాయాలు

సూర్యాపేట సమీపంలో లారీలను అడ్డుగా పెట్టిన పోలీసులు

యూ టర్న్ యత్నంలో గోతిలోకి అంబులెన్స్.. దొంగ అరెస్టు



టేకుమట్ల వద్ద గోతిలో పడిన అంబులెన్స్; నిందితుడు వెంకటరామనర్సయ్య

హయత్‌నగర్, కేతేపల్లి, సూర్యాపేట రూరల్, కట్టంగూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుయ్ కుయ్ కుయ్ అని శబ్దం చేస్తూ అంబులెన్స్ దూసుకెళుతుంటే వాహనదారులు దారివ్వడం సహజం! ఆ అంబులెన్స్ దూసుకెళుతుంటే మాత్రం ఎక్కడ తమపైకి వస్తుందోనని వాహనదారులు బెంబేలెత్తిపోయారు. పోలీసులేమో.. ఆ అంబులెన్స్‌ను ఆపేందుకు ఛేజ్ చేశారు! ముందు అంబులెన్స్.. వెనుక పోలీసులు.. ఇలా మూడు గంటలపాటు ఏకంగా 130 కి.మీ దూరం సినీ ఫక్కీలో చేజింగ్ జరిగింది!! ఆపేందుకు ప్రయత్నించి.. అంబులెన్స్ ఢీకొట్టడంతో ఓ ఏఎస్‌ఐ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ అంబులెన్స్‌ను ఓ దొంగ ఉడాయించడంతో శనివారం మధ్యాహ్నం హయత్‌నగర్ నుంచి చౌటుప్పల్, చిట్యాల, నకిరేకల్ మీదుగా సూర్యాపేట జిల్లా సరిహద్దు వరకు మూడు జిల్లాల పోలీసులు హైరానా పడ్డారు. ఆ దొంగ.. ఖమ్మం జిల్లా బయ్యారం మండలం లక్ష్మీపురానికి చెందిన రావుల వెంకట రామనర్సయ్య. హైదరాబాద్ హయత్‌నగర్‌లో ఉంటున్నాడు! మతిస్థిమితం లేనివాడిగా ప్రవర్తిస్తూ దొంగతనాలు చేస్తున్నాడు. శనివారం హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద నిలిపి ఉంచిన 108 అంబులెన్స్ ఎక్కాడు. ఆ వాహనంతో 65వ నంబరు జాతీయ రహదారి మీదుగా విజయవాడ వైపు దూసుకెళ్లాడు. అంబులెన్స్ అపహరణకు గురైందని తెలుసుకున్న ఆస్పత్రి సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఒకరి తర్వాత ఒకరుగా భువనగిరి జిల్లా చౌటుప్పల్, నల్లగొండ జిల్లా చిట్యాల, కట్టంగూరు పోలీసులు హైవేపై అంబులెన్స్‌తో వెళుతున్న దొంగను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. చిట్యాల ఏఎస్‌ఐ పట్టణ కేంద్రంలో అంబులెన్స్ వాహనాన్ని చేజ్ చేసేందుకు పోలీస్ వాహనంతో వెంబడించారు. మండలంలోని పామనగుండ్ల గ్రామ శివారులోకి రాగానే అంబులెన్స్ వాహనాన్ని క్రాస్ చేసి కొంత దూరం వెళ్లాక రోడ్డు పక్కనే వాహనం నిలిపి అంబులెన్స్‌కు ఎదురుగా వెళ్లి ఆపేందుకు యత్నించారు. నిందితుడు అంబులెన్స్ ఆపకుండా ఏఎస్‌ఐను ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో ఏఎస్‌ఐ జానారెడ్డి కాలుకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీసులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుకు అడ్డంగా లారీలు పెట్టడంతో..

కట్టంగూరు మండలం దాటి కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా వైపు అంబులెన్స్ వస్తోందని తెలుసుకున్న ఎస్‌ఐ శివతేజ బృందం వాహనాలను అడ్డుపెట్టగా దొంగ టోల్‌కౌంటర్ గేటును ఢీకొట్టి ముందుకు వెళ్లిపోయాడు. ఎస్‌ఐ శివతేజ 8 కి.మీ. తర్వాత అంబులెన్స్‌ను ఓవర్‌టేక్ చేసి 6 కి.మీ. ముందుకెళ్లి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకుమట్ల వద్ద హైవేపై గల జంక్షన్‌లో లారీలను అడ్డుపెట్టి రోడ్డును బ్లాక్ చేయించారు. రోడ్డుపై పెద్ద ఎత్తున పోలీసులు, మనుషులను చూసిన దొంగ అంబులెన్స్‌ను వేగంగా ముందుకు కదిలించాడు. అయితే భారీ వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో వాహనాన్ని రోడ్డుపైనే వెనకకు యూటర్న్ తీసుకునేందుకు యత్నించాడు. ఈ క్రమంలో అంబులెన్స్ అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. పోలీసులు వెంటనే అంబులెన్స్‌ను చుట్టుముట్టి డ్రైవింగ్ సీట్లో ఉన్న వెంకటరామనర్సయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం హయత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చొద్దు!

» ప్రజల మనోభావాల్ని దెబ్బతీయొద్దు

» హైకోర్టులో జూలూరు గౌరీశంకర్ పిల్

» విచారించనున్న సీజే ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం రూపాన్ని మార్చకుండా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ హైకోర్టులో శనివారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. తెలంగాణ ప్రజలు ప్రస్తుత తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదించడంతోపాటు గర్వకారణంగా భావిస్తుంటారని తెలిపారు. ప్రభుత్వం విగ్రహం మార్పు ద్వారా ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి రాష్ట్రవ్యాప్తంగా పాతవాటి స్థానంలో కొత్త విగ్రహాలను ఏర్పాటు చేస్తే.. ప్రభుత్వ ఖజానా మీద భారీ ఒత్తిడి పడుతుందని జూలూరు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాల ఏర్పాటుకు రూ.150 కోట్ల వరకు వ్యయం అవుతుందని.. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం సబబు కాదని తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ పుట్టినరోజైన డిసెంబరు 9న.. ఆమె జన్మదినోత్సవం బహుమతిగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పెట్టుకున్నారని దీని వెనుక రాజకీయ కుట్రతోపాటు గత ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల ఆనవాళ్లను చెరిపివేయాలన్న దురుద్దేశం ఉందన్నారు. ఈ పిటిషన్ త్వరలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నది.

కోర్టు ఉత్తర్వులు దాచి పెట్టి మోసం చేసినందుకు రూ.5 లక్షల జరిమానా!

ఇప్పటికే అమలులో ఉన్న కోర్టు ఉత్తర్వులను దాచి పెట్టి మోసం చేయడం ద్వారా భూమిని తమ పేరిట చేయించుకున్న ఇండస్ట్రియల్ ఆయిల్ ప్యూరిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి హైకోర్టు రూ.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని నాలుగువారాల్లో హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి జమ చేయాలని పేర్కొంది. బాధ్యులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

కాంగ్రెస్ పాలనపై నేడు బీఆర్ఎస్ చార్జిషీట్

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ పాలనలో వంచనే తప్ప ఏ వర్గానికీ మేలు జరగలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ చార్జ్‌షీట్ విడుదల చేస్తుందని తెలిపారు. ఈ మేరకు హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



సంక్రాంతిలోపు

భూ సమస్యలకు మోక్షం

- గతంలో కన్నా మెరుగ్గా ట్రైబ్యునల్ వ్యవస్థ తెస్తాం
- రెండు రోజుల్లో గ్రామ రెవెన్యూ వ్యవస్థపై నిర్ణయం
- 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల ఆధారంగానే
- రూ.1900 కోట్ల విలువైన భూములను కాపాడాం
- మంత్రిగా ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చింది

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శీతాకాల అసెంబ్లీ సమావేశాల తర్వాత కొత్త ఆర్వోఆర్ చట్టం-2024 అమల్లోకి వస్తుందని, దీని ద్వారా సంక్రాంతిలోపు భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెండు, మూడు రోజుల్లోనే గ్రామ రెవెన్యూ సిబ్బంది నియామకంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ధరణి కారణంగా లక్షలాది మంది చిక్కుల్లో పడ్డారని, ఆయా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులకు ఏడాదిలోనే పరిష్కారం చూపడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

కొత్త ఆర్వోఆర్ చట్టం వల్ల ప్రజలకు జరిగే సౌలభ్యం ఏంటి?

18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ చట్టాల నుంచి మంచి అంశాలు సేకరించి కొత్త ఆర్వోఆర్ చట్టం-2024లో పెట్టాం. ఆర్వోఆర్-2020కి ముందు ఏ సమస్య వచ్చినా ట్రైబ్యునల్‌కు వెళ్లి అక్కడ పరిష్కారం కాకపోతే కోర్టుకు వెళ్లే వారు. 2020 నాటి చట్టం ద్వారా ట్రైబ్యునల్ రద్దు చేశారు. ఇప్పుడు మరింత మెరుగ్గా ట్రైబ్యునల్ వ్యవస్థను తెస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించి పరిష్కారం చూపబోతున్నాం. ఇంటి స్థలంపై హక్కు కల్పిస్తూ టైటిల్ ఇస్తాం. చట్టబద్ధత కల్పిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 10,956 రెవెన్యూ గ్రామాల్లో గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల రక్షణ, విపత్తు సమయాల్లో ప్రజలకు అండగా ఉండే వ్యవస్థ లేకుండా పోయింది. ఈ వ్యవస్థను పునరుద్ధరించే అంశంపై రెండు, మూడు రోజుల్లోనే నిర్ణయం తీసుకోనున్నాం. కొత్త ఆర్వోఆర్-2024 దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండబోతుంది. అది అమల్లోకి వచ్చాక అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి.

బీఆర్ఎస్ హయాంలో భూ కబ్జాలు జరిగాయా? వాటిపై చర్యలు ఉంటాయా?

హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనే 2 వేల ఎకరాలను బీఆర్ఎస్ నేతలు స్వాహా చేశారు. 58, 59 జీవోల ప్రకారం ఉన్న వెసులుబాటును అడ్డు పెట్టుకుని కాజాగూడ, శేర్‌లింగంపల్లి వంటి ప్రాంతాల్లో రూ.కోట్ల విలువజేసే భూములు కాజేశారు. వీటిపై 'ఆంధ్రజ్యోతి' సైతం అనేక కథనాలు ప్రచురించింది. ఆ ఆధారాలతోనే ఇప్పుడు రూ.1900 కోట్ల విలువజేసే ఆస్తులను కాపాడాం. ఈ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టబోతున్నాం.

భూముల విలువను సవరించనున్నారా?

గతంలో అశాస్త్రీయంగా భూముల విలువలు సవరించారు. ఉదాహరణకు హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో చదరపు అడుగు మార్కెట్‌లో రూ.6000 ఉంటే బీఆర్ఎస్ హయాంలో రూ.8000కు పెంచారు. ఇలాంటి వాటిని సరిదిద్ది శాస్త్రీయ పద్ధతిలో వాస్తవ విలువనే నిర్ధారించాలని భావిస్తున్నాం. మార్చి తరువాత దీన్ని అమలు చేసే అవకాశం ఉంది. అవసరమైతే స్టాంపుడ్యూటీని 0.5%తగ్గిస్తాం.

మీరు చేయాలనుకుని.. చేయలేకపోయిన పని ఏదైనా ఉందా..?

భూ రీ సర్వే చేయించాలని అనుకున్నా. ఎవరైతే అనుభవంలో ఉన్నారో.. వాళ్లకు పూర్తి హక్కులు కల్పించాలంటే భూ రీ సర్వే చేయాల్సిందే. ఇప్పటికీ చాలా మందికి పట్టా ఉంటే భూమి లేదు.. భూమి ఉంటే పట్టా లేదు. రీ సర్వే చేస్తేనే ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపగలం. ఇది చేయలేకపోతున్నాననే అసంతృప్తి ఉంది..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర సహకారం తీసుకుంటారా?

బీఆర్ఎస్ పాలనలో గృహనిర్మాణ శాఖకు నిధులు రాలేదు. మేము మాత్రం నిబంధనల ప్రకారమే నిధులు పొంది పేదలకు లబ్ధి చేకూర్చాలని భావిస్తున్నాం. కేంద్రం నిధులకు సంబంధించి వారు బ్రాండింగ్ చేసుకున్నా మాకు ఎలాంటి అభ్యంతరం లేదని సీఎం రేవంత్ ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎలాంటి బేషజాలు లేవు. జనవరిలో ఇళ్ల నిర్మాణ పనులు మొదలవుతాయని ఆశిస్తున్నాం.

నిధుల సమీకరణకు ప్రభుత్వ భూములు వేలం వేసే ఆలోచన ఉందా..?

నిజం ఏదో ఒక రోజు చెప్పాలి. అది చెప్పకపోతే పెద్ద పుండు అయి ఇబ్బంది పెడుతుంది. గత ప్రభుత్వం ఎక్కడ పడితే అక్కడ అప్పులు తెచ్చింది. రూ.7లక్షల కోట్లకు వడ్డీల కిందే ప్రస్తుతం ప్రతి నెలా రూ.6500 కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజాప్రయోజనాల కోసం తప్పదనుకుంటే పారదర్శకంగా భూముల అమ్మకం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. కానీ, అనవసర ఖర్చుల కోసం విలువైన ఆస్తులను అమ్మకానికి పెట్టం.

ఏడాది పాలనలో మీకు బాగా సంతృప్తి ఇచ్చిన నిర్ణయాలేంటి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి కలెక్టర్ల లాగిన్‌లో భూ సమస్యలకు సంబంధించి 2,45,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్తి ఉండి.. ఏ తప్పూ చేయకున్నా.. లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రెవెన్యూ మంత్రిగా ఏడాదిలోనే పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం చూపా. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. దీంతో ప్రజల నుంచి మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలోనూ 2.50 లక్షలు పరిష్కరించాం. అప్పుడు చాలా సంతృప్తి కలిగించింది. తమను రోడ్డు మీద పడేశారని వీఆర్ఏలు, వీఆర్వోలు చెబుతుండే వారు.. ఇప్పుడు వారికి భరోసా ఇచ్చి, మళ్లీ అవకాశం ఇవ్వబోతున్నందుకు ఆనందంగా ఉంది. గతంలో తొలగించిన వారిలో నుంచే సుమారు 11వేల మందిని తీసుకోబోతున్నాం. సంక్రాంతి లోపు దీన్ని పూర్తి చేస్తాం. ఇక మూడోది కొత్త ఆర్వోఆర్ చట్టం తీసుకురావడం చాలా తృప్తిని ఇచ్చింది.

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఒకే కుటుంబ పాలనకు

కాలం చెల్లింది

- కాంగ్రెస్ పాలనలో మంత్రులందరికీ అధికారాలు
- నిజాయితీ, పారదర్శకతతో పాలన అందిస్తున్నాం
- జనవరి లేదా ఫిబ్రవరి నుంచి సన్న బియ్యం పంపిణీ

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'వన్ మ్యాన్ షో.. వన్ ఫ్యామిలీ రూల్‌కు కాలం చెల్లింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో 11 మంది మంత్రులు పవర్ ఫుల్. 24/7 పనిచేస్తున్నాం. నిజాయతీ, పారదర్శకతో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక పాలన అందిస్తున్నాం. గత పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ పాలన కన్నా.. మేము వచ్చిన ఏడాదిలోనే ఎంతో చేశాం. ఎక్కువ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. మంచి చేస్తే విపక్ష నేతలు చప్పట్లు కొడతారని నేను అనుకోవడం లేదు. అసూయ, నిరాశతో వాళ్ల విమర్శలు చేస్తూనే ఉంటారు' అని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నీటి పారుదల శాఖను పునర్ వ్యవస్థీకరణ చేసి, పునర్నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఏడాదికి 24 లక్షల టన్నుల బియ్యం ఇస్తుంటే.. 50% దారి మళ్లుతోందని, అందుకే రేషన్‌షాపుల ద్వారా ఈ జనవరి లేదా ఫిబ్రవరి నుంచి సన్నం బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. మంత్రి ఉత్తమ్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేయనున్నారు?

బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు. వాళ్లే డిజైన్ చేశారు. వాళ్లే కట్టారు. రాష్ట్రానికి గుండెకాయ మేడిగడ్డ అని ప్రగల్భాలు పలికారు. వారు అధికారంలో ఉన్నప్పుడే అది కుంగిపోయింది. ఈ ఏడాది చుక్క నీరు కూడా నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. నిర్మాణంలో లోపాలతో మూడు బ్యారేజీలు వైఫల్యం చెందాయి. ఈ అంశంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ)తో ఈ నెల 9వ తేదీ తర్వాత మళ్లీ భేటీ అవుతాం. మా పాలనలో తప్పులకు ఆస్కారమే ఉండదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

నీటి పారుదల శాఖను ఎలా సంస్కరిస్తున్నారు?

గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖను అస్తవ్యస్తం చేశారు. ఒక్క నియామకమూ చేపట్టలేదు. కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి కీలక పోస్టులు కట్టబెట్టారు. వచ్చే రెండేళ్లలో దేశంలోనే నంబర్‌వన్‌గా రాష్ట్ర నీటిపారుదలశాఖను తీర్చిదిద్దుతాం. మేము వచ్చాక 700మంది ఏఈఈలను నియవించాం. మరో 1300 మంది నియమించనున్నాం. లష్కర్ల నియామకాలు చేపడతాం.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధమ్యాలు ఏంటి?

అసూయ, జలసితో ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. వన్ మ్యాన్ షో, వన్ ఫ్యామిలీ రూల్‌కు కాలం చెల్లింది. మేము 11 మంది మంత్రులం ఉన్నాం. మా మధ్య ఎలాంటి తేడాల్లేవు. ఎవరి పరిధి మేరకు వారికి అధికారాలున్నాయి. ప్రజాసంక్షేమం, అభివృద్ధే.. మాకు ప్రాధామ్యాలు. వరంగల్ ఎయిర్‌పోర్టు, మూసీ పునరుజ్జీవం, మెట్రో రెండో దశ విస్తరణ, రూ.22 వేల కోట్లతో రీజినల్ రింగు రోడ్డు.. ఇలా ఎన్నో పనులు చేపట్టనున్నాం. గత ప్రభుత్వం దురుద్దేశంతో ప్రాణహితను పక్కనపెట్టింది. రానున్న వేసవిలో ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నాం.

మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ఏమైనా తప్పులు జరిగాయా?

మూసీ పునరుజ్జీవం డీపీఆరే సిద్ధం కాలేదు. డీపీఆర్ సిద్ధం కాక ముందే ప్రాజెక్టుపై విమర్శలు చేయడం తగదు. ఈ పథకం అమలు క్రమంలో మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటాం. మూసీ పునరుజ్జీవంతో 'క్లీన్ అండ్ మోర్ వాటర్' వస్తుంది.

రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఎప్పటి నుంచి ఇస్తారు...?

ఈ సంక్రాంతి(జనవరి)లో లేదా ఫిబ్రవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని భావిస్తున్నాం. మంత్రివర్గంలో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటాం. ఏటా 24 లక్షల టన్నుల దొడ్డుబియ్యాన్ని రేషన్‌షాపుల ద్వారా ఇస్తుంటే.. అందులో 50% కూడా వాడటం లేదు. బియ్యమంతా పక్కదారి పడుతోంది. వచ్చే రెండునెలల్లో ప్రజాపంపిణీ వ్యవస్థలో సమగ్ర మార్పులు తేనున్నాం. సన్నాలు మిల్లింగ్ చేసి.. రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు అందిస్తాం. తెలంగాణ ఏర్పడే నాటికీ పౌరసరఫరాల సంస్థ అప్పు రూ.4 వేల కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.58 వేల కోట్లకు చేరింది. ఏడాదికాలంలో రూ.11 వేల కోట్ల అప్పును తగ్గించి.. రూ.47వేల కోట్లకు చేర్చాం. ఏపీలో 100 శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తున్నారు. మేము కూడా క్రమక్రమంగా 100 శాతం బ్యాంకు గ్యారెంటీలు తీసుకున్నాకే మిల్లర్లకు ధాన్యం ఇస్తాం.

కృష్ణా జలాల్లో వాటా సంగతేంటి?

కృష్ణా జలాల్లో వాటాను గత ప్రభుత్వం విస్మరించింది. ఉమ్మడి ఏపీకి గంపగుత్తగా 811 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయిస్తే.. అందులో 512 టీఎంసీలు ఏపీ వాడుకోవడానికి, 299 టీఎంసీలు తెలంగాణ వాడుకోవడానికి అంగీకారం తెలిపింది. ఏపీలో పోతిరెడ్డిపాడు విస్తరణ బీఆర్ఎస్ హయాంలోనే జరిగింది. దెబ్బతిన్న తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకుంటాం. కృష్ణా జలాల్లో 70% వాటాను సాధించడమే లక్ష్యంగా పోరాటం చేస్తున్నాం. ఆర్నెల్లల్లో ట్రైబ్యునల్ తీర్పు వెలువడే అవకాశం ఉంది. తీర్పు వెలువడగానే పాలమూరు-రంగారెడ్డితో పాటు ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తిలకు నీటి కేటాయింపులు చేసుకుంటాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగా ఎవరెంతో వారికంత అనే విధంగా ప్రభుత్వ పథకాలు రూపొందించి అమలు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో వారిలో సాధికారత పెరిగిందని చెప్పారు. మరిన్ని బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన, బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఏదో ఒకటి వడ్డించడం కాకుండా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన ఆహారం అందిస్తామని చెప్పారు. కేవలం బీసీ గురుకుల విద్యార్థులకే కాకుండా అన్ని గురుకులాల్లో ఒకే రకమైన డైట్ మెనూ అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిగా తాను చేపట్టిన, రాబోయే నాలుగేళ్లల్లో చేపట్టే కార్యక్రమాల గురించి పొన్నం ప్రభాకర్ 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఎవరెంతో వారికంత

కులగణన ఆధారంగా పథకాల రూపకల్పన.. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి పెరిగిన ఆదరణ

- త్వరలో మరిన్ని కొత్త బస్సుల కొనుగోలు
- హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ ఆటోలు తేవాలని యోచిస్తున్నాం
- త్వరలో గురుకుల విద్యార్థులకు కొత్త మెనూ.. చిరుధాన్యాలతో చేసిన చిరుతిళ్లు అందిస్తాం

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి పొన్నం ప్రభాకర్



ఏడాది పాలనలో మీకు అత్యంత సంతృప్తినిచ్చిన అంశం?

తెలంగాణ అక్కా, చెల్లెళ్లకు ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ 48 గంటల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అత్యంత సంతృప్తినిచ్చింది. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఆర్టీసీని మళ్లీ బతికించాం.

ఆర్టీసీ బస్సులు సరిపడా లేవని విమర్శలు వస్తున్నాయి?

ప్రయాణికుల సంఖ్య ఒకేసారి 48 లక్షల నుంచి 60 లక్షలకు పెరిగింది. అందులో రోజూ 36 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారు. రద్దీని తట్టుకునేందుకు 1340 కొత్త బస్సులు తీసుకున్నాం.

ఆర్టీసీ విలీన ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?

ఆర్టీసీ విలీనం, కార్మికుల సంఘాలు అనే రెండు అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. సరైన సమయంలో ప్రభుత్వం స్పందిస్తుంది.

విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయి కదా?

బకాయిలు త్వరలో చెల్లిస్తాం. ఇంతకుముందు 300 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసి పంపేవారు. ఆ సంఖ్యను 800కు పెంచాలని ప్రతిపాదనలు అందాయి. రెండు, మూడు రోజుల్లో అనుమతులు వస్తాయి.

హామీలు ఆకాశమంత.. నెరవేర్చింది కొంతేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి?

మమ్మల్ని అడిగేముందు బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని హామీలు నెరవేర్చాయో చూసుకోవాలి. బీజేపీ హయాంలో వైఫల్యాల గురించి ఏఐ (కృత్రిమ మేధ)తో ఆరా తీస్తే 20 అంశాలు వరుసపెట్టి వచ్చాయి. బీఆర్ఎస్ వైఫల్యాలూ అదే స్థాయిలో ఉన్నాయి. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రూ.2 లక్షల్లోపు రైతు రుణాలను మాఫీ చేశాం.

కులగణనలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉందని తేలితే వారికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుతారా?

తప్పకుండా. ప్రభుత్వానికి సంకల్పం ఉంది. చిక్కులు వస్తే కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకునే ప్రయత్నం చేస్తాం. కుల సర్వే ఆధారంగా ఎవరెంతో వారికంత అనే విధంగా పథకాలు రూపొందిస్తాం.

కాలుష్యరహిత హైదరాబాద్ కోసం తీసుకుంటున్న చర్యలు?

హైదరాబాద్‌లో రెండేళ్లలో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ ఆటోలు తేవాలని అనుకుంటున్నాం. ఆటో డ్రైవర్లకు ఈవీ వాహనాల కొనుగోలు ఆర్థిక భారం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్టీసీ బస్సులను సైతం మారుస్తాం.

గురుకుల విద్యార్థులకు శుచిగా, శుభ్రంగా, నాణ్యమైన ఆహారం అందించాలనే అంశంపై ఏమంటారు ?

చర్యలు చేపట్టాం. ఇప్పటివరకు తోచింది, మార్కెట్‌లో దొరికింది విద్యార్థులకు ఆహారంగా అందించారు. కానీ ఇకపై అలా కాదు. నాణ్యమైన, బలమైన ఆహారం అందిస్తాం. సాయంత్రం చిరుతిళ్లుగా చిరుధాన్యాలతో రూపొందించినవి అందిస్తాం. అన్ని గురుకులాల్లో ఒకే రకమైన ఆహారం అందిస్తాం. ప్రస్తుత ధరలకు తగ్గట్లుగా సరఫరాదారులకు రేట్లు పెంచి ఇస్తాం.

విధ్వంసాన్ని సరిచేస్తూ.. వికాసం వైపు

- ప్రజా సొమ్మును కాజేసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిది
- తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదం వద్దు
- రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడు
- వచ్చే నెలలో క్యాబినెట్ విస్తరణకు చాన్స్
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్/బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనలో అస్తవ్యస్తంగా మారిన తెలంగాణను కాంగ్రెస్ సర్కారు సరిచేస్తూ వికాసం వైపు పరుగులు తీయిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని ఆనాడు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. అధికారాన్ని కైవసం చేసుకున్న కేసీఆర్ నిర్బంధాలు, నిరంకుశ విధానాలతో దోపిడీకి తెరలేపారని విమర్శించారు. ప్రపంచంలో అతి స్వల్ప కాలంలో అత్యధికంగా ప్రజా సొమ్మును దోపిడీ చేసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదేనని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకుని ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకొంటున్న సందర్భంగా మహేశ్‌గౌడ్ శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌కు అప్పగిస్తే పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అంటూ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పెట్టలేకపోయారని ప్రశ్నించారు. రాష్ట్ర సంస్కృతికి దర్పణమైన తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదం చేయవద్దని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడన్నారు. పార్టీకి-ప్రభుత్వానికి మధ్య సమన్వయం తో నిర్ణయాలు తీసుకుంటున్నట్టు వివరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో సామాజిక సమతుల్యత పాటించినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా లేదా జనవరి తొలి వారం లో మిగిలిన నామినేటెడ్ పోస్టులైన చైర్మన్‌లు, డైరెక్టర్‌ల ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులను విస్మరించే ప్రసక్తే లేదన్నారు. కులగణన సర్వే నివేదిక ఆధారంగా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని పేర్కొన్నారు. పార్టీలో కొందరు సీనియర్లు అసంతృప్తితో ఉన్నట్టుగా విలేకరులు అడిగిన ప్రశ్నకు మహేశ్‌గౌడ్ సమాధానమిస్తూ.. ఇతర పార్టీలతో పోల్చితే కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువన్నారు.



'పాలమూరు వీర పాట'ను ఆవిష్కరిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్

బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట

కుర్చీ కోసం బీఆర్ఎస్‌లోని ముఖ్య నాయకులు మధ్య మూడు ముక్కలాట సాగుతోందని మహేశ్ గౌడ్ అన్నారు. కేటీఆర్‌ను దించేసి పదవి కోసం కవిత ప్రయత్నిస్తున్నారని.. వీరి ఇద్దరి మధ్య ఘర్షణ తనకు కలిసి వస్తుందనే ఆశతో హరీశ్‌రావు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఇటు ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ విఫలమై ఫాంహౌస్‌కు పరిమితమయ్యారన్నారు.

బీజేపీలో నాలుగు స్తంభాలాట

బీజేపీ నేతలకు తెలంగాణపై మాట్లాడే నైతిక అర్హత లేదని మహేశ్ గౌడ్ అన్నారు. తెలంగాణ కోసం నాడు ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా విదేశాలకు వెళ్లారన్నారు. ఇన్నేళ్లుగా కేంద్రమంత్రిగా ఆయన తెలంగాణకు ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీలో కుర్చీ కోసం నాలుగు స్తంభాలాట సాగుతోందని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ఉత్తర-దక్షిణ ధ్రువాలని, ఈటల రాజేందర్, అరుణ.. తూర్పు-పడమరలుగా బీజేపీలో కొనసాగుతున్నారన్నారు.

మళ్లీ కాంగ్రెస్‌కే పట్టం..

తెలంగాణలో నాలుగేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ విజయం సాధించి అధికారం కొనసాగిస్తుందని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నేతలు చేసే చౌకబారు విమర్శలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. వచ్చే నెలలో క్యాబినెట్ విస్తరణకు అవకాశం ఉందని చెప్పారు. కాగా, కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనకు 'పాలమూరు వీర పాట' అద్దం పట్టిందని మహేశ్ గౌడ్ అన్నారు. ఈ పాటను అసెంబ్లీ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ పాటకు యుగంధర్‌గౌడ్ నిర్మాతగా వ్యవహరించగా.. గాయకుడు ఎంఎల్‌ఆర్ కార్తికేయ ఈ పాటను పాడారు.

తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర

హరీశ్‌రావు ఎదుట ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసితుల ఆవేదన

ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం: హరీశ్‌రావు



హైదరాబాద్/నార్సింగ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం (ఆర్‌ఆర్‌ఆర్)లో భాగంగా తక్కువ ధరకే తమ భూములను లాక్కొనేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని పలువురు బాధితులు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు.. తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పుప్పాల్‌గూడలో నివాసం ఉంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ విషయంలో ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం దివ్యాంగులకు ఇస్తున్న 4,016 రూపాయల పెన్షన్‌ను ఆరువేల రూపాయలకు పెంచాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈనెల 26న జరగనున్న దివ్యాంగుల మహా ధర్నాకు తాను తప్పనిసరిగా హాజరవుతానని తనను కలిసిన దివ్యాంగుల సంఘం నాయకులకు ఆయన హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పాలనంతా ఉత్తదే: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనపై రసమయి బాలకిషన్ రూపొందించిన 'నమ్మి నానబోస్తే' లఘు చిత్రాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెలంగాణ భవన్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనంతా ఉత్తదే అనే విషయాలను ఈ లఘు చిత్రం సరిగా చూపించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అవకతవకలను కళ్లకు కట్టినట్లుచూపించారని రసమయిని ప్రశంసించారు. రసమయి మాట్లాడుతూ.. ఇలాంటి షార్ట్ ఫిలింలు ఇకపై నెలకొకటి తీసుకొచ్చే విధంగా ప్రయత్నిస్తానన్నారు.


సభా వేదికపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, దామోదర , తుమ్మల తదితరులు

అడ్డగోలు మాటలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నల్లగొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల.. కేసీఆర్, బీఆర్ఎస్‌ని నకలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఈటల, కిషన్‌రెడ్డీ.. మీరు మారండి. దొంగల సోపతి పట్టి దొంగల బండి ఎక్కకండి.. మీకున్న గౌరవం పోగొట్టుకోకండి" అని రేవంత్ పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక్క ఏడాదిలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, బీజేపీ పాలిత ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి పథకం ఒక్కటి అమలు చేసినట్లు నిరూపిస్తే, తనతో పాటు తన మంత్రివర్గ సహచరులందరితో కలిసి ఢిల్లీ వెళ్లి క్షమాపణ చెబుతామని సవాల్ చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని, వారి హయాంలో చేసిన అప్పులను క్రమపద్ధతిలో తీర్చు తూ, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. అధికారంలో ఉంటే ఉప్పొంగడం, లేకపోతే కుంగిపోవడం తగదని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా.. తాము జనంలోనే ఉన్నామని, ప్రజల తరఫున పోరాడామని.. కేసీఆర్‌లా ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకోలేదని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన పాత్ర పోషించాలని, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. పాలనలో లోపాలుంటే విమర్శించాలని సీఎం ఆహ్వానించారు. కాంగ్రెస్ నేతలు ఎవరూ ఇలా సభకు రాకుండా పోలేదన్నారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జానారెడ్డి సభలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలిచ్చారని.. దారితప్పిన రోజు నిలదీసి పోరాడారని గుర్తుచేశారు. మా ఎమ్మెల్యేలను గుంజుకున్నా మల్లు భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహా పంచపాండవులను వెంటబెట్టుకొని మీపై ధైర్యంగా పోరాడారని, నిలదీశారని, సలహాలిచ్చారని రేవంత్ చెప్పారు.


బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ వద్ద కృష్ణమ్మకు చీర సారె సమర్పిస్తున్న సీఎం, మంత్రులు

గాలి బ్యాచ్‌ని తయారు చేసి వదిలారు

'మీరు మీ పాత్రని పోషించకపోగా, గాలి బ్యాచ్‌ని తయారు చేసి వదిలారు. వారేం మాట్లాడుతున్నారో మీరు వింటున్నారా?' అని కేసీఆర్‌ని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వం ఏం చేసినా వాళ్లు వద్దంటున్నారని, ప్రాజెక్టులకు భూసేకరణ వద్దంటున్నారని, కంపెనీలు వద్దంటున్నారని, పెట్టుబడులు వద్దంటున్నారని, గ్రూప్-4, గ్రూప్-1 వేస్తామంటే వద్దంటున్నారని.. వద్దనడం తప్ప వాళ్లకేమీ తెలియడం లేదన్నారు. వారి తీరు సరైందో కాదో తెలంగాణ సమాజం ఆలోచించాలని పిలుపునిచ్చారు. అసలు తెలంగాణ ఉద్యమం జరిగిందే ఉద్యోగాల కోసం కాదా? అని రేవంత్ నిలదీశారు. 1200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నది భవిష్యత్ తరాల బాగు కోసమే కానీ, ఆ కుటుంబంలో నలుగురి కోసం కాదు కదా? అని ప్రశ్నించారు. ఇదే నల్లగొండ గడ్డకు చెందిన శ్రీకాంతాచారి బలిదానం చేసుకున్నది, ఇషాన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్ కిష్టయ్యలు ఆత్మార్పణలు చేసుకున్నది భవిష్యత్ తరాల కోసం కాదా? అని నిలదీశారు.

యాసంగిలోనూ సన్నాలే వేయండి

యాసంగిలోనూ రైతులు సన్న ధాన్యమే సాగు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎంత సన్న ధాన్యం పండించినా ప్రభుత్వమే కొంటుందని, అంతేకాకుండా క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో వరి వేస్తే ఉరే నని చెప్పి రైతులను ఇబ్బంది పెట్టారని, కానీ తాము వరి వేయాలని, సన్న వడ్లే పండించాలని చెబుతున్నామని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి హాస్టళ్లలో, గురుకులాల్లో పిల్లలకు సన్న బియ్యమే పెడతామని చెప్పారు. ఇక్కడ పండిన సన్న బియ్యమే మన పిల్లలకు పెడదామని అన్నారు.

మూసీ ప్రక్షాళన చేసి తీరతాం

నల్లగొండ జిల్లా ప్రజల కష్టాలకు కారణమైన మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీని ప్రక్షాళన చేయకపోతే నల్లగొండలో భవిష్యత్‌లో ఎవరూ బతకరని అన్నారు. 'ప్రజలు వెళ్లి ఈ జిల్లాలో ఉన్న ఏకలింగాన్ని నిలదీయండి, మూసీ ప్రక్షాళన కావాలో వద్దో అడగండి. వద్దంటే ఈ నీళ్లలోనే ముంచండి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. మూసీని ప్రక్షాళన చేసే బాధ్యత తనదని, అడ్డుకునే వారి సంగతి జిల్లా ప్రజలు చూసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి జరగాలంటే, ప్రాజెక్టులు రావాలంటే భూసేకరణ అవసరమని, కొందరు త్యాగాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. గోల్కొండను కుతుబ్‌షాహీలు కడితే, చార్మినార్‌ని అసఫ్ జాహీలు కట్టారని, అలాగే ఫ్యూచర్ సిటీని తాము కడతున్నామని వివరించారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సంక్రాంతి తర్వాత రైతుభరోసా

సంక్రాంతి తర్వాత నుంచి రైతు భరోసా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతుంటే బీఆర్ఎస్ నేతల గుండెలు గుభేలుమంటాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్తును కొనసాగించడమేగాక, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డలపై భారం తగ్గించేందుకు రూ.1200 గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీని గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల పరిమితితో అమలు చేస్తే, కేసీఆర్ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందని, తమ ప్రభుత్వం వచ్చాక రూ.10 లక్షలకు పెంచామన్నారు. హామీల అమలు, రాష్ట్ర ప్రగతి కోసం తాము 18 గంటలు పనిచేస్తుంటే, గాలి బ్యాచ్ గాలి ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈ గాలి బ్యాచ్ సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తోందని, కాంగ్రెస్ సైనికులంతా దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేసిన పనులను ఊరూరా చాటిచెప్పాలన్నారు.

ఇక్కడి గాలి పీలిస్తేనే పోరాట స్ఫూర్తి..

నల్లగొండ గడ్డమీద గాలి పీలిస్తేనే సాయుధ పోరాట స్ఫూర్తి రగులుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో తన పదవికి రాజీనామా చేసి రాష్ట్రం వచ్చాకే మళ్లీ పదవులని ప్రతిన బూనిన కొండా లక్ష్మణ్ బాపూజీ నడయాడిన నేల ఇదని అన్నారు. మలిదశ ఉద్యమంలో మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించి, తెలంగాణ ఏర్పడి, ఇందిరమ్మ రాజ్యం వచ్చాకే మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహించిన గడ్డ ఇదని ప్రశంసించారు. సాయుధ పోరాటంలో నిజాం, రజాకార్లను తరిమికొట్టిన మల్లు స్వరాజ్యం, బీఎన్ రెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రాంచంద్రారెడ్డి, ధర్మభిక్షం వంటి నేతలను ఆదరించిన గడ్డ ఇదని చెప్పారు. ఎందరో యోధులున్న గడ్డపై ప్రజాప్రభుత్వం ఏడాది ఉత్సవాలను జరుపుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని చెప్పారు. జూన్ 2, 2014కి ఎంత ప్రాధాన్యం ఉందో, డిసెంబరు 7, 2023, 2024కి కూడా అంతే ప్రాధాన్యం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నల్లగొండ జిల్లా ఎంత వివక్షకు గురైందో, స్వరాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ అంతే వివక్షకు గురైందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ఈ వివక్షను సరిచేసేందుకే ఈ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డికే నీటిపారుదల శాఖ మంత్రి పదవి ఇచ్చినట్లు చెప్పారు. ఈ జిల్లా ప్రాజెక్టులకు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా, కావాల్సినన్ని నిధులు వాడుకోవచ్చని, జిల్లా ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని తెలిపారు. వైఎస్ సీఎంగా, జానారెడ్డి, కోమటిరెడ్డి మంత్రులుగా ఉన్న సమయంలో నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు, సాగు నీరిచ్చేందుకు గాను ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని చేపట్టారని గుర్తుచేశారు. ఈ పనులను పూర్తిచేస్తే జిల్లాలో 3.50 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతాయని చెప్పారు. కానీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్టుని పడావు పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు.

మెడికల్ కళాశాల వద్ద వైద్య విద్యార్థుల సెల్ఫీ


సభ విజయవంతం.. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగసభ విజయవంతం అయ్యింది. దీంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ వల్లే సభ విజయవంతం అయ్యిందని పేర్కొంటున్నాయి. సుమారు లక్ష మంది సభకు రావడంతో నల్లగొండలో పండుగ వాతావరణం నెలకొంది. కాగా, నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నాలుగు గంటల 15 నిమిషాల పాటు ఉండి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు రాత్రి 7.25కు రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

ఎస్ఎల్‌బీసీని గడువులోగా పూర్తి చేస్తాం : భట్టి

నల్లగొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ కాలువ(ఎస్ఎల్‌బీసీ) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ రాజీవ్ ప్రాంగణంలో శనివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఒక్క ప్రాజెక్టుపై కూడా సమీక్ష నిర్వహించలేదని తెలిపారు. పదేళ్ల కాలంలో ఏడాదికి కిలోమీటరు చొప్పున తవ్వినా.. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయి ఉండేదన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి, నక్కలగండి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు మాత్రమే కాక ఇతర సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని ప్రకటించారు. రూ.5వేల కోట్లలో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని భట్టి వివరించారు.

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం : ఉత్తమ్

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసి తీరుతామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తి చేయించేందుకు విదేశాల నుంచి అత్యాధునిక యంత్రాలు తెప్పిస్తున్నామన్నారు. ఆ యంత్రాల కోసం మంత్రి వెంకట్‌రెడ్డి అమెరికా వెళ్లారని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదని విమర్శించారు.

ఎస్ఎల్‌బీసీని రేవంత్ ప్రారంభించడం ఖాయం : కోమటిరెడ్డి

వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం కావడం ఖాయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ తాను డబుల్ ఆర్(రాజశేఖర్ రెడ్డి, రేవంత్ రెడ్డి) అని పిలుస్తానని తెలిపారు. తన మీద కక్షతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కనపెట్టిందని, ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరిగి ప్రాజెక్టు పనులు ప్రారంభించామని హర్షం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామన్నారు. లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును ప్రారంభించుకోవడంపై ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మరో దఫా కూడా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం మాట్లాడడం సమయం వృథా అని పేర్కొన్నారు. 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలిచి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. మూసీ ప్రక్షాళన చేపట్టి తీరుతామని స్పష్టం చేశారు. తన ప్రాణమున్నంత వరకు నల్లగొండ గడ్డకు సేవ చేస్తానని మంత్రి వెంకట్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు.


నల్లగొండ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న సీఎం, మంత్రులు

ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి

» ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే సంప్రాప్తి

» ఎక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి. సమస్త ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడమే నాకు సంప్రాప్తి' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి శనివారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశారు. పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మ బలిదానాలు, ఆకాంక్షలు, ఆశయాలన్నింటినీ కలిపి వీలునామాగా రాసి 2023 డిసెంబరు 7న తెలంగాణ తన చేతుల్లో పెట్టిందని, వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యతను రాష్ట్రం తనకు అప్పగించిందని వివరించారు. ఆ క్షణం నుంచి.. జనసేవకుడిగా ప్రజాసంక్షేమ శ్రామికుడిగా.. మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో సకల జనహితమే పరమావధిగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. 'జాతి ఆత్మ గౌరవమే ప్రాధాన్యతగా.. సహచరుల సహకారంతో.. జనహితుల ప్రోత్సాహంతో.. విమర్శలను సహిస్తూ.. విద్వేషాలను ఎదిరిస్తూ.. స్వేచ్ఛకు రెక్కలు తొడిగి ప్రజాస్వామ్యానికి రెడ్‌కార్పెట్ పరిచి.. అవనిపై అగ్రభాగాన.. తెలంగాణను నిలిపేందుకు గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ.. నాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూ.. నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా విరామం ఎరుగక.. విశ్రాంతి కోరక ముందుకు సాగిపోతున్నాను' అని తెలిపారు. గతేడాది డిసెంబరు 7న తన ప్రమాణ స్వీకారం వీడియోను కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు.

సీఎంను కలిసిన ఘంటా చక్రపాణి



హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సీఎం రేవంత్ రెడ్డి రూ.లక్ష విరాళం

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా శనివారం సంబంధిత ప్రతినిధులు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ పి.రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూపు కెప్టెన్ అజయ్ దాశరథి బృందం కూడా సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది.

అట్టహాసంగా విజయోత్సవాలు

3 రోజుల పాటు ముగింపు వేడుకలు.. భారీ ఏర్పాట్లు చేసిన హెచ్‌ఎండీఏ

» విద్యుద్దీపాల వెలుగుల్లో హైదరాబాద్.. తొలి రోజు ఆకట్టుకున్న కార్యక్రమాలు

» నేడు సాగర్ తీరంలో ఎయిర్ షో.. రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ


ఐమాక్స్ పక్కన హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్/సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన- విజయోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విజయోత్సవాల ముగింపు వేడుకలు శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకల్లో ప్రజలు కూడా భాగస్వాములయ్యేలా కార్యక్రమాలను రూపొందించారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజైన శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీ, ఫుడ్, హస్తకళలు, సాంస్కృతిక స్టాళ్లు ఏర్పాటు చేశారు. రెండో రోజైన ఆదివారం భారత వైమానిక దళం ఆధ్వర్యంలో ఎయిర్ షో, రాహుల్ సిప్లిగంజ్‌తో సంగీత కచేరీ, ఫుడ్, ఇతర స్టాళ్లు ఉంటాయి. మూడో రోజైన సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, సీఎం బహిరంగ సభ, డ్రోన్ షో, బాణసంచా, ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీత కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విజయోత్సవాలకు హెచ్‌ఎండీఏ భారీ ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శనివారం హుస్సేన్‌సాగర్ తీర ప్రాంతాలన్నీ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లకు సందర్శకులు పోటెత్తారు. రాష్ట్ర సచివాలయం, బీఆర్‌కేభవన్‌లు త్రివర్ణ విద్యుద్దీపాలతో ఆకట్టుకుంటున్నాయి. హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌తో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆహార, హస్తకళల స్టాల్స్ సందర్శకులతో నిండిపోయాయి.

నేడు వైమానిక ప్రదర్శన

విజయోత్సవ సంబరాల వేళ ఆదివారం సాయంత్రం 4 గంటలకు భారత వైమానిక దళం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద వైమానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హుస్సేన్‌సాగర్‌పై విమాన విన్యాసాల ట్రయల్ రన్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఎయిర్ షోను అద్భుతంగా నిర్వహించేందుకు కెప్టెన్ అజయ్ దాశరథి బృందం చర్యలు చేపడుతోంది. ఈ షోలో తొమ్మిది సూర్యకిరణ్ విమానాలు పాల్గొననున్నాయి. ఎయిర్‌షోను వీక్షించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల ఏర్పాట్లూ చేయాలని సీఎస్ శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ఎయిర్ షో ముగిసిన తర్వాత ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ నేతృత్వంలో సంగీత కచేరి నిర్వహించనున్నారు.

రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

సచివాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సోమవారం సాయంత్రం 6.05 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని సీఎస్ శాంతికుమారి తెలిపారు. ఐమ్యాక్స్ పక్కన గల హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ షో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. హుస్సేన్‌సాగర్‌లోనే పెద్దఎత్తున బాణసంచా కాల్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల అనంతరం ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో సంగీత కచేరీ ఉండనుంది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో ఫుడ్ స్టాళ్లతో పాటు హస్తకళల, సాంస్కృతిక, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. విజయోత్సవ సంబరాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రజలు తెచ్చుకున్న ప్రభుత్వమిది

::: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్

బేగంపేట/పంజాగుట్ట, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తెచ్చుకున్న ప్రభుత్వమిది అని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు పోతోందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను శనివారం సాయంత్రం ఐమాక్స్ పక్కన గల హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. అనంతరం నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను, మహిళ శక్తి క్యాంటీన్లను స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం సందర్శించి తినుబండరాల రుచి చూశారు. ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజికల్ కాన్సర్ట్ ఉత్సాహంగా సాగింది.


తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రావాలని కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న పొన్నం

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకు రండి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలకు రావాలంటూ ప్రభుత్వం తరఫున విపక్షనేత కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. తెలంగాణ సమాజంలోని పరస్పర గౌరవం అనే భావనకు పెద్దపీట వేస్తూ, అలాగే తెలంగాణ సమాజాన్నంతా వేడుకలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో కేసీఆర్‌కు ఆహ్వానం పలికామని వివరించారు. కేసీఆర్ తమతో చాలా ఆప్యాయంగా మాట్లాడారని చెప్పారు. భోజనం సమయానికి ఫామ్‌హౌస్‌కు వెళ్లామని.. తప్పకుండా భోజనం చేయాలని తమను ఆయన కోరడంతో భోజనం చేశామని వెల్లడించారు. తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ నాయకులు పలు విమర్శలు చేస్తున్నారంటూ విలేకరులు ప్రశ్నించగా.. పొన్నం సమాధానం ఇస్తూ రాజకీయంగా ఇలాంటివి బయట మాట్లాడుకోవడం సహజం అని, కేసీఆర్‌తో భేటీ సందర్భంగా ఈ విషయం తమ మధ్య చర్చకు రాలేదని చెప్పారు.

గవర్నర్, కేంద్రమంత్రిని ఆహ్వానించిన పొన్నం

ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో పాల్గొనాలంటూ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ప్రభుత్వం ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి శనివారం రాజ్‌భవన్లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని పొన్నం ప్రభాకర్ రాజ్‌భవన్ దిల్ కుశా అతిథి గృహంలో కలుసుకున్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో పాల్గొనాలని, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రావాలని కిషన్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు.

సీఎంను కలిసిన.. భారత వైమానిక దళం ఏరోబాటిక్ టీమ్

అల్వాల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ సభ్యులు హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమయ్యారు. 1996లో ఏర్పాటైన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ సభ్యులు శుక్రవారం నగరంలో అద్భుతమైన గగనతల విన్యాసాలను చేశారు. ఆదివారం కూడా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రదర్శన ఇవ్వనున్నారు. వీరి విన్యాసాల్లో 9 హాక్ ఎంకే-132 విమానాలు అత్యంత సమీపంలో ఎగురుతాయి. ఈ బృందంలో 12 మంది పైలెట్లు ఉన్నారు. టీమ్ లీడర్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి సుఖోయ్-30 ఎంకే1 పైలెట్. డిప్యూటీ లీడర్‌గా గ్రూప్ కెప్టెన్ సిద్దేష్ కార్తీక్ ఉన్నారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి

» డిప్యూటీ సీఎంకు ఉద్యోగ సంఘాల జేఏసీ వినతి

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పింఛనుదారుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు 54 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జేఏసీ ప్రతినిధులు అందజేశారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం.. దశల వారీగా ఆర్థికేతర సమస్యలన్ని పరిష్కరిస్తామని, ఉద్యోగులకు అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

మంత్రితో ఆటో, క్యాబ్ డ్రైవర్ల జేఏసీ భేటీ

హైదరాబాద్, బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్టు ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. ఆటో బంద్‌ను విరమించిన తెలంగాణ ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ప్రతినిధులు బి.వెంకటేశం(ఏఐటీయూసీ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), ఎంఎ. సలీమ్(యూటీఏడీడబ్ల్యూఏ), ఎండి.ఒమర్‌ఖాన్, ఎం.కృష్ణ (ఏఐటీయూసీ), వి.మారయ్య, ప్రవీణ్(టీయూసీఐ) శనివారం ఉదయం మంత్రి పొన్నంను కలిసి 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారని వెంకటేశం పేర్కొన్నారు.

హామీలన్నింటినీ అమలు చేసితీరుతాం: దుద్దిళ్ల

గీసుగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. హన్మకొండ జిల్లా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో కలిసి గీసుగొండ మండల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇండ్ల పట్టాలను అందచేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నాలుగేళ్లలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు.

ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కావాలి:జాజుల

న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓబీసీల సంక్షేమానికి ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా.. దేశంలో 72 మంత్రిత్వ శాఖలు ఉన్నాయని కానీ మెజార్టీగా ఉన్న బీసీలకు నేటి వరకు ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుతోనే ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు.

కల్వకుంట్ల కుటుంబంపైనే మాట్లాడా..

» వెలమలు తప్పుగా భావిస్తే ఉపసంహరించుకుంటా: వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనకు సంబంధించి తాను కల్వకుంట్ల కుటుంబంపైనే వ్యాఖ్యలు చేశానని, అందరు వెలమల ఉద్దేశించి మాట్లాడలేదని షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వెలమలు తప్పుగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నానని చెప్పారు. తాను ఒక యూ ట్యూబ్ చానల్‌తో మాట్లాడిన మాటలను పూర్తిగా ప్రసారం చేయకుండా అక్కడక్కడ వీడియో క్లిప్పింగ్‌లను కట్ చేసి సోషల్ మీడియాలో తప్పుడు అర్థం వచ్చేలా ప్రచారం చేశారన్నారు. వెలమలపై తనకు ఎలాంటి దురుద్దేశం లేదని వివరణ ఇచ్చారు.

తెలంగాణకు ఇద్దరు కొత్త ఐపీఎస్‌లు

హైదరాబాద్, న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు మరో ఇద్దరు కొత్త ఐపీఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. 2023 సివిల్ సర్వీస్ పరీక్ష(సీఎస్‌ఈ)లో ఉత్తీర్ణులైన మొత్తం 32 మంది ఐపీఎస్ అధికారులను దేశంలోని 25 రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందులో బిహార్‌కు చెందిన 23వ ర్యాంకర్ సౌరబ్ శర్మ, హరియాణాకు చెందిన 29వ ర్యాంకర్ సలోని ఛబ్రాను తెలంగాణకు పంపింది. తెలంగాణకు చెందిన మూడో ర్యాంకర్ దోనూరు అనన్య రెడ్డి, 27వ ర్యాంకర్ నందాల సాయికిరణ్‌లను మహారాష్ట్రకు కేటాయించింది.

భగవద్గీత పోటీల్లో విజేతగా ముస్లిం అమ్మాయి

కేశంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఓ ముస్లిం అమ్మాయి విజేతగా నిలిచింది. గీతా జయంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కేశంపేటలో శ్రీ కిషన్ ప్రభు గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం భగవద్గీత కంఠస్థ పోటీలు జరిగాయి. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక స్థాయిలో భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగంలోని మొదటి పది శ్లోకాలు, ఉన్నత స్థాయిలో పూర్తి అధ్యాయంలోని 20 శ్లోకాలు కంఠస్థంగా చెప్పాలి. దీనిలో కేశంపేట ఆదర్శ విద్యాలయంలో నాలుగో తరగతి చదువుతున్న ఆసియా బేగం ప్రథమ బహుమతి సాధించి శభాష్ అనిపించుకుంది.


ఆసియా బేగం

యువత జ్ఞానం సమాజానికి ఉపయోగపడాలి

» నల్సార్ లా వర్సిటీ ఉప కులపతి ఆచార్య శ్రీకృష్ణదేవరావ్

» విజ్ఞాన్ వర్సిటీలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం



గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని మార్చే శక్తిమంతమైన ఆయుధం విద్య ఒక్కటేనని హైదరాబాదులోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ఆచార్య శ్రీకృష్ణ దేవరావ్ అన్నారు. శనివారం గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వితీయ స్నాతకోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి నైపుణ్యం, ప్రతిభ ఉన్న విద్యార్థులను విజ్ఞాన్ వర్సిటీ అందించడం హర్షణీయమని అన్నారు. విద్య అనేది చిన్న జిజ్ఞాస, లక్ష్యంతో మొదలై జ్ఞానం, సామర్థ్యాలు అనే పెద్ద వృక్షంగా పెరుగుతుందన్నారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ చెప్పినట్టుగా జ్ఞానం సృజనకు దారితీస్తుందని, సృజన ఆలోచనకు, ఆలోచన జ్ఞానానికి, జ్ఞానం వ్యక్తిని గొప్పగా మారుస్తుందన్నారు. యువత జ్ఞానం, నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం సందర్భంగా 860 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు మేనేజమెంట్ సభ్యులు, డీన్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి.. అధికారంలోకి

(మొదటిపేజీ తరువాయి)

మోసం చేసిందన్నారు. తెలంగాణలో ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు, రైతులకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, నిరుద్యోగులకు భృతి ఇస్తామని మోసపూరిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అందుకే వీరిని తాను మాయలోళ్లని అంటున్నానని ఎద్దేవా చేశారు. మహిళలకు ప్రతీ నెలా రూ.2,500 ఇస్తామన్న హామీ, షాదీ ముబారక్, తులం బంగారం, లక్ష రూపాయల నగదు ఏమైందని ప్రశ్నించారు. అప్పులు చేసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని పేర్కొంటూ.. అధికారంలో ఉన్నంతకాలం అప్పులతో నడిపిద్దామని, ఆ తర్వాత సంగతి తర్వాత అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ధోరణి ఉందని విమర్శించారు. తెలంగాణకు రూ.1.60 లక్షల కోట్లు గ్రాంట్‌గా ఇచ్చామని నడ్డా తెలిపారు. స్మార్ట్ సిటీలు వరంగల్, కరీంనగర్‌లకు రూ.27 వేల కోట్లు కేటాయించామని, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, రైల్వేలకు ఆర్థిక సహకారం అందించామన్నారు. మూడు వందేభారత్ రైళ్లు, జాతీయ రహదారులు, బీబీనగర్‌లో ఎయిమ్స్ వంటి ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసిందని వెల్లడించారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉండగా, 6 రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ ఒక్కసారి అధికారంలోకి వస్తే ఇక శాశ్వతంగా అధికారంలోనే ఉంటుందని, ఈ మేరకు రాష్ట్రంలో కమలాన్ని వికసింపజేయాలని కార్యకర్తలకు నడ్డా పిలుపునిచ్చారు.

రేవంత్, కేసీఆర్ కవలలు: కిషన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కవల పిల్లల్లాంటివారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో కనిపించిన అదే అహంకారం, అదే కుటుంబపాలన, అదే అవినీతి కాంగ్రెస్ పాలనలోనూ కొనసాగుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల డీఎన్‌ఏ ఒకటేనని, అవి ఒకే తానుముక్కలని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది కానీ, అవి గాలి మాటలేనని ఏడాది పాలనలో తేలిపోయిందని విమర్శించారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలు నెరవేరాలన్నా, నిజమైన మార్పు రావాలన్నా బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దింపే వరకు, కాషాయ జెండా ఎగురవేసేవరకూ పోరాటం ఆపబోమని ప్రకటించారు.

అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ కీలుబొమ్మ

అర్బన్ నక్సలైట్ల చేతిలో సీఎం రేవంత్ కీలుబొమ్మగా మారారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్ర మంత్రివర్గంలో సగం మంది అర్బన్ నక్సల్ భావజాలం ఉన్నవారేనని, అదే భావజాలం ఉన్న వ్యక్తిని విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. 'స్వామి వివేకానంద, బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే, కొమ్రం భీం, సేవాలాల్ మహరాజ్‌లా మారుతారా? లేక నక్సలైట్లుగా మారుతారా? రాష్ట్ర ప్రజానీకం తేల్చుకోవాలి' అని పేర్కొన్నారు. 'భాగ్యనగర్‌ను మరో బంగ్లాదేశ్‌లా మార్చేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నింది. బంగ్లాదేశ్‌లో మాదిరిగా ఇక్కడ కూడా హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భాగ్యనగర్‌ను మరో బంగ్లాదేశ్ కానివ్వబోం' అని బండి సంజయ్ తేల్చి చెప్పారు. బీజేపీ ఉద్యమిస్తేనే రేవంత్ సీఎం అయ్యారని పేర్కొంటూ, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, సనాతనధర్మం కోసం ఎప్పుడైనా కొట్లాడారా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. ఏడాదిలో తాము 13 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇచ్చినట్లు నిన్నటిదాకా టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి చెబితే, 50 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్పారని సంజయ్ విమర్శించారు. ఈ ఉద్యోగాలు ఇచ్చింది పాకిస్థాన్‌లోనా? బంగ్లాదేశ్‌లోనా? అని ఎద్దేవా చేశారు. 317 జీవోపై ఎందుకు మాట్లాడటం లేదని సీఎంను నిలదీశారు. మోదీ ప్రభుత్వం పీఎంఏవై కింద నిధులు ఇస్తుంటే, ఇందిరమ్మ ఇళ్లు అనే పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల వద్ద మోదీ ఫోటో పెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అటకెక్కించిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. హామీలను అమలు చేయాల్సిందిపోయి ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి రావడం ఇష్టంలేని కొన్ని విదేశీ శక్తులకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి వంత పాడుతున్నారని ఆరోపించారు.


కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన సభకు హాజరైన జనం

రాజాసింగ్ ఎక్కడ?

బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు నగరానికి చెందిన ముఖ్య నాయకుడు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాకపోవటం చర్చనీయాంశంగా మారింది.

పది నెలల్లోనే రేవంత్ సర్కారు అభాసుపాలు

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, హామీలు అమలుకాకున్నా సరేగానీ.. తమను బతకనిస్తే చాలు అన్నట్లుగా రాష్ట్రంలో ప్రజల పరిస్థితి తయారైందన్నారు. 50 మంది ఆటోడ్రైవర్లు, చేసిన పనులకు బిల్లులు రాక 48 మంది మాజీ ప్రజాప్రతినిధులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పది నెలల్లోనే రేవంత్ ప్రభుత్వం ప్రజల్లో అభాసుపాలైందన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది పాలన కాదని, ఏడాది దినం అని దుయ్యబట్టారు. విగ్రహాల రూపాలు, పార్టీల జెండాలు మారాయే తప్ప ప్రజల జీవితాల్లో మార్పురాలేదని, బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క కుటుంబం దోచుకుంటే ఇప్పుడు డజన్ల కుటుంబాలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, ఏం ఉద్ధరించారని సంబురాలు చేసుకుంటున్నారని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు.



బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను గజమాల, గదతో సత్కరిస్తున్న నేతలు

ఫ్లెక్సీలు ఫుల్.. జనాలు నిల్!

బహిరంగ సభకు జనాల్ని తరలించటం కన్నా కటౌట్లు, ఫ్లెక్సీల ఏర్పాటుపైనే స్థానిక బీజేపీ నేతలు, కార్పొరేటర్లు ఎక్కువ దృష్టి పెట్టినట్లుందని సభకు హాజరైన పలువురు మాట్లాడుకోవటం వినిపించింది. ఫ్లెక్సీలు ఫుల్-జనాలు నిల్ అంటూ బీజేపీ నేతలు, కార్యకర్తలే చర్చించుకున్నారు. నడ్డా ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంగణంలో చాలా భాగం ఖాళీగా కనిపించింది.

కాల్‌డేటా ఆధారంగా 'లగచర్ల'పై విచారణ

» పట్నం నరేందర్‌రెడ్డిని ప్రశ్నించిన పోలీసులు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లగచర్ల దాడి ఘటన కేసులో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని శనివారం పోలీసులు విచారించారు. కాల్‌డాటాను ఆధారం చేసుకొని ప్రశ్నలు వేశారు. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో ప్రథమ నిందితుడైన ఆయనను రెండు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు కొడంగల్ కోర్టు అనుమతించింది. దాంతో చర్లపల్లి జైలు నుంచి విచారణ నిమిత్తం వికారాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకువచ్చారు. విచారణాధికారి అయిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆయనను పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఘటనకు ముందు, ఆ తర్వాత ఎవరెవరితో మాట్లాడారు? ఏమేమి మాట్లాడారనేదానిపై విచారణాధికారి తమ వద్ద ఉన్న కాల్ డేటా వివరాల ఆధారంగా ప్రశ్నించినట్లు సమాచారం. రెండో నిందితుడైన సురేశ్ రాజ్ విచారణలో చెప్పిన అంశాల ఆధారంగా కూడా ప్రశ్నలు వేశారు. ఎవరి ఒత్తిడి మేరకు లగచర్ల రైతులను అధికారులపైకి ఉసిగొల్పారు? ఈ ఘటన వెనక ఎవరున్నారు? అని ప్రశ్నించారు.


అప్పాయిపల్లి సమీపంలో వర్షానికి తడిసి ముద్ద అయిన వడ్లు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

» వికారాబాద్ జిల్లాలో రైతులకు ఊహించని కష్టం

కొడంగల్ రూరల్/యాలాల/ ఆమనగల్లు, జమ్మికుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వికారాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం అకస్మాత్తుగా కురిసిన వర్షం రైతులను కన్నీరు పెట్టించింది. పలు ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం అకాల వర్షం దెబ్బకు తడిచిపోయింది. ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానావస్థలు పడ్డారు. వికారాబాద్ జిల్లాలోని మహబూబ్‌నగర్- చించోలి హైవేపై శనివారం 12గంటల సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఆ రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. అలాగే, యాలాల మండలంలో తేలికపాటి వర్షం కురవగా.. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు కప్పేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఆమనగల్లులో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవగా.. మార్కెట్ యార్డులో విక్రయానికి రైతులు తెచ్చిన ధాన్యం తడిసింది. రెండు, మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఇక్కడ ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో అకాల వర్షం నష్టం కలిగించింది. ఇక, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవగా పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం కొట్టుకుపోయింది. ఆబాది జమ్మికుంటకు చెందిన జక్కె సంపత్ అనే రైతు పది రోజుల క్రితం 30క్వింటాళ్ల ధాన్యం తీసుకురాగా తేమ ఉందని అధికారులు కాంటా పెట్టలేదు. దీంతో మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు పోశాడు. శనివారం కురిసిన వర్షానికి ఆ ధాన్యం కొట్టుకుపోయింది. మరికొందరు రైతులకు చెందిన ధాన్యం కూడా తడిచిపోయింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం ఆదివారానికి బలపడనుందని, ఈ ప్రభావంతో 11వ తేదీ నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

ఉరిమే ఉత్సాహం ఉత్పాతమై..

(మొదటిపేజీ తరువాయి)

పాలయ్యారు. ఒక యువకుడు మాత్రం అద్దాలు పగులగొట్టి ఈదుకుంటూ ఒడ్డుకు చేరి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఎల్లలెరుగని ఉత్సాహంలో మితిమీరిన వేగం, నిర్లక్ష్యంతో కూడిన డ్రైవింగ్ ఇలా ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి సమీపంలో ఈ ఘోరం జరిగింది. మృతులంతా 19-23 ఏళ్ల మధ్య వయస్కులే.. హైదరాబాద్ వాస్తవ్యులే! బాధితుల కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం ఎల్బీనగర్‌కు చెందిన వంశీ (23), మజీద్‌గల్లీలో నివాసం విఘ్నేశ్ (21), హర్షవర్ధన్ (19), ఆర్టీసీ కాలనీకి చెందిన అక్షయ్ (19), వాస్తుకాలనీ సిరినగర్‌కు చెందిన వినయ్ (20), మణికంఠ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరంతా శుక్రవారం పొద్దున ఓ చోట కలుసుకున్నారు. వంశీకి కారు ఉండటంతో సరదాగా బయట తిరిగొద్దామనుకున్నారు. ఆ రోజు ఉదయం 11:30కు అంతా కలిసి కారులో బయల్దేరారు. వంశీనే కారు నడిపాడు. రాత్రి ఎవ్వరూ ఇంటికి వెళ్లలేదు. ఆ రోజు రాత్రి వీరంతా భూదాన్‌పోచంపల్లిలో తిరిగారు. శనివారం తెల్లవారుజామున 2 గంటలకు ఓ చోట టీ తాగారు. ఆ సమయంలో ఏదైనా తినాలనిపించి టిఫిన్ సెంటర్ కోసం వెతగ్గా ఎక్కడా తెరిచి ఉండకపోవడంతో తినేందుకు కొత్తగూడెం వెళ్లారు. అక్కడా టిఫిన్ దొరక్కపోవడంతో తెల్లవారుజామున నీరా తాగితే బాగుంటుందని అనుకొని అందుకోసం మళ్లీ భూదాన్‌పోచంపల్లికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తెల్లవారుజామున 4:45కు జలాల్‌పూర్ శివార్లోని చెరువుకట్టపై ఓ మలుపు వద్ద అదుపు తప్పి.. పల్టీ కొట్టి చెరువులో పడింది. కారు ముందు సీట్లో కూర్చున్న మణికంఠ మినహా డ్రైవింగ్ చేస్తున్న వంశీ, వెనకాల కూర్చున్న వీరమళ్ల విఘ్నేశ్, హర్షవర్ధన్, అక్షయ్, వినయ్ మృతిచెందారు. ముందుసీట్లో కూర్చున్న మణికంఠ కార్లో నుంచి బయటపడి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాడు. మిగతా ఐదుగురికి ఈత రాకపోవడంతోనే మృత్యువాతపడినట్లుగా భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పేట్‌బషీరాబాద్: స్నేహితుడి ఇంటి వద్ద శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గుండ్లపోచంపల్లి నివాసి అయిన దొంతరి కార్తికొరెడ్డి(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. నెల్లూరు జిల్లాకు చెందిన ఆరుద్ర అనిల్(21) అనే ఆటో డ్రైవర్ ఇక్కడ అద్దెకు ఉంటున్నాడు. వీరిద్దరు శుక్రవారం రాత్రి కొంపల్లిలో ఉండే రాకేశ్ అనే వ్యక్తి ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లారు. రాత్రి భోజనం చేసి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో వారి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. కార్తిక్ అక్కడే మృతిచెందగా.. కొన ఊపిరితో ఉన్న అనిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మద్యం తాగి వాహనం నడపడమో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడపడమో ప్రమాదానికి కారణమై ఉంటుందని పోలీసులు చెప్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.